thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 268 కరీంనగర్ శుక్రవారం, 5 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## నిపుణులను స్వదేశానికి రప్పిద్దాం

### నిపుణులను ఆకర్షించేందుకు కేంద్రం ప్లాన్

న్యూఢిల్లీ : ఉన్నత విద్యపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న విధానాలతో పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ నేపథ్యంలో అమెరికా సహా విదేశాల్లో స్థిరపడిన భారతీయ, భారత సంతతి పరిశోధకులు, విద్యా నిపుణులను స్వదేశానికి రప్పించి.. వారిని ఇక్కడి విద్యా సంస్థల్లో బోధించేలా, పరిశోధనలు చేసేలా కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. దేశ పరిశోధన, సృజనాత్మక రంగాలను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. గతంలో ఇలాంటి ప్రణాళికను పరిశీలించినప్పటికీ.. విధానపరమైన జాప్యం, అనిశ్చిత పరిస్థితులు వంటి అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. అయితే అమెరికాలో ఇటీవలి పరిణామాల నేపథ్యంలో మోదీ సర్కారు.. ఈ ప్రణాళికను కొత్తగా పరిశీలిస్తోంది. పరిశోధనలు లేదా బోధన కోసం నిర్దిష్ట కాలంపాటు భారత్‌లో గడిపేందుకు సిద్ధంగా ఉన్న వారిని తిరిగి తీసుకురావడం కోసం విద్య, శాస్త్ర సాంకేతిక శాఖలతో సంప్రదించి ఒక పథకాన్ని రూపొందిస్తున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.




## హిడ్మా ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ కీలక లేఖ

హైదరాబాద్ : మావోయిస్టు కీలక నేత హిడ్మా ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ మరో సంచలన లేఖను విడుదల చేసింది. హిడ్మాది పూర్తిగా బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ పేరుతో లేఖ విడుదలైంది. హిడ్మాతో పాటు శంకర్లను పట్టుకుని చిత్రహింసలు పెట్టి చంపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి చెందిన కొందరు కలప వ్యాపారుల ద్రోహం వల్లనే వీళ్ళు దొరికిపోయారని మండిపడ్డారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా, శంకర్లు చికిత్స కోసం విజయవాడకు వెళ్లినట్లు చెప్పారు. కలప వ్యాపారులతో కలిసి విజయవాడకు వెళితే వాళ్ళని పట్టుకున్నారన్నారు. వారం రోజుల పాటు చిత్రహింసలకు గురిచేసి ఆంధ్రా పోలీసులు చంపేశారని ఆరోపించారు. హిడ్మా, శంకర్ల ఎన్‌కౌంటర్లపై సమగ్ర దర్యాప్తు చేయాలని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ లేఖలో స్పష్టం చేశారు. కాగా.. గత నెలలో (నవంబర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో రెండు భారీ ఎన్‌కౌంటర్లు జరిగిన విషయం తెలిసిందే. నవంబర్ 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావో కీలక నేత హిడ్మాతో పాటు ఆయన భార్య, పలువురు అనుచరులు హతమవ్వగా, నవంబర్ 19న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ శంకర్ సహా ఆరుగురు మృతి చెందారు. ఈ రెండు ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోయిస్టులు హతమయ్యారు. అలాగే ఘటనా స్థలంలో దొరికిన డైరీలోని సమాచారం ఆధారంగా ఏపీలోని పలు జిల్లాల్లో పోలీసులు తనిఖీలు చేసి దాదాపు 50 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. **(పూర్తి వివరాలు 4వ పేజీలో)**




## ఏడాదిలో కొత్త విధానం

దిల్లీ: జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి గుడ్‌న్యూస్. టోల్‌ప్లాజాల వద్ద ఇకపై ఒక్క క్షణం కూడా ఆగాల్సిన అవసరం లేదు. దీనికి సంబంధించిన కొత్త ఎలక్ట్రానిక్ సిస్టమ్ త్వరలో అందుబాటులోకి రానుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ప్రస్తుత విధానం తెర మరుగై.. ఏడాదిలోనే దేశవ్యాప్తంగా అమల్లోకి రానుందని తెలిపారు. ప్రస్తుతం 10 ప్రాంతాల్లో ఈ తరహా విధానాన్ని అమలుచేస్తున్నామని, దాన్ని దేశవ్యాప్తంగా విస్తరించనున్నామని తెలిపారు. ఈ మేరకు లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో దీనిపై ఆయన మాట్లాడారు. "ప్రస్తుత టోల్ వసూలులో కొత్త విధానం అందుబాటులోకి రానుంది. ఇకపై టోల్‌ప్లాజాల వద్ద ఎవరూ మిమ్మల్ని ఆపరు. దేశవ్యాప్తంగా ఏడాదిలో దీన్ని అమలుచేయనున్నాం" అని గడ్కరీ తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రూ.10 లక్షల కోట్ల విలువైన 4500 హైవే ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని చెప్పారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల విడుదల చేసిన ఓ ప్రకటన ప్రకారం.. టోల్ ప్లాజాల వద్ద ఫీజు వసూలు చేసేందుకు నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ కార్యక్రమాన్ని ఎన్‌పీసీఐ తీసుకొచ్చింది. ఇది కూడా ఫాస్టాగ్ ద్వారానే పని చేస్తుంది. టోల్‌ప్లాజా మీదుగా వెళ్లినప్పుడు వాహనం ఆపాల్సిన అవసరం లేకుండానే యూజర్ బ్యాంక్ అకౌంట్ నుంచి ఫీజు ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది.




## తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ బిగ్ అలర్ట్

తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా ఏపీలోని నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు ఫ్లాష్‌ఫ్లడ్ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఆకస్మిక వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. నదులు, వాగులు ఉప్పొంగే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. దిత్వా తుపాను (%జఎఎశ్రీశీఅవ ఐఱ్‌ఖ్ష్ట్ర%) ప్రభావంతో నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తుండగా, కొన్ని ప్రాంతాల్లో రహదారులు నీటమునిగాయి. రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. విద్యుత్ సరఫరా కూడా కొన్ని చోట్ల నిలిచిపోయింది. అత్యవసర పరిస్థితుల్లో సహాయక బృందాలు సిద్ధంగా ఉన్నాయని అధికార యంత్రాగం తెలిపింది. ప్రజలు అవసరమైతే మాత్రమే బయటకు రావాలని.. వర్షాల సమయంలో వాగులు, చెరువుల దగ్గరికి వెళ్లకూడదని సూచించారు. గూడురులో భారీ వర్షం కారణంగా.. నాలుగు కాలనీల్లోకి వరద నీరు చేరింది. చిల్లకూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది.

గూడూరు, విందూరులకు పూర్తిగా రాకపోకలకు నిలిచిపోయాయి. పంబలేరు, ఉప్పుటేరు వాగులు పొంగిపొర్లుతున్నాయి. వాకాడు బ్యారేజ్ 8 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఇక తెలంగాణలో కూడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంటోంది. హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది. రైతులు తమ పంటలను రక్షించుకోవాలని సూచించింది. వర్షాల ప్రభావం వల్ల రవాణా, విద్యుత్ వ్యవస్థల్లో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అదే సమయంలో..

**తెలంగాణలో చలి తీవ్రత...** ఈ నెల 9వ తేదీ తర్వాత తెలంగాణ అంతటా చలి తీవ్రత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాత్రి, ఉదయం వేళల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలు ఉన్నవాళ్లు, వృద్ధులు, చిన్నపిల్లలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.




ఆదిలాబాద్: ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్‌ను దించి.. పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. "రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారు. ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటోంది. సంక్షేమం-అభివృద్ధి రెండుకళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నాం. రెండేళ్లుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నా. చిన్న వయసులోనే నాకు గొప్ప అవకాశం దక్కడం.. ప్రజల దీవెన, దేవుడి సంకల్పం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు విపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా అనుమతించలేదు. ఎమ్మెల్యేలను కూడా సచివాలయంలోకి రాకుండా అడ్డుకున్న ప్రభుత్వాన్ని గత పదేళ్లలో చూశాం. ఏ ఆశయంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో.. గత పదేళ్లలో అది నెరవేరలేదు. రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంటరీ రూపొందించాం. పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంద్రవెల్లి స్ఫూర్తిగానే గత ప్రభుత్వంపై నేను పోరాటం ప్రారంభించా. అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల స్థూపం పర్యాటకంగా అభివృద్ధి చేసే దస్త్రంపై సంతకం పెట్టాను. ఆదిలాబాద్‌కు సాగునీరు అందేలా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును వైఎస్ఆర్ చేపట్టారు.

మాజీ సీఎం కేసీఆర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. మూడేళ్లకే కాళేశ్వరం కూలింది. ప్రజల సొమ్ము దోచుకుని అక్రమ సొమ్ము కోసం ఇవాళ ఆ కుటుంబంలో గొడవలు పడుతున్నారు. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్దే నిర్మించి ఆదిలాబాద్‌కు నీరు ఇస్తాం. ఎన్నికల ఉత్సవం పూర్తి కాగానే మరో 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం" అని సీఎం హామీ ఇచ్చారు. రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, తదితరులు సభలో పాల్గొన్నారు.




## కేసీఆర్ కుటుంబంలో కాసుల పంచాయితీ.. సీఎం రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్

ఆదిలాబాద్, డిసెంబరు 4 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ చేసిన పాపం ఊరికే పోదని విమర్శలు చేశారు. కేసీఆర్ కుటుంబంలో కాసుల పంచాయితీ తప్ప.. మరొకటి లేదని ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్ము తిన్నవారు ఎవరూ బాగుపడే చరిత్ర లేదని హెచ్చరించారు. ఒక పెద్దాయన ఆదిలాబాద్‌కు దెయ్యంలా పట్టారని సెటైర్లు గుప్పించారు. కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందని.. వారింట్లో కాసులు కురిశాయని విమర్శించారు.

ఆ ప్రాజెక్టు పేరు మారిందని, ప్లేస్ మారింది, అంచనాలు లక్ష కోట్లకు పెరిగాయని ఆరోపించారు. ఇవాళ(గురువారం) ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొని ప్రసంగించారు. గత నిరంకుశ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపారని విమర్శించారు. గత పాలకులు ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పాలించారని ధ్వజమెత్తారు. విపక్ష నేతలను కలుపుకుని తాము ముందుకు వెళ్తున్నామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ సభల్లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ఎప్పుడైనా మాట్లాడే అవకాశం ఇచ్చారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు.

గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సచివాలయానికి వెళ్తే గేట్లకు తాళం వేసి అడ్డుకున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఓటును ఆయుధంగా మార్చి ప్రజాపాలన తీసుకువచ్చారని తెలిపారు. రెండేళ్లలో ఏరోజూ తాను విశ్రాంతి తీసుకోలేదని చెప్పుకొచ్చారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధే లక్ష్యమని వ్యాఖ్యానించారు. సంక్షేమం - అభివృద్ధి రెండుకళ్లుగా ముందుకు సాగుతున్నామని వివరించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# బల్దియా ఎన్నికలే లక్ష్యంగా...

# బీఆర్ఎస్ వ్యూహం..

## గ్రేటర్‌లో గేర్ మార్చనున్న కారు పార్టీ..




హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ జిహెచ్ఎంసి ఎన్నికలపై భారత రాష్ట్ర సమితి ఫోకస్ పెట్టింది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభిస్తోంది.

ఈ క్రమంలోనే ఇవాళ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఇవాళ కీలక మీటింగ్ నిర్వహిస్తోంది. తెలంగాణ భవన్‌లో జరుగుతున్న ఈ మీటింగ్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, జిహెచ్ఎంసి కార్పొరేటర్లు పాల్గొంటున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీ కార్యకలాపాలు, జిహెచ్ఎంసిలోని సమస్యల మీద పోరాటాలపై నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారని సమాచారం.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ కు పట్టం కట్టారు. 99 సీట్లు దక్కించుకొని సంచలనం రేపింది. కానీ 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలం 65 స్థానాలకు తగ్గింది. అదే సమయంలో బీజేపీ బలం 42 స్థానాలకు పెరిగింది. ఎంఐఎం పార్టీ కూడా 42 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీ కేవలం 2 స్థానాలకే పరిమితమైంది. మరోవైపు 2023 జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ కు గ్రామీణ ప్రాంత ఓటర్లు గట్టి షాక్ ఇచ్చారు. కర్రు కాల్చి వాత పెట్టారు.

అదే సమయంలో గ్రేటర్ హైదరాబాద్ ఓటర్లు ఈ పార్టీకి మెజారిటీ స్థానాలు కట్టబెట్టారు. కానీ ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ప్రజలు ఛీ కొట్టారు. ఒక్క పార్లమెంట్ స్థానాన్ని కూడా కట్టబెట్టలేదు ప్రజలు. అటు కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ కు జరిగిన ఉప ఎన్నికల్లో ఆ పార్టీ సిట్టింగ్ స్థానాల్లో ఓడిపోయింది. ఎమ్మెల్యేలు చనిపోయిన సెంటిమెంట్ కూడా వర్కౌట్ కాలేదు.

అటు మధ్యలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి బీఆర్ఎస్ ఎలాంటి ప్రభావాన్ని చూపించలేకపోయింది. అందుకే రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటి హైదరాబాద్ నగరం తన పట్టు నిలుపుకోవాలని ప్రయత్నం చేస్తుంది. అందుకు ఇప్పటి నుంచే ప్రచార కార్యక్రమాలను ముమ్మురం చేయాలనే ఉద్దేశ్యంతో ఈ రోజు తన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారు. ఈ రకంగా నైరాశ్యంలో కూరుకుపోయిన పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపనున్నారు.

చురకలు






## పుష్ప 2 తొక్కిసలాట ఘటన.. కన్నీళ్లు పెట్టిస్తున్న శ్రీతేజ్ తండ్రి మాటలు..

పుష్ప 2 సినిమా రిలీజ్ సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్ దగ్గర తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోయింది. 10 ఏళ్ల ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. నిన్నటితో(బుధవారం)తో ప్రమాదం జరిగి ఏడాది పూర్తయింది. ప్రమాదం జరిగి సంవత్సరం అయినా కూడా శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. ఇప్పటికీ మాట్లాడలేకుండా.. నడవలేకుండా ఉన్నాడు. కొడుకు ఆరోగ్య పరిస్థితిపై శ్రీతేజ్ తండ్రి భాస్కర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పరిస్థితి గురించి చెబుతూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆయన ఏబీఎన్‌తో మాట్లాడుతూ... 'నా భార్యను కోల్పోయి ఏడాది అయింది. శ్రీ తేజ్‌కు గత నాలుగు నెలల నుంచి ఇంటి వద్దనే చికిత్స అందిస్తున్నాం. ఇంటి వద్ద చికిత్స కష్టతరంగా మారింది. ట్రీట్మెంట్ కోసం గత 15 రోజులుగా మళ్లీ రీహాబిలిటేషన్ సెంటర్‌కు తీసుకు వస్తున్నాము. అల్లు అర్జున్ మా బాబు శ్రీ తేజ్ వైద్య ఖర్చుల విషయంలో అన్ని విధాల సాయంగా ఉంటామని హామీ ఇచ్చారు. శ్రీ తేజ్ మాట్లాడటం లేదు... ఎవర్నీ గుర్తు పట్టడం లేదు. అమ్మ ఏదీ అని ఒక్కోసారి మా పాప అడుగుతూ ఉంది. ఆ సమయంలో వేరొక విషయాలు చెప్పి డైవర్ట్ చేస్తున్నాం.

శ్రీ తేజ కోలుకోకపోవడంతో ఉద్యోగం మానేశా. ఎప్పుడు కోలుకుంటాడో డాక్టర్లు చెప్పడం లేదు. భార్య దక్కలేదు.. కనీసం కుమారుడినైనా కాపాడుకోవాలని భావిస్తున్నాం. పెరిగిన ఖర్చులు కూడా భరిస్తామని అల్లు అర్జున్ హామీ ఇచ్చారు' అని అన్నారు. కాగా, శ్రీ తేజ్ ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం గతంలో అల్లు అర్జున్, అల్లు అరవింద్ 75 లక్షల రూపాయలు సాయం చేశారు. అంతేకాదు.. భాస్కర్ కుటుంబాన్ని ఆదుకోవటానికి 2 కోట్ల రూపాయలు అకౌంట్‌లో డిపాజిట్ చేసినట్లు నిర్మాత దిల్ రాజు తెలిపారు.





హైదరాబాద్, డిసెంబర్ 4: సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ, ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులకే సైబర్ నేరగాళ్లు షాకిచ్చారు. ఏకంగా పోలీస్ శాఖకు చెందిన రెండు వెబ్‌సైట్లను కేటుగాళ్లు హ్యాక్ చేశారు.

సైబరాబాద్, రాచకొండ పోలీస్ వెబ్‌సైట్లను సైబర్ నేరగాళు హ్యాక్ చేశారు. దీంతో వారం రోజులుగా రెండు కమిషనరేట్ల పోలీస్ వెబ్ సైట్లు పని చేయని పరిస్థితి. వెబ్ సైట్లలో మాల్వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీస్ స్టేషన్ల వివరాలతో పాటు పోలీస్ అధికారుల కాంటాక్ట్ నంబర్లు కూడా హ్యాక్‌కు గురైనట్లు తెలుస్తోంది. దీంతో రెండు కమిషనరేట్ల ఐటీ బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. సమస్యను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాయి. వెబ్ సైట్ల పునరుద్ధరణకు నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ పర్యవేక్షణలో ఢిల్లీకి చెందిన సైబర్ సెక్యూరిటీ సంస్థ ప్రతినిధులు పనిచేస్తున్నారు. రెండు కమిషనరేట్ల వెబ్‌సైట్లకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను పోలీసులు అప్డేట్ చేయిస్తున్నారు. మరోసారి హ్యాకింగ్‌కు గురి కాకుండా అధునాతన ఫైర్వాల్స్ ఐటీ టీమ్ ఆడిట్ చేస్తోంది.

రెండు కమిషనరేట్లకు చెందిన వెబ్‌సైట్లకు హ్యాకింగ్ చేసిన ముఠాను పట్టుకునేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేం: హైకోర్టు



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్ల వ్యవహారంలో దాఖలైన ఆరు పిటిషన్‌లపై విచారించిన హైకోర్టు ఇవాళ తీర్పు వెలువరించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. చట్టప్రకారం ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం తెలిపింది. ఎస్సీ, ఎస్టీ జనాభా లేని చోట కూడా ఆయా కులాలకు వార్డుమెంబర్లు, సర్పంచి రిజర్వేషన్లు కేటాయించారన్న పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచి రిజర్వేషన్లు కేటాయించడం వల్ల తప్పులు దొర్లాయని తెలిపారు. రిజర్వేషన్లు కేటాయించిన చోట సంబంధిత కులానికి చెందిన వ్యక్తులు లేకపోతే ఎన్నికల నిర్వహించబోమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. ఎస్ఈసీ వాదనను రికార్డు చేసుకున్న హైకోర్టు.. పిటిషన్లపై విచారణ ముగించింది.




## కోతుల సమస్యపై లోక్‌సభలో చర్చించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఢిల్లీ, డిసెంబరు 4 : కోతుల బెడదతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పెద్దమొత్తంలో వానరాలు పంటలను పాడు చేస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఈ సమస్యను నివారించేందుకు జాతీయ స్థాయిలో కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కోతుల సమస్యపై ఇవాళ(గురువారం) లోక్‌సభ జీరో అవర్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సమస్య తమ శాఖ కిందకు రాదని కొన్ని ప్రభుత్వ శాఖలు తప్పించుకుంటున్నాయని.. వానరాల సమస్య ఏ శాఖ కిందకు వస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. కోతుల సమస్య చిన్న విషయం లాగా అనిపిస్తోందని.. కానీ అందరూ ఈ సమస్య గురించి తెలుసుకుని నవ్వుతారని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు దేశంలోని చాలా రాష్ట్రాల్లో కోతుల సమస్య ఉందని గుర్తుచేశారు. ఈ విషయంలో నోడల్ ఏజెన్సీ అవసరమని చెప్పారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కోతుల సమస్యను ప్రజలు ప్రస్తావిస్తున్నారని గుర్తు చేశారు.

సర్పంచ్ ఎన్నికల్లో కూడా ఈ సమస్య ఒక ఎజెండాగా మారిందని పేర్కొన్నారు. వానరాల సమస్యను పరిష్కరిస్తే సర్పంచ్‌గా గెలిపిస్తామని ప్రజలు అంటున్నారని.. దేశ రాజధాని ఢిల్లీలో కూడా ఈ సమస్య తీవ్రంగా ఉందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు.

## భారీగా అక్రమాస్తులు.. ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్ అరెస్ట్



హైదరాబాద్: అక్రమాస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏడీ శ్రీనివాస్ నివాసం, బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు తెలంగాణ, ఏపీ, కర్ణాటకల్లో భారీగా ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. మొత్తం ఆరు ప్రాంతాల్లో సోదాలు చేసిన అధికారులు.. రాయదుర్గం మైహోంభుజలో ఫ్లాట్, కర్ణాటకలో 11 ఎకరాల వ్యవసాయ భూమి, అనంతపురంలో 11 ఎకరాలు, మహబూబ్‌నగర్‌లో నాలుగు ప్లాట్లు, నారాయణపేటలో రైస్ మిల్లు, 3 ప్లాట్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. సోదాల్లో రూ.5లక్షల నగదు, 1.6 కిలోల బంగారం, 770 గ్రాముల వెండి, 2 కార్లు, పలు పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## బీజాపూర్‌లో మరోసారి ఎదురుకాల్పులు.. 19కి చేరిన మావోయిస్టుల మృతులు



చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్-దంతెవాడ సరిహద్దు అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య మరోసారి ఎదురు కాల్పులు జరిగాయి. బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు, ముగ్గురు డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) జవాన్లు మృతి చెందారు. గురువారం నాటికి మృతుల సంఖ్య మరింత పెరిగింది. మొత్తంగా బుధ, గురువారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 19 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలి నుంచి మావోయిస్టుల మృతదేహాలతో పాటు పెద్దఎత్తున ఆయుధ, పేలుడు సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బీజాపూర్ సరిహద్దుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన డీఆర్‌జీ జవాన్లు మోను వడాడి, దుకారు గోండె, రమేశ్ సోడి మృతదేహాలను బీజాపూర్‌లోని పోలీసు లైన్‌కు గురువారం తీసుకువచ్చారు. అక్కడ వారికి పోలీసు, జిల్లా ఉన్నతాధికారులు నివాళి అర్పించారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.




హైదరాబాద్: తెలంగాణ సెంటిమెంట్‌తో భారత రాష్ట్ర సమితి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. దేవుళ్ల విషయంలో సీఎం రేవంత్ చెప్పిన సామెతను రాజకీయం చేయడం తగదని చెప్పారు. "కొణిజేటి రోశయ్య, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రాంతానికి చెందిన వారు కాదు. ఈ దేశానికి వారు సంపద. బాలసుబ్రహ్మణ్యం విగ్రహం రవీంద్ర భారతిలో పెడితే తప్పేంటి? భారత రాష్ట్ర సమితి కోసమే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పనిచేస్తున్నారు. హిల్ట్ పాలసీ ద్వారా హైదరాబాద్‌లో సామాన్యులకు భూముల ధరలు అందుబాటులోకి వస్తాయి. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ మారుతుంది. అవినీతికి అలవాటు పడిన కేసీఆర్ కుటుంబానికి.. మా ప్రభుత్వం ఏం చేసినా అవినీతి అంటూ ఆరోపణలు చేయడం అలవాటుగా మారింది" అని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు.

## రూ.5లక్షల కోట్ల భూ కుంభకోణంపై క్షేత్రస్థాయిలో పోరాడతాం: కేటీఆర్



హైదరాబాద్: పారిశ్రామిక భూములను చౌకధరకు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. పారిశ్రామిక భూముల బదలాయింపు అంశంపై భారత రాష్ట్ర సమితి నిజనిర్ధారణ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాయి. ఈ క్రమంలో జీడిమెట్ల పారిశ్రామికవాడలో కేటీఆర్ పర్యటించి హమాలీలతో మాట్లాడారు. ఆరు నెలలుగా భూముల దోపిడీ జరుగుతోందని, పాలసీ ఇప్పుడు బయటికొచ్చిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవాలన్నారు. రూ. 5 లక్షల కోట్ల భూదోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజల సొమ్ము ప్రజలకే దక్కాలని డిమాండ్ చేశారు. "రూ. 5 లక్షల కోట్ల భూకుంభకోణంపై క్షేత్రస్థాయిలో పోరాడతాం. ఆషాఢం సేల్ వంటి ఆఫర్‌ను చూసి పారిశ్రామికవేత్తలు మోసపోవద్దు. రేవంత్‌రెడ్డి భూకుంభకోణంలో మీరు భాగం కావొద్దు. మా ప్రభుత్వం వచ్చాక ఆ భూములు వెనక్కి తీసుకుంటాం. రేవంత్‌రెడ్డి అవినీతి అనకొండ. దిల్లీకి మూటలు పంపేందుకు.. దోచుకునేందుకు కుట్ర చేస్తున్నారు. ఎవరి ప్రయోజనాల కోసం భూములను ధారాదత్తం చేస్తున్నారు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

## బాలుడిపై వీధి కుక్కల దాడి.. నివేదిక కోరిన ఎస్‌హెచ్‌ఆర్‌సీ




హైదరాబాద్: నగర శివారులోని హయత్‌నగర్ శివగంగా కాలనీలో 8 ఏళ్ల బాలుడు ప్రేమ్‌చంద్‌పై వీధి కుక్కలు దాడి చేయడంపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. పలు దినపత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా తీసుకున్న ఎస్‌హెచ్‌ఆర్‌సీ.. ఈ నెల 29లోపు నివేదిక ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, బాలుడి ప్రస్తుత పరిస్థితి, కుక్కల స్టెరిలైజేషన్, నియంత్రణ చర్యల స్థితిని నివేదికలో పేర్కొనాలని ఆదేశించింది. సుప్రీం కోర్టు ఆదేశాల అమలు పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరింది.




## ఐ బొమ్మ రవి కేసు.. బెయిల్ వస్తుందా?


ఐ బొమ్మ రవి కస్టడీ పిటిషన్లపై వాదనలు ముగిశాయి. బెయిల్, కస్టడీ పిటిషన్లపై నాంపల్లి కోర్టు రేపు(శుక్రవారం) తీర్పు ఇవ్వనుంది. ఇప్పటికే తీర్పును రిజర్వ్ చేసి ఉంచింది. ఐ బొమ్మ రవి నుంచి కీలక సమాచారాన్ని ఇంకా సేకరించాల్సి ఉందని పోలీసుల తరఫున న్యాయవాది కోర్టుకు తెలిపారు. రవి బెయిల్ పిటిషన్‌పై కూడా వాదనలు కొనసాగాయి. కేసు విచారణ దశలో బెయిల్ మంజూరు చేయవద్దంటూ పోలీసుల తరఫు న్యాయవాది కోర్టును కోరారు. 4 కేసుల్లో వేర్వేరుగా రవి పైరసీ పట్ల విచారణ చేపట్టాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. వాదోపవాదాలు విన్న కోర్టు బెయిల్ ,కస్టడీ పిటిషన్‌లపై శుక్రవారం తీర్పు వెల్లడించనుంది. విచారణ సందర్భంగా ఇమంది రవి తెలివితేటల్ని పోలీసు ఉన్నతాధికారులు గుర్తించారు. పోలీసు శాఖలోని సైబర్ క్రైమ్ విభాగంలో పని చేస్తావా? అంటూ రవిని వారు అడిగినట్లు సమాచారం. మంచి జీతం సైతం ఇస్తామని అతడికి ఆఫర్ చేశారని తెలుస్తోంది. రవి మాత్రం పోలీసులు ఇచ్చిన ఆఫర్‌ను తిరస్కరించాడట. కరేబియన్ దీవుల్లో రెస్టారెంట్ ఏర్పాటు చేస్తానని వారికి చెప్పినట్లు సమాచారం.

# నేలను పరిరక్షించడం సామాజిక బాధ్యత - డిసెంబర్ 5...ప్రపంచ నేల దినోత్సవం




ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 5న ప్రపంచ నేల దినోత్సవం జరుపుకుంటారు. ఈ రోజు మట్టిని రక్షించడానికి, దాని ప్రాముఖ్యతను గుర్తు చేసుకోవడానికి మనకు గొప్ప అవకాశం. నేల మానవజాతి జీవనాధారంగా ఉంది. తినే ఆహారం, ధరించే దుస్తులు, నివసించే ఇళ్లు అన్నీ ఈ నేలపైనే ఆధారపడి ఉంటాయి. అందుకే, నేల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయడం అత్యవసరం. ప్రపంచ నేల దినోత్సవానికి సంబంధించిన ఆలోచన ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ సాయిల్ సైన్సెస్ ద్వారా 2002లో మొదలైంది. థాయ్‌లాండ్ మహారాజు రామ IX జయంతి సందర్భంగా ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. 2013లో ఐక్యరాజ్య సమితి దీన్ని అధికారికంగా గుర్తించింది. ప్రతి ఏడాది ప్రత్యేక థీమ్ ప్రకారం ఈ దినోత్సవం జరుపుకుంటారు. 2024 సంవత్సరానికిగాను థీమ్: "Soils where food begins". ఈ థీమ్ మన ఆహార ఉత్పత్తిలో నేల కీలక పాత్రను తెలియజేస్తుంది. ప్రపంచంలోని 95% ఆహారం నేల నుంచే ఉత్పత్తి అవుతుంది. పంటలు పెరుగుదల, నాణ్యత అన్నీ మట్టిపై ఆధారపడి ఉంటాయి. మట్టి కార్బన్ ను గ్రహించి గ్లోబల్ వార్మింగ్ తగ్గించడంలో సహాయపడుతుంది. పర్యావరణ సమతుల్యతకు నేల కీలకమైన ఆవాసం. నేల ద్వారా వర్షపు నీరు భూగర్భ జలంగా నిల్వ అవుతుంది. నీటిని శుద్ధి చేయడంలో కూడా నేల పాత్ర ఉంటుంది. లక్షలాది సూక్ష్మజీవులు, ఇతర జీవులు మట్టిలోనే నివసిస్తాయి. జీవులు మట్టిని సారవంతంగా ఉంచుతాయి. నేల ఎదురు చూస్తున్న ప్రమాదాలలో ప్రధానంగా... పారిశ్రామిక వ్యర్థాలు, రసాయన ఎరువులు, ప్లాస్టిక్ వాడకం వల్ల మట్టిలో కాలుష్యం పెరుగుతోంది. అడవులను నరికి వేయడం వల్ల నేల ఎర్రబడుతోంది, కోతకు గురవుతోంది. నిరంతరం అదే భూమిలో పంటలు పండించడం వలన నేల సారం కోల్పోతోంది. భూమి క్షీణించి పంటలు పండించలేని స్థితికి చేరడం ఎడారీకరణకు దారి తీస్తుంది. నేలను పరిరక్షించే మార్గాలలో ప్రధానంగా... రసాయన ఎరువులకు బదులుగా సేంద్రీయ ఎరువులను ఉపయోగించడం ద్వారా నేల సారాన్ని పెంచడం, పంటల మిగులు భాగాలను మట్టిలో కలపడం. అడవులను పెంపొందించడం, పచ్చదనం ద్వారా నేల ద్రవ్యతను నియంత్రించడం. నీటిని అవసరానికి అనుగుణంగా మాత్రమే ఉపయోగించడం. వర్షపు నీటిని సేకరించి భూగర్భ జలాలను నింపడం. ప్రపంచ వ్యాప్తంగా... వివిధ దేశాల్లో వివిధ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు, రైతులకు నూతన పద్ధతులపై శిక్షణ ఇవ్వడం. విద్యార్థులకు నేల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం జరుగుతాయి. మన భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలంటే, మట్టిని రక్షించడం అత్యంత ముఖ్యం. "నేల కాపాడితేనే జీవితం కాపాడినట్లే" అనే నినాదం ప్రతి ఒక్కరూ గుర్తుంచు కోవాలి. అందుకే, మనందరం కలిసి నేలను పరిరక్షించేందుకు ముందడుగు వేయాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల...సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్ట్, 9440595494**

# నాటక రంగంలో నిత్య పరిశోధకులు చాట్ల శ్రీరాములు - డిసెంబర్ 5.. చాట్ల శ్రీరాములు జయంతి



ఆరున్నర దశాబ్దాల పాటు రంగ స్థలమే జీవితంగా బతికిన వ్యక్తి. నాటక రంగంలో కొత్త ప్రక్రియలు ప్రవేశ పెట్టిన నిత్య సాధకుడు, శోధకుడు, బోధకుడు, దర్శకుడు. థియేటర్ నటుడిగా ప్రాచుర్యం పొందాడు. 150 రేడియో నాటికల లోనూ నటించారు. థియేటర్ ఆర్ట్స్ రంగానికి అంకితమైన ప్రసిద్ధ సాహిత్య మరియు సాంస్కృతిక సంస్థ రసరంజని స్థాపనలో కీలక పాత్ర పోషించారు. దేశ, విదేశాలలో అనేక నాటకాలను ప్రదర్శిం చాడు. ఆంధ్రప్రదేశ్ నుండి మానవ వనరుల విభాగం నుండి ఎమెరిటస్ ఫెలోషిప్ అందుకున్న మొదటి కళాకారుడు. ఆయనే చాట్ల శ్రీరాములు. ఆంధ్ర విశ్వ విద్యాలయ రంగస్థల కళల శాఖలో దర్శకుడిగా బాధ్య తలు చేపట్టారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలోనూ బోధించారు. హైదరాబాదు విశ్వ విద్యాలయం, తెలుగు విశ్వ విద్యాలయాల్లో గౌరవ అధ్యాపకులుగా పనిచేశారు. మధు ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ లో, అక్కినేని నట శిక్షణాలయంలో అతిథి అధ్యా పకులుగా బోధించారు నాగార్జున, వెంకటేశ్ లు ఆయన శిష్య బృందం లోని వారే కావడం విశేషం. చాట్ల శ్రీరాములు (డిసెంబరు 5, 1931 - డిసెంబర్ 18, 2015) తెలుగు నాటక రంగ నిపుణుడు, ప్రయోక్త, సినిమా నటుడు. శ్రీరాములు గడ్డి అచ్చయ్య, అచ్చమ్మ దంపతులకు 1931 డిసెంబరు 5 తేదీన బెజవాడలో జన్మించిన చాట్ల 12 సంవత్సరాల వయసులో విజయవాడలో దేశిరాజు రామారావు దర్శకత్వంలో ప్రదర్శించిన 'మేవాడు పతనం' అనే హిందీ నాటకంలో ఓ బాలుని పాత్ర ద్వారా రంగస్థల ప్రవేశం చేశారు. బి.కాం. చదువుతున్న రోజుల్లో నటుడు కావాలన్న కాంక్ష, నాటకం పట్ల ఉత్సాహాన్ని పెంచుకొన్నారు. చివరి సంవత్సరంలో ఉన్నప్పుడు విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం వారు నిర్వహించే అభ్యుదయ నాటక ఉత్సవాల్లో ఎస్.ఆర్.ఆర్. కళాశాల పక్షాన 'మాస్టర్జీ' నాటకాన్ని ప్రదర్శించగా, శ్రీరాములు ఉత్తమ నటుడిగా బంగారు పతకాన్ని కైవసం చేసు కున్నారు. 1956లో భారతీయ రైల్వే శాఖలో టిక్కెట్ కలెక్టర్‌గా ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. పబ్లిక్ ఎడ్రసింగ్ సిస్టములో బొంబాయి ఆకాశ వాణి లో శిక్షణ పొందారు. లండన్ లోని బ్రిటీష్ డ్రామా లీగ్ లో 1970లో నాటక ప్రయోక్తగా, ఆచార్యునిగా శిక్షణ పొందారు.

చాట్ల 1976లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి వైస్ ఛాన్సలర్ ఎం.ఆర్. అప్పారావు కోరికపై స్టేజీ డైరెక్టర్ ఉద్యోగంలోకి ప్రవేశించారు. నాటక రంగంలో ఎన్నో ప్రయో గాలకు అదే నాంది అయింది. మధు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌కు ప్రధానాచార్యుడుగా, వివిధ కళాసంస్థల్లో సభ్యుడుగా వ్యవహరించాడు. ఆయన నాటక రంగ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ నాటకం మరో మొహెంజోదారో . తెలుగు రాష్ట్రాలే కాదు దేశమం తటా సంచలనం సృష్టించిన నాటకం ఇది. రచయిత యన్.ఆర్.నంది. దీనికి చాట్ల దర్శకత్వంతో పాటు శాస్త్రవేత్త పాత్ర పోషించారు. ఇది కమలాదేవి ఛటోపాధ్యాయ పురస్కారానికి ఎంపికైంది. గొల్లపూడి మారుతీ రావు వ్రాసిన 'లావాలో ఎర్రగులాబీ' నాటకాన్ని చాట్ల దర్శకత్వం బంగారానికి తావి అబ్బడం లాంటిదని ఎందరో విమర్శకులు ప్రశంసించారు. చాట్ల ఆనాటి ప్రముఖ నటుడు కె. వెంకటేశ్వర రావుతో కలిసి 'కాళరాత్రి' అనే నాటకానికి దర్శకత్వం వహించారు. కొర్రపాటి గంగాధరరావు రచించిన 'విష కుంభాలు', 'డిటెక్టివ్', 'భవ బంధాలు', 'తెలుగు కోసం' మొదలైన నాటకాల్లో ప్రధాన పాత్రలు పోషించాడు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు నుండి రెండు సార్లు ఉత్తమ నటుడి అవార్డు పొందారు. 1954 ప్రాంతంలో రససమాఖ్య ప్రదర్శించిన 'దొంగవీరుడు', 'మాస్టర్జీ' మొదలైన నాటకాలకు పన్నెండు బహుమతులు అందుకున్నారు. గొల్లపూడి 'లావాలో ఎర్రగులాబీ', ఆత్రేయ 'మనసు వయసు', భమిడి పాటి రాధాకృష్ణ 'దైవశాసనం', 'సత్య కామేష్ఠి' నాటకాలు శ్రీరాములుకు బాగా పేరు తెచ్చాయి. న్యాయం కావాలి, స్వప్న, సుడి గుండాలు,సంగీత, విక్రం, అగ్నిపుత్రుడు, శిశర, అగ్నిప్రవేశం తదితర చిత్రాలలో చాట్ల నటించారు. చాట్లలోని దర్శకుడు నిరంతర అన్వేషిగా, ప్రతీ నాటకం నాటికలో వైవిధ్యం ఉండాలని ఆశించారు. ఆయన ప్రతిభ ఇంటనే కాదు రచ్చలోనూ గెలిచింది. ఇంగ్లాండు, అమెరికా, పోలాండ్ తదితర దేశాల్లో పర్యటించి, అక్కడ వాళ్లకు శిక్షణ ఇచ్చారు. అనేక విశ్వ విద్యాలయాలు తమ రంగస్థల శాఖకు అధిపతిగా నియమించాయి. ఉమ్మడి రాష్ట్రం లోని తెలుగు విశ్వ విద్యాలయం, ఆంధ్రా విశ్వ విద్యాలయం, ఉస్మానియా విశ్వ విద్యాలయం వంటి కళాశాలలో సుమారు 26 సంవత్సరాల పాటు నాటకరంగ ప్రొఫెసర్ గా విధులు నిర్వహించారు. ఆధునిక తెలుగు నాటకరంగ చరిత్రలో కృత్తివెంటి నాగేశ్వరరావు, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, బళ్ళారి రాఘవ, అబ్బూరి రామకృష్ణారావు, డాక్టర్ గరికపాటి రాజారావు, ఎ.ఆర్. కృష్ణ, కె. వెంకటేశ్వర రావు వంటి హేమా హేమీల జాబితాలో చాట్ల శ్రీరాములు పేరు కూడా కలిసిం దంటే ఆయన నటనలో, దర్శకత్వం లో చేసిన అజరామరమైన కృషి, మేదస్సు రంగస్థలానికి నిలువెత్తు దర్పణం. దర్శకత్వంలో ఆయన చాలా ప్రయోగాలు చేశారు. 1970 లో లండన్లోని బ్రిటిష్ డ్రామా లీగ్ చేత ఆయనకు 'నిర్మాత మరియు ఉపాధ్యాయుడు' సర్టిఫికేట్ లభించింది. శ్రీరాములుకు1982 లో కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ అవార్డు, రెండుసార్లు ఉత్తమ నటుడిగా ఆంధ్ర నాటక కళా పరిషత్ అవార్డు లభించింది. 2003లో తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక అవార్డు ఎన్టీఆర్ పుర స్కారం, నార్త్ అమెరికా తెలుగు సొసైటీ సత్కారం, రాష్ట్ర నాటక అకాడమీ నుంచి ఉత్తమ దర్శకుడి పురస్కారాలు ఆయనకు లభించిన గౌరవాల్లో కొన్ని మాత్రమే. 2009లో తెలుగు విశ్వ విద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చింది. శ్రీరాములు సికింద్రాబాద్ రైల్వే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2015, డిసెంబర్ 18 శుక్రవారం మృతి చెందారు. **రామ కిష్టయ్య సంగన భట్ల...సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్ట్, 9440595494**




అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి పతనం కొనసాగుతూనే ఉంది. భారత్-అమెరికా డీల్‌పై అనిశ్చితులు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాలతో రూపాయి మారకం విలువ నానాటికీ క్షీణిస్తోంది. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక దశలో డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ విలువ ఏకంగా 28 పైసలు పడిపోయి 90.43 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది.

క్రితం సెషన్‌లో రూపాయి విలువ 90.15 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఈ క్షీణత మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని, రూపాయి విలువ 90.70-91 మార్క్‌ను తాకనుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొన్ని నెలలుగా భారత ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటంతో, డాలర్లకు గిరాకీ పెరిగి రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతోంది. వస్తువులకు చెల్లింపులు చేసేందుకు దిగుమతిదారులు భారీగా డాలర్లను కొనుగోలు చేస్తుండటమూ రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది.

**ఊగిసలాటలో మార్కెట్ సూచీలు**... మరోవైపు, నేటి ట్రేడింగ్‌లో స్టాక్‌మార్కెట్ సూచీలు ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలు శుక్రవారం వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. దీంతో సూచీలు స్తబ్దుగా కదలాడుతున్నాయి. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో సెన్సెక్స్ స్వల్పంగా 33 పాయింట్ల లాభంతో 85,140 వద్ద, నిఫ్టీ 6 పాయింట్ల లాభంతో 25,992 వద్ద ట్రేడ్ అవుతున్నాయి.

# ప్రజాసేవలో మేటి... రారెవరూ ఆయనకు సాటి...

## డిసెంబర్ 5... హయగ్రీవాచారి వర్ధంతి



రాజకీయాలలో రాణించడం అంత సులువేమీ కాదు. ప్రజలను నిత్యం అంటిపెట్టుకుని, వారి సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజా సేవకు అంకితం అయినా, ప్రజా ప్రతినిధులపై అసం తృప్తి ఉండడం అత్యంత సహజం. అందునా ఒక ప్రజా ప్రతినిధి తాను ప్రాతినిథ్యం వహిస్తున్న సెగ్మెంట్ ను కాకుండా, ఇతర నియోజక వర్గం నుండి గెలుపొందడం చాలా అరు దైన విషయమే. అలా మూడు నియోజక వర్గాల నుండి విజయం సాధించి రాష్ట్ర శాసనసభకు వెళ్ళిన అరుదైన నేతగా గుర్తింపు పొందారు వరంగల్ జిల్లాకు చెందిన హయగ్రీవాచారి. అంతే కాదు. నలుగురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పని చేసిన ఘనతను దక్కించుకున్న గొప్ప ప్రజా ప్రతినిధి ఆయన. వాస్తవంగా హయగ్రీవాచారి వరంగల్ జిల్లా ధర్మసాగర్ వాసి. ఆయన స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గం జనరల్‌గా ఉన్నప్పుడు అక్కడ ఒకసారి గెలిచారు. అలాగే ధర్మసాగర్ నుండి రెండు సార్లు, హన్మకొండ నుంచి ఒక సారి గెలిచారు. హయగ్రీవాచారి 1916 నవంబర్ 25 న ధర్మసాగర్ గ్రామంలో జన్మించారు. తిరునగరి శ్రీనివాసా చార్యులు అండాళమ్మ ఆయన తల్లిదండ్రులు. మూడవ తరగతి వరకు ధర్మసాగర్ లోని వీధి బడిలో చదివారు. కాంతంరాజు, రావుల నరసింహరెడ్డి వద్ద పెద్దబాలశిక్ష చదివారు. ఆ తరువాత వారి కుటుంబం హన్మకొండ పట్టణంలో స్థిరపడింది. ఆ రోజుల్లో హైదరాబాద్ సంస్థానంలో ప్రతి జిల్లా కేంద్రంలో ఒక ఉన్నత పాఠశాల ఉండేది. ఉన్నత పాఠశాలల్లో చదివే రోజుల్లోనే హయగ్రీవాచారిపై జాతీయోద్యమ ప్రభావం తీవ్రంగా పడింది. 1932లో నిర్వహించిన కాకతీయ ఉత్సవాలు ఆనాటి యువకులను ఉత్సాహ పరిచాయి. ఎంతో మందిలో ఉత్తేజాన్ని నింపాయి. ఆ ఉత్సవాల నిర్వహణలో పర్సా రంగారావు, ఉదయ రాజుశిషగిరిరావు, ఆవంచ వెంకట్రావు, మాదిరాజు రామ కోటేశ్వర రావు, కాళోజీ రామేశ్వర రావులతో పాటు విద్యార్థి సేవాదళ బాధ్యునిగా హయగ్రీవాచారి పని చేశారు. 1935లో హయగ్రీవారి మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులై ఇంటర్ లో ప్రవేశించారు. హైదరాబాద్ చేరి చదువు మధ్యలోనే ఆపేశారు. ఆ తర్వాత ఆయన పూర్తి జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశారు. వరంగల్లు అయ్యగారుగా ఆయన సుపరిచితులు. నిజాం వ్యతిరేక పోరాటం లో ప్రముఖ పాత్ర ఆయనది. స్వాతంత్రోద్యమంలో వరంగల్ నుంచి ఎదిగిన తొలితరం కాంగ్రెస్ నాయకుల్లో ఆయనొకరు. రాజకీయ సామాజిక రంగాల్లో ప్రత్యేకించి కాంగ్రెస్ పార్టీ వ్యవహా రాల్లో ఆయన తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా స్వామి రామానందతీర్థ నాయ కత్వంలో పోరాటం సాగించిన కొద్దిమంది నాయకులలో ఆయన ఒకరు. ఆయనే తిరునగరి హయ గ్రీవాచారి. హైదరాబాద్ హిందీ ప్రచార సభ అధ్యక్షుడిగా, హిందీ ప్రతిష్టాన్ వ్యవస్థాపకులుగా హిందీ భాషకు ఆయన చేసిన సేవ ఎంతో గొప్పది. వరంగల్ పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించ డానికి హయగ్రీవాచా రి ఎంతో శ్రమించారు. ఆయన కృషి ఫలితం గానే వరంగల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ వశమైంది. వయోజన ఓటింగ్ పద్ధతపై ఎన్నికైన వరంగల్ పురపాలక సంఘ తొలి అధ్యక్షుడిగా హయగ్రీవాచారి ఎన్నికయ్యారు. స్వాతంత్ర్యా నంతరం ఆయన చేపట్టిన తొలిపదవిగా, వరంగల్ పురపాలక సంఘం తొలి అధ్యకుడిగా పని చేశారు. హయగ్రీవాచారి అవిభాజ్య వరంగల్ జిల్లా నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, నలుగురు సీఎంల మంత్రివర్గంలో సభ్యుడిగా పనిచేశారు. 1972 నుంచి ఆయన మంత్రిగా పనిచేశారు. పీవీ నర్సింహారావు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, టంగుటూరు అంజయ్య, భవనం వెంకట్రామిరెడ్డి మంత్రి వర్గాలలో ఆయన పనిచేశారు. ఆయన నిర్వహించిన పదవులను సమర్ధవంతంగా చేశారనే పేరును సంపాదించు కున్నారు. పంచాయతీరాజ్, సాంకేతిక విద్య మొదలైన శాఖలను ఆయన నిర్వహించిన కాలంలో ఆయా శాఖలను సమర్థ వంతంగా నిర్వహించారని ఆయన పేరు తెచ్చుకున్నారు. 1962 శాసనసభ ఎన్నికలలో ధర్మసాగర్ నియోజకవర్గం నుండి, 1972 శాసనసభ ఎన్నికలలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుండి, 1978 శాసనసభ ఎన్నికలలో హనమ కొండ నియోజకవర్గం నుండి శాసనసభ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నిక య్యారు. మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖామంత్రిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు. ఆంధ్ర ప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి అధ్యక్షుడిగా కూడా ఇతడు కొంతకాలం ఉన్నారు. 1950-52లో వరంగల్ జిల్లా పారిశ్రామిక సలహా మండలి సభ్యులుగా జిల్లాలో పరిశ్రమల స్థాపనకు కృషి చేశారు. సహకార ఉద్యమ వ్యాప్తి లోనూ, బలహీన వర్గాల పురోగతి లోనూ అయ్యగారి అసాధారణమైందని చెపుతుంటారు. హయగ్రీవా చారిని "అయ్యగారు" అని ముద్దుగా పిలుచు కునేవారు. ఆయన చేపట్టిన అనేక పదవుల ద్వారా అందివచ్చిన అవకాశాన్ని ఆయన సద్వినియోగం చేసుకున్నారు. వరంగల్ పురపాలక సంఘం ప్రథమ చైర్మన్‌గా, మంత్రిగా పని చేస్తూ విభిన్న వర్గాల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ పలు నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనను ప్రత్యేక పాత్ర పోషించారని ఆయన అభిమాన కాంగ్రెస్ నాయకులు హయగ్రీవాచారి చేసిన సేవల్ని ఎల్లపుడూ గుర్తుచేసు కుంటారు. వరంగల్ జిల్లాలో వివిధ స్థాయిలో వివిధ అంశాలపై మహాసభలు నిర్వహించడంలో ఆయన పాత్ర కృషి చెప్పుకోదగింది. వరంగల్ పట్టణానికి పోచంపాడు నీళ్లు తీసుకువచ్చి వరంగల్, హన్మకొండ, కాజీపేట పట్టణాలలో మంచినీటి కొరత తీర్చటంలో హయగ్రీవాచారి ఎంతో కృషి చేశారని ఆయనకు పేరుంది. వరంగల్ జిల్లా బోర్డు వైస్ చైర్మనగా హయగ్రీవాచారి జిల్లా సర్వ తోముఖాభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకుంటారు. హయగ్రీవాచారి 1991, డిసెంబర్ 5వ తేదీన పీపుల్స్ వార్ గ్రూపు నక్సలైట్లచే హనుమకొండ లోని స్వంత ఇంటిలో హత మార్చ బడ్డారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సిద్ధి పొందిన తాపసి జ్ఞానానంద - డిసెంబర్ 5... భౌతిశాస్త్ర వేత్త జయంతి



శాస్త్ర విజ్ఞానానికి, మత విశ్వాసాలను ఎప్పుడూ పొత్తు కుదిరని చాలా మంది భావన. అయితే ఆ భావన తప్పు అని నిరూపించారు, యోగి పుంగవులు, స్వామి జ్ఞానానంద. ఒక వైపు యోగాభ్యాసం కొనసాగిస్తూ, ధ్యాన నిమగ్నుడై, సమాధి స్థితికి చేరుకుని, విదేశాలలో భౌతకశాస్త్రం లో రేడియో ధార్మికత పై విశేష పరిశోధనలు చేసి, వివిధ పదవులు నిర్వహించి, కర్మయోగిగా విజ్ఞాన శాస్త్ర రంగంలో విశేష కృషి చేశారు. ఆల్బర్ట్ అయిన్ స్టీన్ ,జగదీశ్ చంద్ర బోస్ ,స్వామి జ్ఞానానంద వంటి వారు ఆ రెంటికి ఉన్న అవినాభావ సంబంధాన్ని చక్కగా వివరిస్తూ రెండు ఒక దానికొకటి అవసరమని ,అప్పుడే మానవ జాతి పురోగతి అని విస్పష్టం గా చెప్పి ,ఆచరించి మార్గ దర్శనం చేశారు. మతం మరియు విజ్ఞాన సంశ్లేషణ మానవాళికి మేలు చేస్తుందని ఆయన నమ్మారు. యోగా సాధన మరియు సైన్స్ అధ్యయనం కొన్ని సారూప్యతలను కలిగి ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రాథమిక యోగ అభ్యాసాలు అంటే మనస్సు మరియు శరీరంపై పాండిత్యం పొందడానికి ఒక వ్యక్తికి శిక్షణ ఇవ్వడం అని నొక్కి చెప్పారు. స్వామి జ్ఞానానంద పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం దగ్గర గౌరగనమూడి అగ్రహారం లో 1896 డిసెంబర్ 5 న జన్మించారు. అయన అసలు పేరు భూపతి రాజు లక్ష్మీ నరసింహ రాజు. తండ్రి రామ రాజు మహా వేద విజ్ఞానఖని. నరసాపురం టైలర్ హైస్కూల్ లో ప్రాథమిక మాధ్యమిక ఉన్నత విద్య నేర్చి , తణుకు లో చదివే రోజుల్లో 1908లో శ్రీ వాసు దేవానంద సరస్వతి ద్వారా "వాసు దేవ మంత్రం"ఉపదేశం పొందారు. నాటినుండి ఆధ్యాత్మిక చింత నాను రక్తులై, వివాహం జరిగినా రామకృష్ణ పరమహంస లాగానే దాంపత్య జీవితం గడిపారు. తండ్రి లైబ్రరీలో ఉన్న అరుదైన వేదాంత గ్రంథాలన్నీ చదివి, దివ్యజ్ఞాన గ్రంథాలు రామకృష్ణ వివేకానంద గ్రంథాలు పఠించి బాలగంగాధర్ ఉపన్యాసాలతో ప్రేరితుడై అజ్ఞాతం గా ఉన్న త్యాగ వైరాగ్యాలు బయట పడి ,1917 డిసెంబర్ 21, న స్కూల్ ఫైనల్ పరీక్షా ఫలితాలలో నంబర్ కనపడ నందున, విరక్తితో ఇల్లు వదిలి అజ్ఞాతం లోకి వెళ్ళిపోయారు . ముందుగా నేపాల్ లోని బుద్ధుడి జన్మస్థలం లుంబిని వెళ్ళారు. ఆశ్రమాలలో నివసించి, అందుబాటులో ఉన్న ఆహారం తీసుకున్నారు. తర్వాత పదేళ్లు దేశ సంచారంలో , పెద్దల దర్శనలతో జీవితాన్ని చదువు కున్నారు. హిమాలయా లకు చేరి అక్కడ యోగాభ్యాసం చేస్తూ మరో పదేళ్లు సార్థక జీవనం సాగించారు . వేదాధ్యయమాన్ని మాత్రం విడువ లేదు. పైగా అన్ని వేదోపనిషత్తుల సారాన్ని అవగాహన చేసి కొన్నారు . మానసిక వికాసం పొందారు. ఢిల్లీ , హరిద్వార్ మీదుగా ఋషీకేశ్ చేరి స్వర్గాశ్రమమ లో సాధన చేశారు . ఫలితంగా శ్రీ కృష్ణ పరమాత్మ సాక్షాత్కారం పొందేవారు. ఆయన తీవ్ర యోగ సాధన చూసి యోగి రాజ్ అనిసంబోధించే వారు. తర్వాత ఆబూ పర్వతం చేరి, గురు శిఖరం పై ఉన్న దత్తాత్రేయ గుహలో ఆరు నెలలు పశ్చిమోత్తాన ఆసనం లో సాధన చేసి, నీల కంఠ మహాదేవ్ లో హఠయోగ ప్రక్రియలు సాధించి, సవికల్ప సమాధి పొంది శ్రీ కృష్ణ దర్శన భాగ్యం పొందేవారు. రుషీ కేశ్ లో శరశ్చంద్ర అనే సిద్ధ పురుషుడు ఆయన 25వ ఏట ఉపదేశం చేసి "స్వామి జ్ఞానానంద "అనే దీక్షానామ మిచ్చారు. గురువుల అనుమతితో బారాముల్లా వెళ్లి సంత్ సింగ్ గుహలో నాలుగు నెలలు ప్రాణాయామ ఆసన ధ్యానాలు చేశారు. శ్రీనగర్ కాళీ పర్వతం పై గుహలలో కొంతకాలం తపస్సు చేశారు. జాడీ పురా యాపిల్ తోట కుటీరం లో ధ్యాననిమగ్నుడై నిర్వికల్ప సమాధిలోకి వెళ్ళేవారు. కైలాస మానస సరోవర యాత్రలు చేసి అక్కడకూడా తపమాచరించి, యోగ సాధన అనుభూతులను స్వామి జ్ఞానానంద 30పూర్ణ సూత్రాలుగా రాశారు . యోగా లో బేసిక్స్ నేర్చుకొంటే మనసు, మెదడు, శరీరాలపై పూర్తి స్వాధీనం కలుగుతుందని సోదాహరణంగా ఉపన్య సహించే వారు స్వామీజీ. 1920 లలో, మత ప్రసంగాలు ఇవ్వడం ప్రారంభించాతు. అనేక భక్తి కవితలు రాశారు. పూర్ణ శాస్త్రాలు అయన ప్రధాన సంకలనం. ఇక దృష్టి భౌతిక విషయాలపై ఉంచి, 1930 ప్రారంభంలో జర్మనీ వెళ్ళి, గ్రాడ్యుయేషన్ చేశారు. చార్లెస్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ డోలేజెక్‌తో కలిసి మూడేళ్లపాటు పని చేయడానికి చెకోస్లో వేకియాలోని ప్రేగ్‌కు వెళ్లారు. విశ్వ విద్యాలయంలో ఆయన పరిశోధన ఎక్స్-రే స్పెక్ట్రోస్కోపీలో ఖచ్చితమైన పద్ధతుల అభివృద్ధికి దారితీసింది. 1936 లో లివర్‌పూల్ విశ్వవిద్యాలయంలో న్యూక్లియర్ ఫిజిక్స్ విభాగంలో పనిచేయడానికి అంగీకరించారు. 1940-43 మధ్య బీటా రే స్పెక్ట్రోస్కోపీపై ఆయన చేసిన కృషి ద్వారా పిహెచ్.డి. సాధించారు. తరువాత యుఎస్‌కు వెళ్లి మిచిగాన్ విశ్వవిద్యాలయంలో అనేక రేడియోధార్మిక ఐసోటోపులతో బీటా రే స్పెక్ట్రోస్కోపీపై తన పరిశోధనను కొనసాగించారు. 1939 నుండి వ్రాస్తున్న -హై వాక్యూమ్ 'పై తన పుస్తకం రాయడం పూర్తి చేశారు. భారత ప్రధాని నెహ్రూ ఆహ్వానం పై భారత దేశం వచ్చి, నేషనల్ ఫిజిక్స్ లేబరేటరి పరమాణు విజ్ఞాన పరిశోధనా విభాగం అధిపతిగా 17ఏళ్ళు సేవలందించారు. 1954లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరమాణు భౌతిక విజ్ఞాన విభాగం మొట్టమొదటి సారిగా ఏర్పాటు చేసి, 10ఏళ్ళు ఆచార్యులుగా, శాఖాధ్యక్షులుగా పని చేసి, అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించారు. జూలై 1, 1956 న ప్రత్యేక న్యూక్లియర్ ఫిజిక్స్ విభాగం ప్రారంభించ బడింది. 1958 నాటికి డిపార్టుమెంటుకు ఒక భవనం పూర్తయింది, అయన ప్రొఫెసర్, విభాగాధిపతిగా పదోన్నతి పొంది, 1965 వరకు ఆ పదవిలో కొనసాగారు. 1965నుండి 69వరకు ఎందరికో మంత్రం దీక్ష అనుగ్రహించారు. స్వామి జ్ఞాపకార్థం పరమాణు భౌతిక శాస్త్రంలోని ప్రయోగశాలకు "స్వామి జ్ఞానానంద పరమాణు పరిశోధన ప్రయోగశాల" (Swami Jnanananda Laboratories for Nuclear Research) గా నామకరణం చేశారు. జ్ఞానానంద రచించిన పూర్ణ సూత్రాలు తెలుగులోకి అనువదించ బడ్డాయి. పరమాణు భౌతిక విజ్ఞాన ప్రాథమిక పాఠాలు, ఫిలాసఫీ ఆఫ్ యోగ, రాజయోగ గ్లిమ్సెస్, హై వాక్యుయా మొదలైనవి ఆంగ్లంలో ముద్రించబడ్డాయి. పదవీ విరమణ చేసిన తరువాత, ఆయనను ఎమెరిటస్ ప్రొఫెసర్‌గా నియమించగా, మరణించే వరకు ఆ పదవిలో కొనసాగారు. ఆచార్యోత్తములు, పరమహంస, దర్శనవేత్త, కర్మయోగి అయిన స్వామి జ్ఞానానంద 1969 సెప్టెంబరు 21 తేదీన సౌమ్య సంవత్సర భాద్రపద శుద్ధ దశమి ఆదివారం ఉదయం 7-45 గంటలకు 73వ ఏట పరమపదించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

చురకలు

## సంపాదకీయం

# ఇవీ మన రాష్ట్రాల ఘనత

**ఏపీ లో 43.7% ప్రజలు, తెలంగాణ లో 37.2% ప్రజలు అప్పుల్లో ఉన్నారు..**

దేశవ్యాప్తంగా ప్రజలు ఆర్థిక ఇబ్బందుల ను ఎదుర్కొంటున్న తరుణంలో కేంద్ర గణాంకాల శాఖ తాజా సర్వే లెక్కలు తెలుగు రాష్ట్రాల పరిస్థితి ని బహిర్గతం చేశాయి. ఈ నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలు అత్యధి కంగా అప్పుల భారంతో సతమతమవుతున్నారు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలుగా పేరున్న ఈ రెండు రాష్ట్రాలు ఇప్పుడు అప్పుల ఊబిలో కూరుకుపోయి కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.

**అప్పుల భారంలో అగ్రస్థానం...** 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సర్వే ప్రకారం, ఆంధ్రప్రదేశ్ (ఏపీ ) రాష్ట్రంలో ఏకంగా 43.7% మంది ప్రజలు అప్పుల్లో ఉన్నారు. ఈ సంఖ్య దేశంలోనే అత్యధికం కావడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మరోవైపు, తెలంగాణ రాష్ట్రంలో 37.2% మంది ప్రజలు అప్పుల్లో చిక్కుకున్నారని లెక్కలు చెబుతున్నాయి. దీంతో తెలుగు రాష్ట్రాలు వరుసగా మొదటి, రెండో స్థానాల్లో నిలిచాయి.

**ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌లో ఏపీ మెరుగ్గా ఉన్నా...** అప్పుల భారం ఉన్నప్పటికీ, ఆర్థిక సేవలు (ఫైనాన్షియల్ ఇంక్లూజన్) వినియోగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మెరుగైన ప్రగతి సాధించింది. 15 ఏళ్లకు పైబడిన వారిలో 92.3% మంది బ్యాంకింగ్ వ్యవస్థలో భాగస్వాములయ్యారు. ఫైనాన్షియల్ ఇంక్లూజన్ రేటులో ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా రెండో స్థానంలో నిలిచింది. ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్రం 86.5%తో 14వ స్థానంలో నిలిచింది. దీని అర్థం ఏమిటంటే ప్రజల కు ఆర్థిక సేవలు అందుబాటులో ఉన్నా, అప్పుల భారం నుంచి బయటపడలేకపోతున్నారనే సంకే తం స్పష్టమవుతోంది. బ్యాంకింగ్ వ్యవస్థ విస్తరించి నా, ప్రజలు అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి కొనసాగుతోందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

**దక్షిణాది – ఈశాన్య రాష్ట్రాల పోలిక...** దక్షిణాది రాష్ట్రాల్లో సగటున 92.1% మంది ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉన్నప్పటికీ, 31.8% మంది అప్పుల్లో ఉన్నారు. ఆర్థిక సేవలు అందుబాటులో ఉన్నా, ప్రజల ఆదాయాలు, ఖర్చులు సమన్వయం కావడంలో సమస్యలు ఉన్నాయనే విషయం ఇక్కడ స్పష్టమవుతోంది. దీనికి విరుద్ధంగా, ఈశాన్య రాష్ట్రాల్లో 80.2% మంది ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉన్నప్పటికీ, కేవలం 7.4% మందికే అప్పులు ఉన్నట్లు సర్వే చెబుతోంది. అంటే ఆర్థిక సేవలు తక్కువగా ఉన్నా, ప్రజలు అప్పులలో చిక్కుకోకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని అర్థం.

**కుటుంబ పరిమాణం, సామాజిక వర్గాల ప్రభావం...** సర్వేలో కొన్ని ఆసక్తికర అంశాలు కూడా వెల్లడయ్యాయి. ఎక్కువమంది సభ్యులు ఉన్న కుటుంబాలపై అప్పుల భారం తక్కువగా ఉండగా, తక్కువమంది సభ్యులు ఉన్న కుటుంబాలు ఎక్కువగా అప్పుల్లో ఉన్నట్లు తేలింది. ఓబీసీల్లో 16.6% మంది, గిరిజనుల్లో 11% మంది అప్పుల్లో ఉన్నారు. పురుషులలో 89.8%, మహిళల్లో 84.5% మంది మాత్రమే ఆర్థిక సేవలను వినియోగిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి.

**సవాళ్లు, పరిష్కారాలు...** ఆర్థిక సేవలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, ప్రజల ఆదాయాలు పెరగకపోవడం, జీవన వ్యయం, ఖర్చులు పెరగడం వల్ల అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. ఈ ధోరణి తెలుగు రాష్ట్రాల్లో మరింత స్పష్టంగా కనబడుతోంది. బ్యాంకింగ్ వ్యవస్థ విస్తరించినప్పటికీ, ప్రజల ఆర్థిక స్థితి మెరుగుపడాలంటే... ఆర్థిక అవగాహన పెంపు, ఆదాయ వృద్ధి పట్ల ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. లేకపోతే, అప్పుల చక్రం ఆగే అవకాశం కనిపించడం లేదు. తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నా, ఈ అప్పుల భారం ప్రజల సుస్థిర ఆర్థిక ప్రగతికి పెద్ద సవాలుగా పరిణమించే ప్రమాదం ఉంది.

# హిడ్మా,టెక్ శంకర్ల ఎన్కౌంటర్ల కుట్రపూరిత వార్తలు నమ్మొద్దు..

## మావో డీకే ప్రతినిధి వికల్ప్


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ
పత్రికా ప్రకటన
తేది : 27.11.2025

చురకలు ప్రత్యేక ప్రతినిధి –తమ పార్టీ నాయకులు హిడ్మా,టెక్ శంకర్ లను ద్రోహులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అరెస్ట్ చేసి చిత్రహింసలకు గురిచేసి బూటకపు ఎన్కౌంటర్ లో చంపివేశారని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ వికల్ప్ పేరిట పత్రికా ప్రకటన విడుదల చేసారు.కామ్రేడ్స్ హిడ్మాల్ (మారెడుమిల్లి), శంకర్ (రంపచోడవరం) ల హత్యలపై న్యాయవిచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజా ఉద్యమాన్ని నిర్మించండి అంటూ వికల్ప్ సందర్భంగా ఆయన కోరారు. కామ్రేడ్ హిడ్మాల్ హత్యకు కామ్రేడ్ దేవ్ జీ కారణమంటూ మనీష్ కుంజాం, సోని సోడీలు చేసిన తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు.

మా కేంద్రకమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ హిడ్మాల్ ను, ఆయనతో వున్న 5 గురిని ఆంధ్రప్రదేశ్ పోలీసులు నవంబర్ 15 నాడు అరెస్టు చేసి మూడు రోజుల పాటు తీవ్రమైన చిత్రహింసలు పెట్టి నవంబర్ 18 నాడు హత్య చేసారు. కామ్రేడ్ హిడ్మాల్ అక్టోబర్ 27 నాడు విజయవాడకు చెందిన ఒక కలప వ్యాపారి ద్వారా చికిత్స కోసం వెళ్లాడు. ఆ తర్వాత మరికొద్దిమంది వెళ్లారు. నిరాయుధంగా ఉన్న కామ్రేడ్స్ హిడ్మాల్ సహ ఆరుగురిని పట్టుకుని హత్య చేసి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారెడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్ లో వాళ్లు చనిపోయారని పోలీసులు కట్టుకథను ప్రచారం చేసారు. నవంబర్ 19 నాడు అదే జిల్లాలోని రంపచోడవరం మండలంలో మరో 7 గురు మావోయిస్టులు ఎన్కౌంటర్ లో చనిపోయారని పోలీసులు ప్రకటించారు. నవంబర్ 19 నాటి ఘటనలో కూడా నిరాయుధులైన ఏఓబీ ఎస్.జెడ్.సీ. సభ్యుడు కామ్రేడ్ శంకర్ ను, మరో ఆరుగురిని అరెస్టు చేసి బూటకపు ఎన్కౌంటర్ లో హత్యచేసారు. నవంబర్ 18, 19 తేదీల్లో శత్రు సాయుధ బలగాలు చేసిన హత్యలో అసువులు బాసిన కామ్రేడ్స్ కు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ విప్లవ జోహార్లు అర్పిస్తోంది. వారి ఆశయసాధన కోసం తుదిశ్వాస వరకు పోరాడుతామని శపథం చేస్తోంది. వాళ్ల కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు ప్రగాఢమైన సంతాపాన్ని, సంవేదనను తెలియజేస్తోంది.

ఈ రెండు ఘటనల్లో కూడా వారిని బయటికి తీసుకెళ్లిన వ్యక్తులే పోలీసు ఇన్ఫార్మర్లని ఇప్పుడు అర్థమవుతోంది. నవంబర్ 9 నాడు మా బలగాల నుండి కోసాల్ అనే కంపెనీ పార్టీ కమిటీ సభ్యుడు పారిపోయి తెలంగాణ పోలీసులకు సరెండరయ్యాడు. ఈయనకు కామ్రేడ్ హిడ్మాల్ ప్రయాణ వివరాలు, ఆయన బయట వుంటున్న విషయం తెలుసు. కోసాల్ పారిపోయిన వెంటనే కామ్రేడ్ హిడ్మాల్ కు ఈ విషయాన్ని తెలియజేసి వెంటనే లోపలికి రమ్మని మా కామ్రేడ్స్ తెలియజేసారు. ఈ సమాచారం అందుకున్న తర్వాత ఆయన తన టీముతో లోపలికి రావడానికి సిద్ధమయి ఉంటాడు. ఈ విషయాన్ని ఆయనను తీసుకెళ్లిన వ్యక్తులు పోలీసులకు తెలపడంతో, పోలీసులు కామ్రేడ్ హిడ్మాల్ ను, ఆయనతో వున్న మిగతా 5 గురిని అరెస్టు చేసి, హత్య చేసి ఎన్కౌంటర్ కథ అల్లారు. అలాగే శంకర్ ను తీసుకెళ్లిన వ్యక్తులు కూడా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఒకేసారి కామ్రేడ్ హిడ్మాల్ టీమును, కామ్రేడ్ శంకర్ టీమును, అరెస్టు చేసి తీవ్రమైన చిత్రహింసలు పెట్టి ఆంధ్రప్రదేశ్ పోలీసులు హత్యచేసారు. ఈ రెండు ఘటనలకూ, విజయవాడ, ఎన్.టీ.ఆర్., కోనసీమ, ఏలూరు, కాకినాడ జిల్లాల్లోని 50 మంది మావోయిస్టుల అరెస్టులకు వాళ్లను తీసుకెళ్లిన విజయవాడకు చెందిన కలపవ్యాపారి– ఫర్నిచర్ వ్యాపారి, బిల్డర్ – సివిల్ కాంట్రాక్టర్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఐటీడీఏ పనులు చేసే కాంట్రాక్టర్ ఈ ముగ్గురే కారకులు. వాళ్లతో పాటు మా నుండి పారిపోయి మా కామ్రేడ్స్ ఆచూకీ గురించి పోలీసులకు సమాచారం ఇచ్చిన కోసాల్ కూడా కారణమే.

కోసాల్ మా నుండి పారిపోయిన తర్వాత మా కామ్రేడ్స్ లోపలికి రావడానికి సిద్ధమవుతుండడంతో పోలీసులు ఏకకాలంలో పట్టుకుని, 13 మందిని హత్య చేసారు. 50 మందిని అరెస్టు చేసారు.

అరెస్టయిన వారిలో కామ్రేడ్స్ దేవ్ జీ గానీ, సంగ్రాం (మల్లా రాజిరెడ్డి) గానీ లేరు. వాళ్లు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి పోలీసులతో ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోలేదు. కామ్రేడ్స్ హిడ్మాల్ తదితరుల సమాచారం కామ్రేడ్ దేవ్ జీ పోలీసులకు ఇవ్వలేదు.

ఈ వాస్తవాలన్నీ కేంద్ర ప్రభుత్వ ఇంటలిజెన్స్ ఏజెన్సీలకు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్ గఢ్, ఒడిశా రాష్ట్ర ఇంటలిజెన్స్ ఏజెన్సీలకు స్పష్టంగా తెలుసు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఇంటలిజెన్స్ ఏజెన్సీలు పరస్పర సమన్వయంతోనే కామ్రేడ్స్ హిడ్మాల్, శంకర్ తదితర 13 మందిని హత్య చేసాయి. 50 మందిని అరెస్టు చేసాయి. ఇది కేవలం ఆంధ్రప్రదేశ్ పోలీసులు నిర్వహించిన ఆపరేషన్ కాదు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల

జాయింట్ ఆపరేషన్. దీనంతటికి సూత్రధారి దేశ, విదేశీ కార్పొరేట్ల విశ్వసనీయ సేవకుడు, నరహంతకుడు, రక్తపిపాసి కేంద్ర హోంమంత్రి అమిత్ షా.

వాస్తవాలు ఇలా ఉండగా, కామ్రేడ్ హిడ్మాల్ అమరుడయి ప్రజలంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పట్ల, పోలీసుల పట్ల తీవ్రమైన కోపంతో ఉన్న స్థితిలో, ఈ హత్యలకు కారకులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, పోలీసులను ప్రశ్నించకుండా. ఈ హత్యలపై న్యాయవిచారణ జరిపించి, ద్రోహులను శిక్షించాలని డిమాండ్ చేయకుండా కామ్రేడ్ హిడ్మాల్ హత్యకు కామ్రేడ్ దేవ్ జీ కారణమని మాజీ ఎంఎల్ఏ మనీష్ కుంజాం, సోనిసోడీలు ఆరోపించడమంటే అది కుట్రపూరిత ప్రకటనే. 'కామ్రేడ్ హిడ్మాల్ సహ 50 మందిని సరెండర్ చేయిస్తానని దేవ్ జీ వీరందరిని ఆంధ్రప్రదేశ్ తీసుకెళ్లి హిడ్మాల్ ను చంపించాడు. 50 మందిని అరెస్టు చేయించాడు' అని మనీష్ కుంజాం నవంబర్ 21 నాడు కుట్రపూరిత ప్రకటన చేసాడు.

దేశాన్ని 'కార్పొరేట్ హిందూదేశం'గా మార్చడానికి, మార్చి 31, 2026 నాటికి మావోయిస్టు పార్టీని, విప్లవోద్యమాన్ని నిర్మూలించే గడువును నిర్ణయించుకుని బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్–బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ యుద్ధాన్ని సాగిస్తున్నాయి. ఇందులో భాగంగా మా పార్టీకి చెందిన కేంద్రకమిటీ సభ్యులను, వివిధ రాష్ట్రాల రాష్ట్రకమిటీ సభ్యులను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చుట్టివేత– నిర్మూలనా దాడులు చేస్తున్నాయి. అరెస్టులు చేస్తున్నాయి. ఇందులో భాగంగా మా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు సహ అనేకమంది కేంద్ర, రాష్ట్రకమిటీ సభ్యులను హత్య చేసాయి. మిగిలిన కామ్రేడ్స్ గణపతి, దేవ్ జీ, మిసిర్ బిస్రా, సంగ్రాం తదితర కేంద్ర, రాష్ట్రకమిటీ సభ్యులను నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం, ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఝార?ండ్, బిహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలన్నీ దృశ్య, శ్రవ్య మాధ్యమాల ద్వారా నిరంతరం చేస్తున్న ప్రకటనలు గుడ్డివారికి సైతం కనపడేలా, చెవిటి వాడికి సైతం వినబడేలా సాధారణ ప్రజలకు సైతం అర్థమయ్యేలా సాగుతుంటే మాజీ ఎంఎల్ఏ మనీష్ కుంజాం, సోనిసోడీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను టార్గెట్ చేయకుండా దేవ్ జీని టార్గెట్ చేయడమంటే అది భారీ కుట్రలో భాగమే.

ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి దేశవ్యాప్తంగా ప్రజలు, కగార్ యుద్ధాన్ని ఆపాలని, బస్తర్ లో జరుగుతున్న నరసంహారాన్ని ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులతో శాంతిచర్చలు చేయాలని ప్రచార ఆందోళనలు చేస్తుంటే, 2024, మే 10 నాడు పిడియలో తునికాకు కూలీలను పోలీసులు హత్య చేసిన ఘటన అనంతరం బస్తర్ లో జరుగుతున్నవన్నీ నిజమైన ఎన్కౌంటర్లేనని ఈ సంవత్సరం మే నెలలో బస్తర్ టాకీస్ కిచ్చిన ఇంటర్వ్యూలో మనీష్ కుంజాం నిర్లజ్జగా అబద్దలాడి బస్తర్ లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాలు కగార్ పేరుతో చేస్తున్న ఆదివాసుల నరసంహారాన్ని సమర్థించాడు. 2024 మే తర్వాత ఇప్పటివరకు బస్తర్ లో ఎన్నోచోట్ల కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలు ఆదివాసీ గ్రామీణ ప్రజానీకాన్ని హత్యచేసాయి/ చేస్తున్నాయి. డిసెంబర్ 13 నాడు కలాజా–దోంద్రువేడ పరిసరాల్లో జరిగిన చుట్టివేత దాడిలో కామ్రేడ్స్ కార్తిక్, రమీలతో పాటు 5 గురు గ్రామస్థులను ఉద్దేశ్యపూర్వకంగా హత్యచేసాయి. ఫిబ్రవరి నెలలో తోడ్క గ్రామ పరిసరాల్ని చుట్టివేసి (ఎన్ సర్కిల్ మెంట్) 7 గురు గ్రామస్థుల్ని, పార్టీ సభ్యుడు నీలకంఠ్ ను హత్యచేసాయి. మార్చి 31 నాడు ఇంద్రావతి ఏరియాలోని బేల్ నార్ గ్రామంలో నిరాయుధంగా ఉన్న ఎస్.జెడ్.సి. సభ్యురాలు కామ్రేడ్ చైతేను పట్టుకుని హత్య చేసాయి. ఆ తర్వాత అదే ఏరియాలో కామ్రేడ్ సుధీర్ తో పాటు, ఇద్దరు గ్రామీణ యువకులను పట్టుకుని హత్య చేసాయి. ఇలా ఎన్నో ఘటనల్లో గ్రామీణ ప్రజానీకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హత్య చేసాయి. నిజాయితీ కలిగిన వ్యక్తులు, శక్తులు, సామాజిక సంఘాలు ఈ హత్యకాండను, నరసంహారాన్ని బహిర్గతం చేస్తుంటే మనీష్ కుంజాం పథకం ప్రకారం వీటన్నింటిని నిజమైన ఎన్కౌంటర్లని ప్రకటించడమంటే అది ఆదివాసుల నరసంహారాన్ని సమర్థించడమే. ఇప్పుడు కామ్రేడ్ హిడ్మా హత్యకాండకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను టార్గెట్ చేయకుండా, ఆ హత్యకాండపై న్యాయవిచారణ చేసి ద్రోహులను శిక్షించాలని డిమాండ్ చేయకుండా, ఆందోళన చేయకుండా దానికి కామ్రేడ్ దేవ్ జీని టార్గెట్ చేయడమంటే అది భారీ కుట్రలో భాగమే. బస్తర్ లో జరుగుతున్న అడవుల కార్పొరేటీకరణకు బస్తర్ లో మైనింగ్ చేస్తున్న దేశ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు తను దళారీగా మారిన ఫలితమే ఇలాంటి ప్రకటనలు. ఇది కేవలం దేవ్ జీని టార్గెట్ చేయడమే కాదు, మొత్తం మావోయిస్టు పార్టీపై, విప్లవోద్యమంపై దాడి చేయడంలో భాగమే. మావోయిస్టు పార్టీపై, పార్టీ నాయకత్వంపై, విప్లవోద్యమంపై దాడిచేసి విప్లవ శిబిరంలో గందరగోళాన్ని, అవిశ్వాసాన్ని సృష్టించే ఇంటలిజెన్స్ ఏజెన్సీలు చేసే మానసిక యుద్ధంలో పథకం ప్రకారం పాలుపంచుకోవడంలో భాగమే ఈ ప్రకటన. అందుకే ఈ ప్రకటనను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. కార్పొరేటీకరణకు / దేశ, విదేశీ కార్పొరేట్లకు దళారీగా మారిన, ఇంటలిజెన్స్ ఏజెన్సీలతో చేతులు కలిపి బస్తర్ లో విప్లవోద్యమానికి వ్యతిరేకంగా మనీష్ కుంజాం చేస్తున్న చేయదలచిన కుట్రలను తిప్పికొట్టాల్సిందిగా ప్రజలకు పిలుపునిస్తున్నాం.

కామ్రేడ్ హిడ్మాల్ అంతిమయాత్రకు హాజరైన సోనిసోడి ఇది బూటకపు ఎన్కౌంటర్ అని, ఇది హత్య అని సరిగానే ఖండించినప్పటికీ, దేవ్ జీ పోలీసులకు చిక్కి తన ప్రాణాన్ని కాపాడుకోవడానికి హిడ్మాల్ గురించిన సమాచారాన్ని పోలీసులకు అందించాడని ఆమె ప్రకటన చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. కామ్రేడ్ హిడ్మాల్ హత్య గురించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రజాసంఘాల వారి ద్వారా వాస్తవాలు సేకరించకుండా ఇలాంటి ప్రకటనలు చేయడం తీవ్ర అక్షేపణీయం. ఒకవేళ తను ప్రజాపక్షాన, ఆదివాసుల పక్షాన నిలబడాలనుకుంటే ఈ ఘటనకు సంబంధించిన వాస్తవాలు తెలుసుకోకుండా తొందరపాటుతో ప్రకటన చేసానని ప్రకటించాలని ఈ ప్రకటనను వాపసు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.


కామ్రేడ్ హిడ్మాల్ తదితర కామ్రేడ్స్ తమ పోలీస్ ఇన్ఫార్మర్ల వద్ద వున్నారని తెలిసి, వారిని హత్య చేయడానికి నిర్ణయించుకున్న తర్వాతనే ఛత్తీస్ గఢ్ ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ పువ్వర్తి గ్రామానికి వెళ్లాడు. అక్కడ కామ్రేడ్ హిడ్మాల్ తల్లితో ఆయన సరెండర్ కావాలని ప్రకటన ఇప్పించాడు. కామ్రేడ్ హిడ్మాల్ ఎట్టి పరిస్థితుల్లోనూ తమకు సరెండర్ కాడనేది శత్రువుకు స్పష్టంగా తెలుసు కాబట్టి ఈ ప్రకటన ఇప్పించాడు. సరెండర్ కావాలని కోరినప్పటికీ తను సరెండర్ కాలేదు కాబట్టి హిడ్మాల్ ను చంపాల్సి వచ్చిందని, తాము చేసిన హత్యకాండను సమర్థించుకునే దుష్టపథకంలో భాగమే ఇది. మరోవైపు, కామ్రేడ్ హిడ్మాల్ శత్రువుకు సరెండర్ కావడానికి ప్రయత్నించడనేది ఆయన చరిత్రను కళంకితం చేసే దుష్టపథకంలో భాగమే.

ప్రజలకు విజ్ఞప్తి!

కామ్రేడ్ హిడ్మాల్ (మారెడుమిల్లి), కామ్రేడ్ శంకర్ ల (రంపచోడవరం) హత్యకాండపై న్యాయవిచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, కార్పొరేట్ల కోసం సాగుతున్న కగార్ యుద్ధాన్ని ఆపాలని దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని చేపట్టాల్సిందిగా ప్రజలకు పిలుపునిస్తున్నాం. విజయవాడ తదితర పట్టణాల్లో అరెస్టయిన 50 మంది కామ్రేడ్స్ కు న్యాయ సహాయం (లీగల్ ఎయిడ్) అందించాల్సిందిగా. వారి విడుదల కోసం కృషి చేయాల్సిందిగా ప్రజాపక్ష న్యాయవాదులకు, హక్కుల కార్యకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నాం. దేశాన్ని 'కార్పొరేట్ హిందూదేశం'గా మార్చడానికి బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్–బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ యుద్ధాన్ని సాగిస్తూ మా పార్టీ కేంద్రకమిటీ సభ్యుల నుండి మొదలుకుని గ్రామీణ ప్రజల వరకు హత్యలు చేస్తున్నాయి. ఈ స్థితిలో కగార్ యుద్ధానికి వ్యతిరేకంగా మనపార్టీ నాయకత్వంలో పోరాడడం, అమరుల ఆశయసాధన కోసం విప్లవోద్యమంలో దృఢంగా నిలబడి పోరాడడం మనందరి కర్తవ్యం. నేటి కగార్ యుద్ధ తీవ్రత రీత్యా మేం రెగులర్ గా ప్రకటనలు ఇవ్వలేని స్థితిలో ఉన్నాం. అందుకే మనీష్ కుంజాం లాంటి వారి అబద్దపు ప్రకటనలతో గందరగోళానికి, అవిశ్వాసానికి గురికావద్దు. సోను, సతీష్ లాంటి విప్లవ ద్రోహుల సరెండర్లతో, ఇతరుల సరెండర్లతో నిరాశపడవద్దు. ఇకముందు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఇంటలిజెన్స్ ఏజెన్సీలు దేశంలోని, దండకారణ్యంలోని మనీష్ కుంజాం లాంటి తమ దళారీల ద్వారా మావోయిస్టు పార్టీకి వ్యతిరేకంగా, పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా, విప్లవోద్యమానికి వ్యతిరేకంగా ఎన్నో దుష్ట అబద్దపు ప్రచారాలు చేస్తారు. వాటితో గందరగోళ పడవద్దు. ఏ విషయం పైనయినా గ్రామాల్లోకి వచ్చే మనపార్టీ కార్యకర్తల ద్వారా వాస్తవాల్ని తెలుసుకోవాలని, విప్లవోద్యమంలో దృఢంగా నిలబడాలని ప్రజలందరికి విజ్ఞప్తి చేస్తున్నాం. విప్లవాభినందనాలతో,ఎంపికవికల్ప్,మీడియా ప్రతినిధి, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).

# ఆరు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న జయలలిత – డిసెంబర్ 5... పురుచ్చితలైవి వర్ధంతి

ఒక రాష్ట్ర రాజకీయాలను కంటి చూపుతోనే శాసించిన అతి కొద్ది మంది రాజకీయ నేతల్లో జయ లలిత ఒకరు. తమిళనాడు రాష్ట్రానికి ఆరు సార్లు ముఖ్యమంత్రిగా పని చేశారు. సినీ నటిగా ప్రస్థానం ప్రారంభించిన ఆమె.. అన్నాడీఎంకే అధినేత్రిగా.. తమిళనాడు సీఎంగా ఎదిగిన తీరు నిజంగా అద్భుతం. 1991 నుంచి 2016 మధ్య ఆమె 14 ఏళ్లపాటు ఆమె తమిళనాడు ముఖ్యమంత్రిగా పని చేశారు. 1948 ఫిబ్రవరి 24న కర్ణాటకలోని మండ్య జిల్లా పాండవపుర తాలూకా లోని మెల్కోటేలో.. తమిళ అయ్యంగార్ కుటుంబంలో జన్మించారు. జయలలిత తల్లి వేదవల్లి, తండ్రి జయరాం. జయరాం లాయరుగా పని చేసే వారు. అయ్యంగార్ల సంప్రదాయం ప్రకారం తల్లిదండ్రులు ఆమెకు పెట్టిన రెండు పేర్లు కోమలవల్లి, జయలలిత. ఆమె తాత నరసిం హన్ రంగాచార్యులు.. మైసూరు మహారాజా సంస్థానంలో ఆస్థాన వైద్యునిగా ఉండేవారు. జయలలిత జన్మించిన రెండేళ్లకే ఆమె తండ్రి చని పోయారు. దీంతో ఆమె కుటుంబం బెంగుళూరులోని అమ్మమ్మ గారింటికి చేరారు. తల్లి వేదవల్లి బెంగుళూరులో చిన్న ఉద్యోగంలో చేరారు. జయలలిత చాలా చురుకైన విద్యార్థిని. చదువులోనే కాకుండా ఆటపాటల్లోనూ ఆమె ముందుండే వారు. ప్రాథమిక విద్యను బెంగుళూ రు బిషప్ కాటల్ బాలికల పాఠశాల లో పూర్తి చేశారు. మద్రాసు చర్చ్ పార్క్ కాన్వెంట్‌లోను కొనసాగించిన జయలలిత మెట్రిక్యులేషన్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచారు. చదువుకుంటూనే సంప్రదాయ భరత నాట్యం తో పాటు మోహినీ యాట్టం, మణిపురి, కథక్ వంటి నృత్య రీతులను జయలలిత నేర్చు కున్నారు. సంప్రదాయ కర్నాటక సంగీతం కూడా అభ్యసించారు. మద్రాస్‌లో రంగస్థల నటిగా స్థిరపడ్డ సోదరి అంబుజవల్లి వద్ద ఉంటూ.. సినిమాలో నటించాలనే ప్రబలమైన కోరికతో, అవకాశాల కోసం ప్రయత్నించారు. సంధ్య అనే పేరుతో తన ప్రస్థానాన్ని నాటకాల తో ప్రారంభించి.. ఆశించిన విధంగా సినీ నటి స్థాయికి ఎదిగారు. జయలలిత 1961 లో కన్నడ సినిమా "శ్రీ శైల మహాత్మే" తో సినీ రంగ ప్రవేశం చేశారు. బాలనటిగా అడుగు పెట్టారు. 1965 లో సీ.వీ. శ్రీధర్ దర్శకత్వం వహించిన "వెన్ని రాడై"తో తమిళ చిత్ర సీమలో అరంగేట్రం చేశారు. ఆ తర్వాత ఎమ్.జీ. రామచంద్రన్ (ఎమ్‌జీఆర్) సరసన 28 సినిమాలు, శివాజీ గణే షన్‌తో 17 సినిమాలలో నటించా రు. నటనలో ప్రతిభ కనబరిచి నందుకు ఆమె ఎన్నో అవార్డులను సాధించారు. జయలలిత తమిళం తో పాటు తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో అనర్గళంగా మాట్లా డే వారు. తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో దాదాపు 140 సిని మాల్లో జయలలిత నటించారు. ఆమె నటించిన ఏకైక హిందీ సినిమా ఇజ్జత్. జయలలిత ...కథానాయకుని కథ (1965), మనుషులు మమతలు (1965), ఆమె ఎవరు? (1966), ఆస్తిపరులు (1966), కన్నెపిల్ల (1966), గూఢచారి 116 (1966), నవరాత్రి (1966), గోపాలుడు భూపాలుడు (1967), చిక్కడు దొరకడు (1967), ధనమే ప్రపంచ లీల (1967), నువ్వే (1967), బ్రహ్మచారి (1967), సుఖ దుఃఖాలు (1967), అదృష్టవంతులు (1968), కోయంబత్తూరు ఖైదీ (1968), తిక్క శంకరయ్య (1968), దోపిడీ దొంగలు (1968), నిలువు దోపిడి (1968), పూలపిల్ల (1968), పెళ్ళంటే భయం (1968), పోస్టు మన్ రాజు (1968), బాగ్దాద్ గజ దొంగ (1968), శ్రీరామకథ (1968), ఆదర్శ కుటుంబం (1969), కథా నాయకుడు (1969), కదలడు వదలడు (1969), కొండవీటి సింహం (1969), పంచ కళ్యాణి దొంగల రాణి (1969), ఆలీ బాబా 40 దొంగలు (1970), కోటీశ్వరుడు (1970), గండికోట రహస్యం (1970), మేమే మొనగాళ్లం (1971), శ్రీకృష్ణ విజయం (1971), శ్రీకృష్ణసత్య (1971), భార్యా బిడ్డ లు (1972), డాక్టర్ బాబు (1973), దేవుడమ్మ (1973), దేవుడు చేసిన మనుషులు (1973), లోకం చుట్టిన వీరుడు (1973), ప్రేమలు – పెళ్ళి ళ్ళు (1974), నాయకుడు %–% వినా యకుడు



(1980) తదితర తెలుగు చిత్రాలలో విభిన్న పాత్రలలో జయలలిత నటించారు. ఎం. జీ. రామచంద్రన్ స్థాపించిన ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం (ఏఐడీఎంకే) లో చేరడం ద్వారా ఆమె తన రాజ కీయాల్లోకి అడుగు పెట్టారు. ఎంజీఆర్ కు సన్నిహితురాలిగా ఉంటూ 1984 నుంచి 1989 మధ్య రాజ్యసభ సభ్యురాలిగా పని చేశారు.1987 లో ఎమ్‌జీఆర్ మరణానంతరం 1989 లో ఏఐడీఎంకే అధినేత్రి అయ్యారు. 1991 లో పార్టీని అధికారం లోకి తెచ్చి, తమిళనాడులో మొత్తం పదవీకాలం పూర్తిచేసిన మొదటి మహిళా ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారు. తమిళనాట రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహ రించి 'పురుచ్చి తలైవి' (విప్లవ నాయకురాలు)గా పేరు గాంచిన జయలలిత 43 ఏళ్లకే ఆమె ముఖ్యమంత్రి అయి, అత్యంత పిన్న వయసులోనే తమిళనాడు సీఎంగా ఎన్నికైన వ్యక్తిగా ఆమె రికార్డు నెలకొల్పారు. ఆరుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన కాలంలో అక్రమాస్తుల కేసులో ఆమె జైలుకు కూడా వెళ్లారు. అనారోగ్యం కారణంగా 75 రోజులు మృత్యు వుతో పోరాడిన తర్వాత డిసెంబరు 5, 2016 న ఆమె కన్ను మూశారు. ఆమె మరణం ఎన్నో వివాదాలకు నెలవైంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# బైరంఘడ్ లో ముగిసిన ఎన్కౌంటర్ .!

## -కంపెనీ కమాండర్ వేలల్ సహా
## -మావోయిస్టు రెండవ కంపెనీ క్లోజ్
## -18 మంది మావోయిస్టులు, ముగ్గురు పోలీసులు మృతి
## -పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం
## -మిగితా మావోయిస్టులను ఏరివేస్తాం
## -ఆపరేషన్ ఆఫీసర్,సుందర్ రాజన్





చురకలు ప్రత్యేక ప్రతినిధి:రాయపూర్ ఛత్తీస్ ఘడ్ లో ఎంతో కీలక మావోయిస్టు రెండో కంపెనీ తో బుధవారం జరిగిన భీకర పోరు ముగిసింది.గురువారం ఉదయం నుంచి భైరం ఘడ్ లోని ఘటన చోటుచేసుకున్న ప్రాంతం నుంచి భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు .పోలీసులు అధికారులురంగంలోకి దిగారు.భైరం గఢ్-పేరున్న పోలీస్ స్టేషన్ ప్రాంతంలో జరిగిన కాచిలావర్-పోతేనార్ ఎన్‌కౌంటర్‌లో భద్రతా దళాలు భారీ విజయాన్ని సాధించాయి - 09 మంది మహిళా మావోయిస్టులతో సహా మొత్తం 18 మంది మావోయిస్టులు మరణించారు మరియు పెద్ద మొత్తంలో ఆయుధాలు మరియు పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే మావోయిస్టులు తమ ఉనికిని కోల్పోవడానికి కారణం రెండో కంపెనీపూర్తిగా దెబ్బతిన్నదని భావిస్తున్నారు.

పి ఎల్ జి ఏ కంపెనీ నంబర్ 02 కమాండర్ మోడియం వెల్ల, డి, వి, సి, యం, మోటు కవాసి, ప్లాటూన్ నంబర్ 13 కమాండర్ జిత్రు, మరియు పి ఎల్ జి ఏ కంపెనీ నంబర్ 02 మరియు ప్లాటూన్ నంబర్ 13 నుండి 25-30 మంది మావోయిస్టులు భైరామ్‌గఢ్, జంగ్లా మరియు నేమ్డ్ సరిహద్దుల్లో ఉన్న పోటెనార్ మరియు కాచిలావర్ అటవీ ప్రాంతంలో మరణించారు. బీజాపూర్ వెస్ట్ బస్తర్ డివిజన్ ప్రాంతంలోని పోలీస్ స్టేషన్లలో మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం ఆధారంగా, బీజాపూర్ డి ఆర్ జి, దంతేవాడ డి ఆర్ జి, ఎస్ టి ఎఫ్ మరియు కోబ్రా 210 ల సంయుక్త బృందం ఆపరేషన్ చేపట్టింది.

ఆపరేషన్ సమయంలో, 03/12/2025న థానా భైరామ్‌గఢ్ పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో, అపఖ్యాతి పాలైన మావోయిస్టు కేడర్ పి ఎల్ జి ఏ బెటాలియన్ కంపెనీ నం. 02 ఇంచార్జ్, డి వి సి యం మోడియామి వెల్ల (10 లక్షల రివార్డ్)తో సహా మొత్తం 18 మంది మావోయిస్టు కేడర్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు.

ఎన్‌కౌంటర్ స్థలంలో జరిగిన సోదాల్లో, ఎన్‌కౌంటర్ స్థలం నుండి ఎల్ యం జి మెషిన్ గన్, ఏ కె 47 రైఫిల్స్, ఎస్ ఎల్ ఆర్ రైఫిల్స్, ఇన్సాస్ రైఫిల్స్, .303 రైఫిల్స్ మరియు ఇతర ఆయుధాలు మరియు మందుగుండు సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులతో ధైర్యంగా పోరాడుతూ, బీజాపూర్ డి ఆర్ జి కి చెందిన 03 మంది జవాన్లు అమరులయ్యారు మరియు ఈరోజు 04/12/2023న, అమరవీరులైన జవాన్లకు తుది వందనం సమర్పించారు.

పశ్చిమ బస్తర్ డివిజన్ ప్రాంతంలోని భైరామ్‌గఢ్-జంగ్లా-నైమెద్ పోలీస్ స్టేషన్ సరిహద్దు ప్రాంతంలోని పోటానార్‌లోని కాచిల్వార్ అటవీ కొండలలో పి ఎల్ జి ఏ కంపెనీ నంబర్ 02 కమాండర్ వెల్లా మోడీయం, ప్లాటూన్ నంబర్ 13 కమాండర్ డి వి సి యం, జిత్రు ఓయం, డి వి సి యం, మోతు కవాసితో పాటు పశ్చిమ బస్తర్ డివిజన్‌కు చెందిన 25-30 మంది మావోయిస్టులు ఉన్నారనే నిఘా సమాచారం మేరకు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించినట్లు బీజాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఆపరేషన్ సమయంలో, 03/12/2025న ఉదయం 09.00 గంటల నుండి డి ఆర్ జి, బీజాపూర్, డి ఆర్ జి దంతేవాడ, ఎస్ టి ఎఫ్ మరియు కొబ్రా సంయుక్త బృందాలు మరియు మావోయిస్టుల మధ్య అడపాదడపా కాల్పులు జరిగాయి, ఇది 04/12/2025న ఉదయం 08.00 గంటల వరకు కొనసాగింది. ఈ సెర్చ్ ఆపరేషన్ సమయంలో, పి ఎల్ జి ఏ కంపెనీ నంబర్ 02 ఇన్-చార్జ్ డి వి సి యం వెల్ల మోడీయం, డి వి సి యం సోను ఓయం, రాను ఓయం, ఆటోమేటిక్ ఆయుధాలు ఎల్ యం జి, ఏ కె 47, 7.62 ఎస్ ఎల్ ఆర్, 5.56 ఇన్సాస్, .303 రైఫిల్, 12 బోర్, సింగిల్ షాట్ తో పాటు ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలు మరియు మావోయిస్టు సామగ్రిని ఎన్‌కౌంటర్ స్థలం నుండి స్వాధీనం చేసుకున్నారు.

ఈరోజు 04/12/2025న బీజాపూర్ జిల్లా ప్రధాన కార్యాలయంలో, బస్తర్ రేంజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సుందర్‌రాజ్ పి, దంతేవాడ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కమలోచన్ కశ్యప్, బీజాపూర్ సెక్టార్ ఆప్స్ సి ఆర్ పి ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ బి.ఎస్. నేగి, బీజాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్, దంతేవాడ పోలీస్ సూపరింటెండెంట్ గౌరవ్ రాయ్, ఎస్ టి ఎఫ్ పోలీస్ సూపరింటెండెంట్ స్మృతిక్ రాజ్నాల, పశ్చిమ బస్తర్ డివిజన్ ప్రాంతంలో నిర్వహించిన కార్యకలాపాలు మరియు ఎన్‌కౌంటర్‌లకు సంబంధించిన సమాచారాన్ని అందించారు.

కాచిలవర్-పోతేనార్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల ప్రాథమిక గుర్తింపులో ఈ క్రింది మావోయిస్టు కేడర్ల పేర్లు వెల్లడయ్యాయి:

1. డివి సి యం వెల్ల మోడీయం, హోదా: ??పి ఎల్ జి ఏ కంపెనీ నం. 02 ఇంచార్జ్, రివార్డ్: ?10.00 లక్షలు

నేర వివరాలు: బీజాపూర్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో డి వి సి యం వెల్ల మోడీయంపై మొత్తం 44 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

ప్రధాన సంఘటనలు:

2013 జిరామ్ వ్యాలీ దాడిలో పాల్గొన్నాడు
2019 కేశ్కుతుల్ పోలీసు బృందం దాడిలో పాల్గొన్నాడు
2020 మినాపా జిల్లా సుక్మా శిబిరం దాడిలో పాల్గొన్నాడు
2021 టేకల్గుడియం ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నాడు
2024 ధర్మారామ్ శిబిరం దాడిలో పాల్గొన్నాడు

2. పి సి రాను ఓయం, కంపెనీ నంబర్ 2, రివార్డ్ ?8.00 లక్షలు
3. డి వి సి యం సన్ను అవలం, కంపెనీ నంబర్ 7, రివార్డ్ ?8.00 లక్షలు
4. పి పి సి యం నందా మీడియం, పి ఎల్ జి ఏ కంపెనీ నంబర్ 2, రివార్డ్ ?8.00 లక్షలు
5. పి పి సి యం లాలు అలియాస్ సీతారాం, పి ఎల్ జి ఏ కంపెనీ నంబర్ 2, రివార్డ్ ?8.00 లక్షలు
6. పి పి సి యం రాజు పునేం, పి ఎల్ జి ఏ కంపెనీ నంబర్ 02, బహుమతి 08.00 లక్షలు
7. పి పి సి యం, కామేష్ కవాసి, పి ఎల్ జి ఏ కంపెనీ నంబర్ 02, బహుమతి రూ. 08.00 లక్షలు
8. పి పి సి యం లక్ష్మి తాటి, పి ఎల్ జి ఏ కంపెనీ నం. 02, బహుమతి రూ. 08.00 లక్షలు
9. పి పి సి యం బండి మద్వి, పి ఎల్ జి ఏ కంపెనీ నం. 02, బహుమతి రూ. 08.00 లక్షలు
10. పి పి సి యం సుఖి లేకమ్, పి ఎల్ జి ఏ కంపెనీ నం. 02, బహుమతి రూ. 08.00 లక్షలు
11. పి పి సి యం సోమ్డి కుంజమ్, పి ఎల్ జి ఏ కంపెనీ నం. 02, బహుమతి రూ. 08.00 లక్షలు
12. చందు కుర్సం, పి ఎల్ జి ఏ కంపెనీ నం. 02, బహుమతి రూ. 08.00 లక్షలు13. మాసే అలియాస్ శాంతి, పి ఎల్ జి ఏ కంపెనీ నం. 02, బహుమతి 08.00 లక్షలు
14. రీనా మార్కం, పి ఎల్ జి ఏ కంపెనీ నం. 02, బహుమతి 08.00 లక్షలు
15. సోని మాద్వి, పి ఎల్ జి ఏ కంపెనీ నం. 02, బహుమతి 08.00 లక్షలు
16. సంగీత పదం, పి ఎల్ జి ఏ కంపెనీ నం. 02, బహుమతి 08.00 లక్షలు

మరణించిన మిగిలిన 02 మంది మావోయిస్టుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది.

ఎన్‌కౌంటర్ స్థలం నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు మరియు ఇతర వస్తువులు:

1. 1 ఎల్ యం జి
2. 4 ఏ కె -47లు
3. 4 7.62 ఎస్ ఎల్ ఆర్ లు
4. 1 5.56 ఇన్సాస్
5. 2 .303 రైఫిల్స్
6. 4 సింగిల్ షాట్ రైఫిల్స్
7. 2 బి జి ఎల్ లాంచర్లు
8. 1 మజిల్-లోడింగ్ రైఫిల్

రేడియోలు, స్కానర్లు, మల్టీమీటర్లు, హ్యాండ్ గ్రెనేడ్‌లు, సేఫ్టీ ఫ్యూజ్‌లు, మావోయిస్టు సాహిత్యం, పౌచ్‌లు, మావోయిస్టు యూనిఫాంలు, వైద్య సామాగ్రి మరియు ఇతర వస్తువులు

2025లో జిల్లాలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో భద్రతా దళాలు 161 మంది మావోయిస్టులను విజయవంతంగా హతమార్చాయని బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. వివిధ పోలీస్ స్టేషన్ ప్రాంతాలలో నిర్వహించిన ఆపరేషన్లలో, 546 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా, 560 మంది పోలీసులకు లొంగిపోయారు.

జనవరి 2024 నుండి జిల్లాలో నిర్వహించిన మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలలో, మొత్తం 219 మంది మావోయిస్టులు మరణించారు, 1,049 మంది మావోయిస్టులు అరెస్టు చేయబడ్డారు మరియు 790 మంది మావోయిస్టులు హింసను త్యజించి ప్రధాన స్రవంతిలో చేరారు. బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పట్టిలింగం మాట్లాడుతూ, పోలీసులు, భద్రతా దళాలు మరియు వివిధ వాటాదారుల మధ్య బలమైన సమన్వయం కారణంగా, ఈ ప్రాంతంలో మిగిలిన మావోయిస్టు స్థావరాలపై కార్యకలాపాలు మరింత తీవ్రంగా మరియు ప్రభావవంతంగా మారాయని పేర్కొన్నారు. వామపక్ష తీవ్రవాదాన్ని నిర్ణయాత్మకంగా అంతం చేయడంలో ప్రభుత్వం, భద్రతా దళాలు మరియు బస్తర్ ప్రజల సమిష్టి సంకల్పం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రయత్నాల ప్రాథమిక లక్ష్యాలు మావోయిస్టు ప్రభావం నుండి మారుమూల ప్రాంతాలను విముక్తి చేయడం, శాంతిభద్రతలను బలోపేతం చేయడం మరియు ఈ ప్రాంతంలో సమగ్ర మరియు స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం.

ఆయన ఇలా అన్నారు, "మా లక్ష్యం స్పష్టంగా ఉంది - శాంతియుత మరియు నక్సల్ రహిత బస్తర్. ప్రస్తుత పరిస్థితులలో, మావోయిస్టు సంస్థ పూర్తిగా మూలన పడింది మరియు హింసను విడిచిపెట్టి ప్రధాన స్రవంతిలోకి తిరిగి రావడం తప్ప వేరే మార్గం లేదు."

జనవరి 2024 నుండి బస్తర్ డివిజన్‌లో నిర్వహించిన మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లలో 469 మంది మావోయిస్టు కేడర్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు, వీరిలో అనేక మంది సీనియర్ స్థాయి మావోయిస్టులు కూడా ఉన్నారు.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సుందర్‌రాజ్ పట్టిలింగం, దళం యొక్క దృఢ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, ఆపరేషన్ సమయంలో ప్రాణాలను త్యాగం చేసిన ముగ్గురు ధైర్యవంతులైన అమరవీరులు - మోను బర్డి, దుక్రు రామ్ గోండే మరియు రమేష్ సోధి - వారి పరాక్రమం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటుందని మరియు బస్తర్ ఎల్లప్పుడూ వారి అత్యున్నత అంకితభావం మరియు త్యాగాన్ని భక్తి మరియు గౌరవంతో గుర్తుంచుకుంటుందని అన్నారు.బీజాపూర్ వెస్ట్ బస్తర్ డివిజన్ ప్రాంతంలో భద్రతా దళాలు మరియు మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో, డీఆర్‌జీ బీజాపూర్‌కు చెందిన ముగ్గురు ధైర్యవంతులైన సైనికులు ధైర్యంగా పోరాడుతూ అమరవీరులయ్యారు.అమరవీరుడు హెడ్ కానిస్టేబుల్ మోహన్ బడ్డి, డీఆర్‌జీ బీజాపూర్ - బీజాపూర్ జిల్లా మదీద్‌లోని ఉస్కలేడ్ గ్రామానికి చెందినవారు.

అమరవీరుడు కానిస్టేబుల్ దుకారురామ్ గొండే, డి ఆర్ జి బీజాపూర్ - బీజాపూర్ జిల్లా నెల్సనార్ పోలీస్ స్టేషన్‌లోని బోడ్లికి చెందినవాడు.

అమరవీరుడు జవాన్ రమేష్ సోధి, డి ఆర్ జి బీజాపూర్ - బీజాపూర్ జిల్లా అవపల్లి పోలీస్ స్టేషన్‌లోని పున్నూర్ గ్రామానికి చెందినవాడు.

బీజాపూర్‌లోని రక్షిత కేంద్రంలో ఉన్న అమరవీరుల తోటలో పూర్తి గౌరవంతో అమరవీరులైన ధైర్య సైనికుల భౌతికకాయానికి గౌరవ వందనం (సెల్యూట్/నివాళి) అందజేశారు.

ఈ సందర్భంగా, ప్రజా ప్రతినిధులు దంతేవాడ ఎమ్మెల్యే గౌరవనీయ చైత్ రామ్ అట్టమి, ప్రాంతీయ ఎమ్మెల్యే గౌరవనీయ విక్రమ్ మాండవి, బస్తర్ రేంజ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్ రాజ్ పి, దంతేవాడ రేంజ్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కమలోచన్ కశ్యప్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి ఆర్ పి ఎఫ్ ఆప్స్ బీజాపూర్ సెక్టార్ భూపేంద్ర సింగ్ నేగి, బీజాపూర్ కలెక్టర్ శ్రీ సంబిత్ మిశ్రా, బీజాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్, దంతేవాడ పోలీస్ సూపరింటెండెంట్ గౌరవ్ రాయ్, పోలీస్ సూపరింటెండెంట్ఎస్ టి ఎఫ్ స్మృతిక్ రాజ్నాల, డిప్యూటీ డైరెక్టర్ ఐ టి ఆర్ సందీప్ బాల్గా, జిల్లా పంచాయతీ బీజాపూర్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నమ్రత చౌబే, కమాండెంట్ కోబ్రా 210 కమాండెంట్ అశోక్ కుమార్, 168 సి ఆర్ పి ఎఫ్ కమాండెంట్ . జాంగిర్, 170 సి ఆర్ పి ఎఫ్ కమాండెంట్ శ్రీ సర్కార్ రాజా రామన్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ శ్రీ రవీంద్ర కుమార్ మీనా, అదనపు పోలీసు సూపరింటెండెంట్ శ్రీ అమన్ కుమార్ ఝా, అదనపు పోలీసు సూపరింటెండెంట్ శ్రీ చంద్రకాంత్ గోవర్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆప్స్ శ్రీ సుదీప్ సర్కార్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బస్తర్ పాల్గొన్నారు. పోరాట యోధుడు శ్రీ చంద్రహాస్, ఇతర అధికారులు మరియు ఉద్యోగులు, ఛత్తీస్‌గఢ్ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీ జి. వెంకట్ మరియు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.అమరవీరుల సైనికుల భౌతికకాయాలను వారి స్వగ్రామాలకు గౌరవప్రదంగా అంత్యక్రియల కోసం పంపారు. ఎన్‌కౌంటర్‌లో డీఆర్‌జీ బీజాపూర్‌కు చెందిన ముగ్గురు సైనికులు గాయపడ్డారు. వారిని వెంటనే తరలించి మెరుగైన చికిత్స కోసం హెలికాప్టర్ ద్వారా రాయ్‌పూర్‌కు తరలించారు. సైనికులు ప్రమాదం నుంచి బయటపడ్డారు మరియు ఆరోగ్యంగా ఉన్నారు. గాయపడిన సైనికుల వివరాలు:

1. ఏ ఎస్ ఐ జనార్ధన్ కోరం
2. కానిస్టేబుల్ సోందేవ్ యాదవ్
3. కానిస్టేబుల్ రాంలు హేమ్లా




## 'తెలుగు చదువుకుంటేనే ఉద్యోగం'.. వెంకయ్యనాయుడు కీలక వ్యాఖ్యలు!

కృష్ణా , డిసెంబరు 4 : తెలుగు భాషపై భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. తెలుగు చదువుకుంటేనే ఉద్యోగం ఇస్తామంటేనే తెలుగు చదువుతారని వ్యాఖ్యానించారు. మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీలో కృష్ణా తరంగ్ - 2025 ఉత్సవాలను ఇవాళ(గురువారం) ప్రారంభించారు. రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు జయంతి సందర్భంగా తెలుగు భాషను ప్రభుత్వ కార్యక్రమాల్లో ఉత్తర, ప్రత్యుత్తరాలు చేసేలా ఉండాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచించారు. అదే రామోజీరావుకి ఇచ్చే ఘన నివాళి అని తెలిపారు. ఇంగ్లీష్ వాళ్లు వారి భాషను అధికార భాషగా ఏర్పాటు చేసుకుని పాలన చేశారని... మనం తెలుగు వాళ్లం కాబట్టి తెలుగును పరిపాలన భాషగా చేసుకోవాలని సూచించారు. భారతీయ భాషలను కాపాడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆలోచిస్తున్నారని చెప్పుకొచ్చారు. మెడికల్, ఇంజనీరింగ్ బోధన ఆయా మాతృభాషల్లో జరిగేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. మనకు ఇంగ్లీష్ మాట్లాడటం రాకపోయినా పేపర్ మీద రాసుకుని మాట్లాడతారని పేర్కొన్నారు వెంకయ్య నాయుడు. ఇంగ్లీష్ మాట్లాడితేనే గొప్ప అని కొంతమంది భావిస్తున్నారని.. ముందు మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వాలని... ఆ తర్వాత సోదర భాషలు నేర్చుకోవాలని కోరారు.


తాను చదువుకునే రోజుల్లో తెలియక హిందీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నానని గుర్తుచేశారు. తాను వీధి బడిలో చదువుకుని... ఉప రాష్ట్రపతి వరకు వెళ్లానని తెలిపారు. దేశంలో 22 భాషలు ఉన్నాయని... రాజ్యసభలో ఈ భాషలోనైనా మాట్లాడవచ్చనే ఉత్తర్వులు ఇచ్చామని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

చురకలు



## మిర్యాలగూడకు.. ఆ పేరెలా వచ్చిందంటే...!

మిర్యాలగూడ : రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో ఒకటిగా ఉన్న మిర్యాలగూడ ప్రాంతం..పంట సేకరణ, రైస్ మిల్లుల రంగంలో దేశంలోనే పేరు గాంచింది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన మిర్యాలగూడకు ఆ పేరెలా వచ్చిందో తెలుసుకోవాలనే ఆసక్తి అనేక మందికి ఉంటుంది. పూర్వం నుంచి ఉన్న కథనాల ప్రకారం..నిజాం నవాబులు తమ పాలనలో భాగంగా నాణేల మార్పిడికి ఈ ప్రాంతంలో టంకశాలను ఏర్పాటు చేశారు. ఆ టంకశాల వ్యవహారాలు పర్యవేక్షించేందుకు మీర్ ఆలం అనే అధికారిని నియమించారు. ఆయన గుర్రాలను నిలిపేందుకు, సేద తీరేందుకు పెద్ద బజార్‌లో ఓ భవనాన్ని సైతం నిర్మించారు. ఆయన పేరుతోనే ఈ ప్రాంతం మిర్యాలగూడగా మారిందని పలువురు చెబుతుంటారు.



ఆయన హయాంలో నిర్మించిన మసీదు సైతం ప్రస్తుతం పట్టణంలోని పెద్ద బజారులో నేటికీ ఉంది. తొలుత పురపాలికగా..ఆ తర్వాత మేజర్ గ్రామ పంచాయతీగా తిరిగి పురపాలికగా ఏర్పడి ప్రస్తుతం గ్రేడ్-1 పురపాలికగా ఉంది. పట్టణ జనాభా 1941లో 5,628 ఉండగా.. 2011 నాటికి 1.09 లక్షలకు చేరింది. ప్రస్తుతం లక్షన్నర పైగా జనాభా ఉన్న పట్టణం గుండా రాష్ట్ర రహదారి, జాతీయ రహదారి 167తో పాటు రైలు మార్గం సైతం ఉంది.

## డబ్బులు ఎవరికీ ఊరికే రావు..!

చిట్యాల : అది రామాపురం. ప్రజలు వ్యవసాయం, ఆధారిత కూలీ పనులతో జీవనం సాగిస్తుంటారు. నడి వయస్కులు గ్రామ కూడలిలోని మర్రిచెట్టు కిందకు చేరి, పిచ్చాపాటిగా కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు. రోజు మాదిరిగానే దానయ్య, రామిరెడ్డి, లతీఫ్, అంజయ్యలు మధ్యాహ్నం అక్కడికి చేరుకున్నారు. గ్రామంలో పంచాయతీ ఎన్నికల వాతావరణం రావడంతో కబుర్లు ఎన్నికలు, పోటీచేసే అభ్యర్థుల మీదికి మళ్లాయి.'గత సర్పంచి ఎన్నికల్లో మా మేనమామ ఊర్లో ఓటుకు రూ.2 వేలు పంచారంట.' తనకు తెలిసిన విషయం చెప్పాడు లతీఫ్.

'నిజమే లతీఫ్ భాయ్.. మా అత్తగారి ఊర్లో కూడా అందరికీ ప్రతిరోజు మధ్యాహ్నం బిర్యానీ పెట్టారంట. ఓటుకు రూ.వెయ్యి ఇచ్చారంట. రాత్రి దావత్ కూడా ఇచ్చారంట' చెప్పాడు అంజయ్య.

'ఎవరి కోసం ఖర్చుచేస్తారు. పదవిలోకి రారా? వచ్చాక సంపాదించుకోరా? ఇక్కడ మనకి ఇవ్వాల్సిందే. లేదంటే మనమే గట్టిగా అడగాలి.' హక్కు మాదిరిగా బల్లగుద్దినట్లుగా చెప్పారు రామిరెడ్డి,



అంజయ్య.పక్కన కిరాణకొట్టు దగ్గర నిల్చొని వారి సంభాషణ వింటున్న రాకేష్ అనే డిగ్రీ విద్యార్థి వారి వద్దకు వచ్చి మాటలు కలిపాడు.

'అభ్యర్థులు మనకి డబ్బులు ఎందుకు ఇవ్వాలి..?' అడిగాడు వారిని ఉద్దేశించి. 'అన్ని ఊర్లల్లో జరుగుతున్నది ఇదేగా. ఇక్కడకొత్తేముంది బాబూ..?' అంటూ ప్రశ్నించారు వాళ్లు. అప్పుడు రాకేష్ ఇలా చెప్పాడు..' మీరంతా ఎవరికష్టం మీద వారు ఆధారపడి బతుకుతున్నవాళ్లు. కష్టపడకుండా ఏనాడైనా డబ్బులు వచ్చాయా? మధ్యాహ్నం బిర్యానీ, రాత్రి దావత్‌పేరుతో రకరకాల రుచులు చూపించేది ఎందుకనుకుంటున్నారు. వారం, పది రోజులపాటే ఈ బిర్యానీ, దావత్‌ల జాతర. నాకు తెలిసిన మిత్రుడి గ్రామంలో ఇలాగే ఖర్చుచేసిన అభ్యర్థి ఓడిపోయాడు. పోలింగ్ మరుసటిరోజు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇచ్చిన డబ్బులను ముక్కుపిండి వసూలు చేసుకున్నాడు. అందుకే పోటీచేసే అభ్యర్థుల గుణగణాలు, వ్యక్తిత్వం చూసి ఓటేయండి. వారు ఇవ్వచూపే డబ్బులకు కాదు. ఆలోచించండి. డబ్బులు ఎవరికీ ఊర్కనే రావు.' అని చెప్పి నవ్వుతూ వెళ్లిపోయాడు.

## చకచకా రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి

హైదరాబాద్ : అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా చేపట్టిన రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి పనులను వేగంగా చేపట్టడంపై దక్షిణ మధ్య రైల్వే దృష్టి సారించింది. ఇటీవలే పనులు పూర్తి చేసి బేగంపేట రైల్వేస్టేషన్‌ను ప్రారంభించగా మిగిలిన 11 స్టేషన్ల పనులు పురోగతిలో ఉన్నాయి. వీటిలో హైటెక్ సిటీ, మల్కాజిగిరి స్టేషన్ల పనులను ఫిబ్రవరిలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. బేగంపేట రైల్వేస్టేషన్‌లో మరిన్ని సౌకర్యాల కల్పనపై దృష్టి సారించి రెండో ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం బేగంపేట మెట్రో స్టేషన్ వైపు నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా..రెండో మార్గం నుంచి రాకపోకలు సాగించడంతో పాటు వాహనాలు నిలిపేలా పార్కింగ్ సదుపాయాన్ని కల్పించనున్నారు. మల్కాజిగిరి స్టేషన్‌లో 85 శాతం పనులు పూర్తయ్యాయి. పైవంతెన దాదాపుగా పూర్తయింది. ఆర్పీఎఫ్ కార్యాలయం, టీస్టాల్, ప్రయాణికులు వేచిఉండే గదులు, ప్లాట్‌ఫాం 1, 2లో పనులు తుది దశలో ఉన్నాయి. హైటెక్ సిటీ రైల్వేస్టేషన్‌లో సుమారు 80 శాతం పనులు పూర్తికాగా ఫిబ్రవరిలో రెండో దశ పనుల్లో భాగంగా రూ.10 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించనున్నారు.

**అధునాతన హంగులతో..** రాజధాని పరిధిలో చేపట్టిన పనులతో రైల్వేస్టేషన్ల రూపురేఖలు మారబోతున్నాయి. స్టేషన్ల పునరాభివృద్ధి పనుల కోసం దక్షిణ మధ్య రైల్వే సుమారు రూ.490 కోట్లు ఖర్చు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1830.4 కోట్ల వ్యయంతో 38 స్టేషన్లను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తుండగా రాజధాని పరిధిలోనే 12 స్టేషన్లు ఉండడం విశేషం. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పనులు పూర్తవనున్నాయి.

# విధులు సరే.. నిధులేవీ?




నకిరేకల్ : పల్లెలకు ఎన్నికల పండుగొచ్చింది. విజయవంతం కావాలంటే సరిపడా డబ్బులుండాలి. నామినేషన్ల ఘట్టం ముగిసినా ఎన్నికల నిర్వహణ కోసం క్షేత్రస్థాయికి పైసా నిధులు ప్రభుత్వం నుంచి రాలేదు. గ్రామాల సంఖ్య ఆధారంగా ఒక్కో మండలానికి రూ.ఐదు నుంచి పది లక్షలు అవసరం అవుతున్నాయి. అధిక శాతం మండల పరిషత్‌లలో జనరల్ ఫండ్ కూడా లేకపోవడంతో ఎన్నికల ఏర్పాట్లకు ప్రస్తుతం నిధుల కటకట నెలకొంది.

జిల్లా కేంద్రం నుంచి పలుమార్లు ఎన్నికల సామగ్రిని తీసుకువచ్చేందుకు వాహనాల అద్దెలు, కోడ్ అమలుకు ఏర్పాట్లు, పంచాయతీలకు ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కోసం రవాణా ఛార్జీలు, కేంద్రాల నిర్వహణ, పోలింగ్ సిబ్బందికి భోజనాలు తదితర ఖర్చులు ఉంటాయి. పోల్ సిబ్బంది రెమ్యూనరేషనే మండలానికి రూ.3 లక్షలకుపైగా అవసరంగా ఉంటుంది.

2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ముందస్తుగానే ప్రతి మండలానికి రూ.లక్ష చొప్పున విడుదల చేయడంతో ఏర్పాట్లు జరిగిపోయాయి.

నాలుగైదు గ్రామాలకు ఒకటి చొప్పున నామినేషన్ల స్వీకరణ (స్టేజ్-1) కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇలా ఒక్కో మండలంలో ఐదు నుంచి పది వరకు కేంద్రాలు ఏర్పాటు చేసి నామపత్రాలు స్వీకరించారు. ఎన్నికల అధికారులు, గ్రామ పంచాయతీల సిబ్బంది, పోలీసులు ఇలా.. 20 మంది వరకు పనిచేశారు. వీరికి భోజన వసతి సౌకర్యాల భారం అంతా సంబంధిత పంచాయతీ కార్యదర్శులపైనే పడటం గమనార్హం. నామినేషన్ల చివరి రోజు గడువు ముగిసేలోపు డిజిటల్ గడియారాలను కొనుగోలు చేయాలని శుక్రవారం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో క్షేత్రస్థాయి సిబ్బంది పరుగులు తీశారు. ఒక్కో డిజిటల్ వాచ్‌ను రూ.వెయ్యి నుంచి 1200లకు కొనుగోలు చేసి స్టేజ్-1 కేంద్రాల్లో పెట్టారు.

ఎన్నికల నిర్వహణ నిధులు త్వరలోనే అందుతాయని, ట్రెజరీ నుంచి విడుదల కావాల్సి ఉందని నియోజకవర్గానికి చెందిన ఒక అధికారి తెలిపారు.

జిల్లాలో ఇలా..

మండలాలు: 33

గ్రామ పంచాయతీలు 869

వార్డులు: 7,494

నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు 117

# పర్యావరణం..!



మిర్యాలగూడ : ఉమ్మడి జిల్లాలో ఏటా కాలుష్యం భారీగా పెరుగుతోంది. రహదారుల నిర్మాణం, విస్తరణతో చెట్లనే నరికేయడం, పరిశ్రమలు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటించకపోవడం, వాహనాల వినియోగం భారీగా పెరగడం తదితర కారణాలతో కాలుష్యం కోరలు చాస్తోంది. ప్రజలు, పారిశ్రామిక వేత్తల్లో అవగాహన పెంచేందుకు ఏటా డిసెంబరు 2న 'జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

**ప్రమాదకరంగా ధూళి కణాలు..**

కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం ఘనపు మీటరు గాలిలో 2.5 మైక్రో మీటర్ (పీఎం 2.5) వ్యాసం గల ధూళి కణాల సూచీ 30 వరకు ఉంటే కనిష్ఠ ప్రమాదంగా పరిగణిస్తారు. కానీ ఉమ్మడి జిల్లాలో పలు సమయాల్లో 30 దాటి అధికంగా నమోదవుతుంది. మరో వైపు నిబంధనల ప్రకారం ఘనపు మీటరు గాలిలో 10 మైక్రో మీటర్ వ్యాసం(పీఎం10) కలిగిన ధూళి కణాల సూచీ 50 వరకు ఉండొచ్చు. కానీ ఉమ్మడి జిల్లాలోని నల్గొండలో 70, సూర్యాపేటలో 73, దేవరకొండలో 81గా నమోదవుతుంది.

ఉమ్మడి జిల్లాలో గాలి నాణ్యత పరీక్ష కేంద్రాలు ఉన్న పట్టణాలు

సూర్యాపేట 3

మిర్యాలగూడ 3

నల్గొండ 1

భువనగిరి 1

**వీడని ప్లాస్టిక్ భూతం..**

తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచుల వినియోగంపై ప్రభుత్వం నిషేధించినప్పటికీ ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. 19 పురపాలికల్లో నిత్యం టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఈ ప్లాస్టిక్ సంచుల కారణంగా పర్యావరణ కలుషితంతో పాటు వాటిని తింటున్న మూగజీవాలు అనారోగ్యానికి గురవుతున్నాయి.

**నీటి కాలుష్యంతో అనారోగ్యం..**

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా కృష్ణా, మూసీ వంటి నదులతో పాటు జలాశయాలు, వేల సంఖ్యలో చెరువులు, కుంటలు ఉన్నాయి. జిల్లాలో ఉన్న పలు పరిశ్రమల నుంచి వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా నేరుగా కాలువల్లోకే వదులుతుండడం, పంట పొలాల్లో విచ్చలవిడిగా క్రిమి సంహారక మందులు వాడడం వంటి కారణాలతో జలవనరులన్నీ కలుషితం అవుతున్నాయి.

నియంత్రించేందుకు ఇవి పాటించాలి

వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించాలి

విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలి

పరిశ్రమలు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటించాలి

పంట వ్యర్థాల కాల్చివేతను నిరోధించాలి.

ప్రజలు భాగస్వాములు కావాలికాలుష్యం ఏ రూపంలో ఉన్నా ప్రజలు జీవ జాతులకు అనర్థాలు తప్పవు. ముఖ్యంగా జల, వాయు కాలుష్యాల కారణంగా శ్వాస సంబంధ వ్యాధులు, ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలు, గుండె పోటు, ఊపిరితిత్తుల క్యాన్సర్, చర్మ వ్యాధులు వంటి పలు రకాల సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. కనుక కాలుష్య నియంత్రణలో ప్రజలు సైతం భాగస్వాములు కావాలి.

డాక్టర్ ప్రసన్నకుమార్, మిర్యాలగూడ

# వడివడిగా ధాన్యం సేకరణ



ఎల్లారెడ్డిపేట: వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం సేకరణ వడివడిగా కొనసాగుతోంది. మెట్ట ప్రాంతమైన జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో రైతులు వరి పంటను సాగు చేశారు. 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అవసరమైన చోట కేంద్రాలను నెలకొల్పారు. ఈ నెల 1 వరకు 32,085 మంది రైతులు వద్ద రూ.474.04 కోట్లు విలువ చేసే 198426 మెట్రిక్ టన్నులు కొన్నారు. 26,541 మంది రైతులకు చెందిన 1,41,842 మెట్రిక్ టన్నుల ధాన్యం డబ్బులు రూ.308.86 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు.

**అకాల వర్షాలతో ఆందోళన చెందినా..**

వానాకాలం వరి కోతలను ప్రారంభించిన రైతులు వెనువెంటనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. తొలుత అప్పుడప్పుడు కురిసిన అకాల వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దయింది. కొన్ని చోట్ల వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నిర్ణీత తేమశాతం 17 వచ్చిన ధాన్యాన్ని కుప్పగా పోయడం, మళ్లీ ఎండబెట్టడం వల్ల రైతులు పట్టాల అద్దెకు, కూలీలకు అదనపు వ్యయం చేయాల్సి వచ్చింది. తూకాలు కూడా మందకొడిగా సాగాయి. ఆ తర్వాత వర్షాకాలం పూర్తయి, శీతాకాలం ప్రారంభవడంతో ఇక్కట్లు తీరాయి. వాతావరణం అనుకూలించగానే తూకాలు వేగవంతమయ్యాయి. తూకం వేసిన బస్తాలను కూడా కేటాయించిన మిల్లులకు చేర్చే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. జిల్లా కలెక్టర్ నుంచి మండల స్థాయి వరకు అధికారులు కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు. కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. గన్నీ సంచులు, హమాలీలు, లారీల కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టారు. కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు, రైతులను సమన్వయపరుస్తున్నారు. వచ్చే నెల రెండో వారం వరకు జిల్లాలో కొనుగోళ్లు పూర్తయ్యే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

**25 కేంద్రాల మూసివేత**

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 239 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించారు. 18,8475 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 9951 మెట్రిక్ టన్నుల సన్నరకం వడ్లను కొన్నారు. ఇందులో 1,90,942 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు చేర్చారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సి ఉంది. కొనుగోళ్లు పూర్తి చేసుకున్న 25 కేంద్రాలను మూసి వేశారు.

## ఉద్యానంపై కన్ను.. అధికారుల దన్ను

హైదరాబాద్ : నగరంలో ఉద్యానవనాలకు రక్షణ కల్పించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులే వాటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ ప్రధాన రహదారికి, రోడ్డు నం.66కు ఆనుకుని 30 గుంటల్లో ఉండాల్సిన పార్కు విషయంలో అదే జరిగింది. ఎలాంటి సర్వే చేయకుండా.. దశాబ్దాల నాటి ఉద్యానవనం ఆక్రమణకు బల్దియా అధికారులు దన్నుగా నిలిచారు. ఇది పార్కు కాదు.. రోడ్డు అని అధికారులు నిర్ణయించడంతో స్థానికులు రెచ్చిపోయారు. ఉద్యానవనం ప్రహరీని కూల్చి లోపల చెట్లను తొలగించి 10 అడుగుల మట్టితో పూడ్చి రోడ్డును నిర్మించారు. ఘటనపై విచారణ జరపాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్



వెంకటేశ్, స్థానికులు కోరుతున్నారు.

**రూ.50కోట్ల భూమి**

జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్ ప్రకారం రోడ్డు నం.66 నుంచి పక్కనున్న కాలనీకి రోడ్డు ఉంది. ఆ లేఅవుట్ ఎప్పటిది.. సవరణకు గురైన లేఅవుటా.. కాదా అన్నది జూబ్లీహిల్స్ సర్కిల్ అధికారులు విచారించలేదు. సర్కిల్ ఉన్నతాధికారిని వివరణ కోరగా విచారించి చెబుతానని సమాధానమిచ్చారు. అంటే.. గుడ్డిగా పార్కు గోడను కూల్చి.. రోడ్డు నిర్మాణానికి అధికారులు అంగీకరించారని అర్థమవుతోంది. దాదాపు 600 గజాల్లో రోడ్డు నిర్మించారని, దాని విలువ రూ.50 కోట్ల వరకు ఉంటుందని జోనల్ కమిషనర్ కార్యాలయంలో స్థానికులు ఫిర్యాదు చేశారు.

## పోకిరీలు!

"అతడో ప్రభుత్వ ఉద్యోగి..తననెవరూ గమనింట్లేదనే ధీమాతో ఆడపిల్లతో అనుచితంగా ప్రవర్తించాడు. అదుపులోకి తీసుకున్న పోలీసులతో వాదనకు దిగాడు. తాము రికార్డ్ చేసిన వీడియోను చూపితే తప్పయిందని.. కాళ్లావేళ్లా పడ్డాడు."

"ఆరు పదుల వయసు.. మనుమరాలి వయసున్న బాలికను తాకాడు. మరో మహిళకు దగ్గరగా వెళ్లి వికృతబుద్ధి చూపే ప్రయత్నంలో షీటీమ్స్ చిక్కాడు. కౌన్సెలింగ్ సమయంలో కుటుంబసభ్యుల ఎదుట ముఖం చూపలేక విలవిల్లాడిపోయాడు. మరోసారి ఇటువంటి చేష్టలకు పాల్పడితే జైలు ఖాయమని పోలీసులు హెచ్చరించారు."

ఈనాడు, హైదరాబాద్ : నగరంలో నిత్యం ఆడపిల్లలు వేధింపులు చవిచూస్తున్నారు. గడప దాటినప్పటి నుంచి ఇల్లు చేరేవరకూ కొందరి వికృతచేష్టలకు మనోవేదన అనుభవిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, బహిరంగ ప్రదేశాల్లో ఆకతాయిల వేధింపులపై నెలకు 500కుపైగా ఫిర్యాదులు వస్తుయి. షీటీమ్స్ నిఘాతో రోజూ 10-15 మంది పట్టుబడుతున్నారు. వేధింపులకు గురైన బాధితురాలు దాన్నుంచి బయటపడేందుకు 3-4 నెలల సమయం పడుతుందని మనస్తత్వ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సున్నిత మనస్కులైతే 1-2 ఏళ్ల పాటు కుంగుబాటుకు గురవుతుంటారు. వరుస ఫిర్యాదులతో సీపీ సజ్జనార్ పోకిరీలపై కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఆడపిల్లల జోలికొస్తే హిస్టరీ షీట్ ఓపెన్ చేయమని ఎస్‌హెచ్‌వోలను ఆదేశించారు.

అమ్మాయిలను వేధిస్తే కొలువు మాయం

ఆకతాయిలకు అడ్డుకట్ట వేసే క్రమంలో పోలీసులు కేసులు, కౌన్సెలింగ్‌కే పరిమితంగాకుండా ఆ ప్రబుద్ధులు పనిచేసే కంపెనీలకు సమాచారమిస్తున్నారు. వినాయక ఉత్సవాలు, బోనాలు, ఊరేగింపుల్లో యువతులతో అనుచితంగా ప్రవర్తించిన 1000 మందిని పట్టుకున్నారు. వీరిలో ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులు, వృద్ధులు, మైనర్లున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నతాధికారులు మెమోలు జారీచేశారు. ప్రైవేటు ఉద్యోగుల్లో 20 మందిని కొలువుల నుంచి తొలగించినట్టు సమాచారం. మెట్రోరైళ్లు, బస్టాప్‌లు, విద్యాసంస్థల సమీపంలో పోకిరీలపై షీటీమ్స్ నిఘా ఉందని.. మహిళా భద్రతా విభాగం డీసీపీ డా.లావణ్య నాయక్ జాదవ్ హెచ్చరించారు. బాధితులు డయల్ 100, 112 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.

## ఎనిమిదేళ్లయినా ఎదురుదెబ్బలేనా?

హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రోరైలు సేవలు ప్రారంభమై ఎనిమిదేళ్లు అవుతున్నా ఇప్పటికీ బాలారిష్టాలను ఎదుర్కొంటోంది. కనుచూపు మేరలో కష్టాలు గట్టెక్కె పరిస్థితి కన్పించకపోవడంతో సర్కారు కు అప్పగించేందుకు ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ సిద్ధమైంది. మెట్రోను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్మించారు. కేటాయించిన భూముల నుంచి 45 శాతం ఆదాయం రాబట్టుకోవాలి. రియల్ ఎస్టేట్, ప్రకటనలు, ప్రయాణికుల ఛార్జీల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ.1112.66 కోట్లు వచ్చింది. ఖర్చేమో రూ.1738.57 కోట్లు. ఇందులో రూ.940 కోట్లు అప్పులపై వడ్డీలకు చెల్లిస్తున్నారు. 2024-25లో రూ.625.88 కోట్ల నష్టం వచ్చింది. ఏటే పెరుగుతోంది.

**సమస్యలు అధిగమించలేక...**



రద్దీకి అనుగుణంగా రైళ్లను మెట్రో నడపలేపోతుంది. సర్కారు చేతికి వచ్చాక కొనుగోలుకు ఆర్డర్ ఇస్తే కొత్త కోచ్‌లు వచ్చేందుకు 18 నెలలు పడుతుందని మెట్రో ఎండీ అంటున్నారు.

మెట్రోరైలు స్టేషన్ల నుంచి ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీ సమస్యగా ఉంది. కొన్ని స్టేషన్లకు మినహా గుమ్మం నుంచి గమ్యం దాకా సేవలు లేవు. దీంతో వ్యక్తిగత వాహనాల్లో వెళ్లేందుకు ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. మెట్రో విస్తరణ ముందుకు సాగకపోవడం కూడా ప్రయాణికుల సంఖ్య పెరగకపోవడానికి ఒక కారణంగా కనబడుతోంది.

మెట్రో రైలు స్టేషన్లలో మాల్స్ ఉన్నాయి. వీటిని లీజు ఇవ్వడంలో సదరు సంస్థ పూర్తిగా విఫలమైంది.

మెట్రో, ఆర్టీసీ, ఎంఎంటీఎస్, క్యాబ్‌లు అన్నింటికి చెల్లుబాటు అయ్యేలా కామన్ కార్డు ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది.

చురకలు



## పరిశోధనలకు ఖ'నిజ' సంపద..!

కొత్తగూడెం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే తొలి విశ్వవిద్యాలయంగా డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ పేరొందింది. పాల్వంచలో సుమారు 312 ఎకరాల విస్తీర్ణంలో ఈ విశ్వవిద్యాలయం కొలువుదీరింది. బొగ్గు, ఖనిజ సంపదతో రాష్ట్రానికి వెలుగునిస్తున్న భద్రాద్రి జిల్లా.. విద్యారంగంలోనూ ఆదర్శంగా నిలవబోతోంది. భూగర్భ విజ్ఞానంలో సరికొత్త ఆవిష్కరణలకు 'ఎర్త్ సైన్సెస్' శ్రీకారం చుట్టనుంది. మైనింగ్ కార్యకలాపాల వల్ల పర్యావరణంపై పడుతున్న ప్రభావాన్ని అధ్యయనం చేయనుంది. మైనింగ్ పరిశోధనలకు సింగరేణి సంస్థ రూ.కోట్లు వెచ్చిస్తోంది. భూవిజ్ఞాన విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించే విద్యార్థులకు సింగరేణి ఓ ప్రయోగశాలగా మారనుంది. కాలుష్య నియంత్రణకు యూనివర్సిటీ పరిశోధనల ద్వారా పరిష్కారం దొరకనుంది. విశ్వవిద్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించనున్నారు.

**అవకాశాలు పుష్కలం**

గోదావరి నదికి దగ్గరగా ఉండటం వల్ల సహజ వనరులు, జీవ వైవిధ్యం, ఖనిజ సంపదకు భద్రాద్రి జిల్లా పెట్టింది పేరు. ఇలాంటిచోట ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేయటం ద్వారా ఖనిజ సంపదకు సైన్స్‌ను జోడించినట్లయ్యింది. ప్రధానంగా జియాలజీ, జియోఫిజిక్స్, మైనింగ్ ఇంజినీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ వంటి



భూవిజ్ఞాన శాస్త్రాలపై దృష్టి సారించనుంది. సింగరేణి కాలరీస్, ఎన్‌టీపీసీ వంటి సంస్థలకు అవసరమైన నిపుణులు, సాంకేతికతను అందించడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది.

అశ్వాపురం భారజల కేంద్రం ద్వారా న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నిర్వహణపై శోధించవచ్చు.

సింగరేణి బొగ్గును మండించటం ద్వారా థర్మల్ విద్యుత్కేంద్రాల నుంచి బూడిద విడుదలవుతోంది. భూగర్భ గనులు, ఇలాంటి బూడిదలో 'క్రిటికల్ మినరల్స్' లభిస్తాయి. అవి బుల్లెట్ ట్రైన్, సెల్‌ఫోన్ పరికరాల తయారీలో ఉపయోగపడతాయి. చైనా, యూఎస్, ఆస్ట్రేలియాలో మాత్రమే లభ్యమవుతున్న ఇలాంటి వనరులు భద్రాద్రి జిల్లాలోనూ ఉన్నాయి. లక్ష్మీదేవిపల్లి మండలంలో రేగళ్ల వద్ద 'మైకా' ఖనిజాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గతంలో గుర్తించారు. మణుగూరు పగిడేరు వద్ద సహజంగా లభించే వేడినీళ్ల ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చునని, ఈ జలాలు ఔషధ గుణాలు కలిగి ఉన్నాయని కనుక్కున్నారు.

ఖమ్మం జిల్లాలో గ్రానైట్ పరిశ్రమలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కిన్నెరసాని అభయారణ్యం వంటివన్నీ పరిశోధనలకు ఊతమిస్తాయి.

## సరిహద్దులో అప్రమత్తం


చర్ల: ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం(పీఎల్‌జీఏ) 20వ వార్షికోత్సవాలు మంగళవారం నుంచి ఈనెల8 వరకు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో సరిహద్దులో పోలీసులు అప్రమత్తమయ్యారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని చర్ల, దుమ్ముగూడెం మండలాలు, భద్రాచలం పట్టణంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుత పరిణామాలు అనుకూలంగా లేక పోయినా బలం ఉన్నచోట వారోత్సవాలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ తమ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఈక్రమంలో దండకారణ్యాన్ని ఆనుకొని ఉన్న భద్రాద్రి ఏజెన్సీలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. తీవ్ర నైరాశ్యంలో ఉన్న మావోయిస్టులు సరిహద్దులో అనూహ్యంగా విధ్వంసాలకు తెగబడే ప్రమాదం లేకపోలేదనే నిఘా వర్గాల సూచనలతో పోలీసులు ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. ఛత్తీస్‌గఢ్ మార్గాల్లో కేంద్ర పారామిలిటరీ బలగాలు నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయి. భద్రాచలం నుంచి మారుమూల ప్రాంతాలకు రాత్రిపూట బస్సు సర్వీసులను నిలిపివేశారు. మావోయిస్టుల లక్ష్యంగా చేసుకున్నవారిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా పోలీసులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మారుమూల ప్రాంతాలకు నాయకులు ప్రచారానికి వెళ్లే ముందు తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

**ఎఫ్‌ఓబీల్లో భద్రత పెంపు..**

సరిహద్దులోని ఎఫ్‌ఓబీ(ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్) క్యాంపుల్లో అదనపు భద్రత కల్పించారు. గడిచిన కొద్దినెలల్లో మావోయిస్టు పార్టీ అధినేత నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజుతో పాటు మోస్ట్ వాంటెడ్ హిడ్మా వంటి కీలక నేతలు ఎన్‌కౌంటర్లలో మరణించారు. లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీ వెన్ను విరిగినట్లయ్యింది. ఈ పరిస్థితుల్లో మావోయిస్టులు తమ ఉనికి కోసం వారోత్సవాల సమయం లో ఏమైనా చేయొచ్చనే అనుమానాలతో పోలీసులు ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. అనుమానిత ప్రాంతాల్లో రాత్రిపూట గస్తీ తిరుగుతున్నారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో సీఐలు రాజువర్మ, వెంకటప్పయ్యల నేతృత్వంలో రహదారులపై విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. సరిహద్దు ఠాణాల్లో తీసుకోవాల్సిన భద్రత చర్యలపై ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ దిశానిర్దేశం చేస్తున్నారు.

## విజయంలో ఆమె కీలకం!

సంగారెడ్డి : జిల్లాలో స్థానిక సంస్థల తొలి విడత ఎన్నికల పోరులో భాగంగా నామినేషన్ల పర్వం ముగిసింది. ఇంటింటా ప్రచారంతోపాటు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నేతలు వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఏ వార్డులో అత్యధిక మంది ఓటర్లు ఉన్నారు? వారు డిమాండ్లు ఏమిటి? ఓటర్లను ఎలా ప్రసన్నం చేసుకోవాలనే విషయంపై దృష్టి సారించారు. జిల్లాలో మహిళల ఓట్లు అత్యధికంగా ఉండటంతో అభ్యర్థుల విజయంలో వారు కీలకపాత్ర పోషించనున్నారు. అందోలు నియోజకవర్గంలో ఎక్కువ:



జిల్లాలో 613 గ్రామ పంచాయ తీలు, 5370 వార్డులు ఉన్నాయి. తొలి విడత ఎన్నికలు సంగారెడ్డి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 163 గ్రామాలు, 1246 వార్డులకు నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం ఓటర్లు 7,44,157 మంది ఉన్నారు. వీరిలో పురుషుల ఓట్లు 3,68,258 కాగా.. మహిళల ఓట్లు 3,75,855 ఉన్నాయి. ఇతరులు 44 మంది. ఈ లెక్కన పురుషుల కంటే మహిళల ఓట్లు 7,597 ఎక్కువగా ఉండటం గమనార్హం. జిల్లాలోనే అత్యధికంగా అందోలు నియోజకవర్గంలో 3166 మహిళా ఓట్లు పురుషుల కంటే అధికంగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. గెలుపోటములపై మహిళల ఓట్లు కీలకం కానున్నాయి.

## ఉన్నత విద్యకు.. కేజీబీవీల్లో ఊతం



కరీంనగర్ : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) విద్యార్థినులు ఉన్నత చదువులు అభ్యసించేందుకు, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు అందిపుచ్చుకునే కార్యక్రమం రాష్ట్ర సమగ్ర శిక్షా అధికారులు చేపడుతున్నారు. ఇప్పటికే 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు అందిస్తున్న ఉచిత విద్య, భోజన, వసతి సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావకాశాలవైపు బాలికలు ముందుకు సాగుతున్నారు. ఇంటర్ పూర్తి కాగానే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉన్నత విద్యాసంస్థల ప్రవేశ పరీక్షల్లో విజయం సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. ఇందు కోసం కొత్తగా ప్రతి జిల్లాకు మూడు చొప్పున కేజీబీవీలను యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(వైఐఐవోఈ) శిక్షణ కేంద్రాలుగా రాష్ట్ర సమగ్ర శిక్షా ఎంపిక చేసింది. వీటిల్లోని బాలికలు ప్రైవేటుకు దీటుగా ఉన్నత విద్యావకాశాల నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చు.

**ఎంపికైన కేజీబీవీలు**

కరీంనగర్ జిల్లాలో.. కరీంనగర్, శంకరపట్నం, రామడుగు

జగిత్యాలలో.. కోరుట్ల, జగిత్యాల, ఇబ్రహీంపట్నం

పెద్దపల్లిలో.. రామగుండం, జూలపల్లి, సుల్తానాబాద్

రాజన్నసిరిసిల్ల జిల్లాలో.. ముస్తాబాద్ (మ[illegible])పల్లి, సిరిసిల్ల, తంగళ్లపల్లి

ఒక్కోదాంట్లో ఒక్కోరకమైన పరీక్షపై..

వైఐఐవోఈలుగా ఎంపికైన కేజీబీవీల్లో ఇంటర్ విద్యార్థినులు పేరొందిన వృత్తి విద్యాసంస్థల్లో సీట్లు సాధించేందుకు శిక్షణ ఇస్తారు.

ఎప్‌సెట్, ఐఐటీ-జేఈఈ, నీట్, క్లాట్ తదితర ప్రవేశపరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబరిచేందుకు అవసరమైన నైపుణ్యాలు ఆన్‌లైన్ ద్వారా కొన్ని రోజులుగా నేర్పిస్తున్నారు.

3 కేజీబీవీల్లో ఒక దాంట్లో ఐఐటీ-జేఈఈ, మరో కస్తూర్బాలో నీట్, ఇంకొక దాంట్లో క్లాట్ ప్రవేశ పరీక్షలపై శిక్షణ అందిస్తున్నారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచి అన్ని కేజీబీవీల్లో అమలు చేసే ఆలోచనలో విద్యాశాఖ ఉంది.

ఉన్నత విద్యావకాశాల కోసం నైపుణ్యాలు పెంచే శిక్షణలు వీటిల్లో అందిస్తుండటంతో వచ్చే విద్యాసంవత్సరం నుంచి కేజీబీవీలకు మరింత ఆదరణ పెరగనుంది. ఇందులో భాగంగా వీటిల్లో 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్షలను నిర్వహించాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది.

**ప్రత్యేక తరగతులు**

కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో మొత్తం 12 కేజీబీవీలను వైఐఐవోఈ శిక్షణ కేంద్రాలకు ఎంపిక చేశారు. ఒక్కో జిల్లా నుంచి మూడు చొప్పున ఉన్నాయి. ఇప్పటికే ఆయా జిల్లాల్లోని కేజీబీవీల్లో విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నత విద్యావకాశాలు పొందేందుకు ఖాన్ అకాడమీ ఆధ్వర్యంలో 6-12 తరగతుల వారికి భౌతికశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, రసాయనశాస్త్రం సబ్జెక్టుల్లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ అందిస్తున్నారు. ఫిజిక్స్ వాలా ఆధ్వర్యంలో 9 నుంచి 12వ తరగతులకు ఫిజిక్స్, గణితంలలో ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. వీటితో పాటు ప్రత్యేకంగా ఇంటర్ చదువుతున్న బాలికలు వీటిల్లో చదువు పూర్తి కాగానే వారు పేరొందిన ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధించి ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రత్యేకంగా సన్నద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## ఆర్టీసీ స్థలం.. ఆక్రమణకు యత్నం



కోరుట్ల: కోరుట్లలో రూ.కోట్ల విలువ చేసే ఆర్టీసీ స్థలానికి రక్షణ కరవైంది. 63వ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న 12.18 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం 1977లో ఆర్టీసీకి కేటాయించింది. ఈ స్థలం చాలా సర్వే నంబర్లలో విస్తరించి ఉంది. అందులోనే సుమారు 9 ఎకరాల్లో బస్టాండ్, బస్‌డిపో, పెట్రోల్ పంపు ఏర్పాటుచేసి ప్రహరీ నిర్మించారు. కొంతకాలానికి దుకాణాల సముదాయాలను నిర్మించి అద్దెకిచ్చారు. బస్ డిపోను ఆనుకుని ఉన్న మిగిలిన సుమారు మూడెకరాల స్థలానికి ఎలాంటి రక్షణ గోడ, కంచె ఏర్పాటు చేయలేదు. భారీగా ముళ్లచెట్లు పెరిగి చిత్తడిగా మారింది. దానిచుట్టూ పట్టా భూములున్నవారు ఆర్టీసీ స్థలాన్ని కొంతమేర ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.

**తప్పుడు ధ్రువపత్రాలతో..** కోరుట్ల ఆర్టీసీకి మొత్తం 12.18 ఎకరాల స్థలం ఉండగా.. అందులో 9 ఎకరాల చుట్టూ మాత్రమే ప్రహరీ నిర్మించారు. మిగిలిన సుమారు మూడెకరాల స్థలం చుట్టూ ఎలాంటి గోడ, రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో దాని చుట్టుపక్కలవారు కొంతమేర స్థలాన్ని ఆక్రమించి పలు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. గతంలో రెండుసార్లు ఆక్రమించేందుకు స్థలాన్ని చదును చేయగా ఆర్టీసీ అధికారులు అడ్డుకున్నారు. ఇటీవల కొందరు ఆ స్థలం తమదేనని తప్పుడు ధ్రువపత్రాలను చూపి ఆక్రమణకు దిగారు.

**ఆరుగురిపై కేసు**

సుమారు ఎకరం స్థలంలో మట్టి పోసి చదును చేశారు. దాని చుట్టూ రాళ్లతో హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. తర్వాత దానిచుట్టూ గోడను నిర్మించే పనిని నాలుగు రోజుల క్రితం చేపట్టగా ఆర్టీసీ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో వారు ఆర్టీసీ అధికారులపై బెదిరింపులకు దిగారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సంఘటన స్థలానికి చేరుకొని ఇరువురి స్థల పత్రాలను పరిశీలించారు. సర్వేయర్ కొలతలో ఆర్టీసీకి చెందినదిగా నిర్ధారించారు. డీఎం ఫిర్యాదు మేరకు పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

**ఉన్నతాధికారులకు నివేదించాం**

స్థలం చుట్టూ ఎలాంటి హద్దులు, గోడలను నిర్మించకుండా ఆర్టీసీ నిర్లక్ష్యం చేయడంతోనే పలువురు ఆక్రమణలకు యత్నిస్తున్నారనే విమర్శలున్నాయి. దీనిపై కోరుట్ల డిపో మేనేజర్ మనోహర్‌ను వివరణ కోరగా.. స్థలం చుట్టూ రక్షణగా గోడ, కంచెను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

## పెద్ద పంచాయతీ.. పోరు రసవత్తరం

పెద్దపల్లి : పల్లెల్లో స్థానిక ఎన్నికల పోరు వేడెక్కుతోంది. పెద్ద పంచాయతీల్లో సమరం ఆసక్తి రేపుతోంది. ఆశావహులు బరిలో దిగేందుకు ఉత్సాహం చూపుతున్నారు. గ్రామ ప్రథమ పౌరుడి పీఠం దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు.

జిల్లాలో 263 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2011 జనాభా ఆధారంగా 8 గ్రామ పంచాయతీలు 5 వేలకంటేపైనే జనాభా కలిగి ఉండటంతో వీటిలో పోటీ తీవ్రత పెరిగింది. పుష్కలంగా ఆర్థిక వనరులు అందుబాటులో ఉండటంతో పెద్ద పంచాయతీల్లో పాగా వేసేందుకు రాజకీయ పార్టీలు పావులు కదుపుతున్నాయి.

పల్లెలకు అభివృద్ధి నిధుల కేటాయింపు జనాభా ప్రాతిపదికన పరిగణనలోకి తీసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్లెల ఆర్థిక వృద్ధి కోసం 14వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులను మంజూరు చేస్తున్నాయి. సీజనరేజ్, వినోద పన్ను, మినరల్ ట్రస్టు, స్టాంప్, వారసంతలు, ఆస్తులపై పన్నుల వసూళ్లు చేస్తున్నారు. ఇలా పలు రకాలుగా నిధుల రాబడి ఉంటుంది. ఎంత ఎక్కువ జనాభా ఉంటుందో అదే స్థాయిలో నిధులు సమకూరనున్నాయి. ఆయా నిధుల మంజూరుతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసే అవకాశం ఉంది. అభివృద్ధి నిధుల ఖర్చు చేస్తూ నాలుగు పైసలు వెనకేసుకునే అవకాశం ఉండటంతో మొగ్గు చూపుతున్నారు.

ధర్మారంలో 6,042, నందిమేడారంలో 6,235, జూలపల్లిలో 5,432, కమాన్‌పూర్ మండలం జూలపల్లిలో 6,303, కమాన్‌పూర్‌లో 7,401, రామగిరి మండలం పన్నూర్‌లో 9,326, ఓదెలలో 7,470, కాల్వశ్రీరాంపూర్‌లో 5,591 చొప్పున జనాభా ఉంది. కమాన్‌పూర్,



పన్నూర్ గ్రామపంచాయతీల పరిధిలో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయి. మిగిలిన గ్రామాల్లో వ్యవసాయం, వ్యాపార రంగాల్లో తనదైన ముద్ర చాటుతున్నాయి.

జూలపల్లి ఎస్సీ మహిళ, ఓదెల జనరల్, కమాన్‌పూర్ మండలం జూలపల్లి బీసీ మహిళ, కమాన్‌పూర్ జనరల్, పన్నూర్‌లో బీసీ జనరల్, కాల్వశ్రీరాంపూర్ జనరల్, నందిమేడారం బీసీ జనరల్, ధర్మారం బీసీ మహిళా రిజర్వేషన్ కేటాయించారు.

## సైకిల్ సవారీ.. పతకాల దారి

సిద్దిపేట : సరదా కోసం నేర్చుకున్న సైక్లింగ్ పతకాలు తెచ్చి పెడుతోంది. ఈ క్రీడలో ప్రతిభావంతులై రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. సిద్దిపేటలో ట్రాక్ (వెలోడ్రమ్) లేనప్పటికీ రంగనాయక్ సాగర్ కట్ట, కోమటిచెరువు బైపాస్ రోడ్డు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సాధన చేస్తూ పతకాల పంట పండిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీలకు సిద్దిపేట నుంచి 8 మంది ఎంపికయ్యారు. డిసెంబరులో పోటీలు జరుగుతాయి.

ఎంపికైనవారు: అండర్-18 విభాగంలో కావ్య, రవళి, అంకిత, శ్రీదేవి, మహిళా విభాగంలో ప్రియాంక

అండర్-16లో ఎం.లిఖిత, నవ్యశ్రీ, సాయిప్రసన్న



ఏటా 20కి పైగా పతకాలు: సంజీవ్, శిక్షకుడు

క్రీడాకారులు మరింత రాణించాలంటే సిద్దిపేటలో సైక్లింగ్ అకాడమీ, ట్రాక్ (వెలోడ్రమ్) ఎంతో అవసరం. ట్రాక్ లేనప్పటికీ ఏటా 20కి పైగా పతకాలు సాధిస్తున్నారు. అవసరమైన సైకిళ్లు ప్రభుత్వం అందిస్తే మరింతగా రాణిస్తారు.

**అక్క స్ఫూర్తితో..: ప్రియాంక**

ఆసిఫాబాద్‌లోని గిరిజన సంక్షేమ గురుకులంలో డిగ్రీ చదువుతున్నా. సిద్దిపేట సైక్లింగ్ అకాడమీలో శిక్షణ పొందిన. మాది వాంకిడి మండలం. అమ్మానాన్న యాదవరావు, శశికళ ఇద్దరు రైతులే. అక్క సోంబాయి కబడ్డీ క్రీడాకారిణి. ఆమె స్ఫూర్తితో క్రీడల వైపు దృష్టి పెట్టిన. రాష్ట్రస్థాయి మౌంటెన్ బైక్ పోటీల్లో టైమ్‌ట్రావెల్, మాస్టాట్ అంశాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించా.

**అమ్మానాన్నలు ప్రోత్సహించారు: అంకిత**

సిద్దిపేట హౌజింగ్ బోర్డు కాలనీలో అమ్మానాన్నలు పాక దాసు, మణితో కలిసి ఉంటున్నా. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతున్నా. అమ్మానాన్నలు ఆటలో చిన్నప్పటి నుంచి ప్రోత్సహిస్తున్నారు. 8వ తరగతి నుంచి ఖేలోఇండియా సైక్లింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్నా. చౌటుప్పల్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచాను. ఎస్జీఎఫ్‌లో రెండు కాంస్య పతకాలు పొందా.

## గాలి నాణ్యత..మనందరి బాధ్యత!

సిద్దిపేట: వాయు కాలుష్యం.. అనారోగ్యానికి కారణమవుతోంది. రోజురోజుకు పడిపోతున్న గాలి నాణ్యత.. అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకతను సూచిస్తోంది. సూక్ష్మ ధూళికణాలు పెరుగుతున్న తీరు మనల్ని హెచ్చరిస్తోంది. తాజా గణాంకాల ప్రకారం.. ఉమ్మడి మెదక్ జిల్లాలో సూక్ష్మధూళి కణాల తీవ్రత పటాన్‌చెరులో 84, సంగారెడ్డిలో 79 (ఘనపు మీటరు గాలిలో మైక్రోగ్రాములు) నమోదవడం గమనార్హం. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం, పర్యావరణ హితులు, సామాజిక సేవకులు నడుం బిగించాల్సిన అవసరం ఉంది. నేడు కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో పరిస్థితి, మార్పు వైపు అడుగేయాల్సిన తీరుపై కథనం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని పట్టణాల్లో ఒకప్పటితో పోలిస్తే జనాభా పెరిగింది. వివిధ రకాల ప్రగతి పనులు కొనసాగుతున్నాయి. పరిశ్రమల సంఖ్య పెరుగుతోంది. వివిధ రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఇదే క్రమంలో వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. సంగారెడ్డి జిల్లాలో 19, సిద్దిపేటలో 7, మెదక్‌లో 4 పారిశ్రామిక వాడలు ఉన్నాయి. కాలుష్యానికి ఇదో ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.

**దుమ్ము లేస్తోంది..**

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో అధ్వాన రహదారులు గాలి కాలుష్యానికి మరో కారణం. ప్రధాన కూడళ్లలో పరిస్థితి తీవ్రంగా ఉంటోంది. మట్టి, అసంపూర్తి దారులు.. దుమ్ము లేపుతున్నాయి. పట్టణాల్లో వాహనాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవమూ ప్రమాదకరంగా పరిణమిస్తోంది. తీవ్రతను వివరిస్తూ అప్రమత్తం చేసే వ్యవస్థ కరవవుతోంది. ః వ్యర్థాల నిర్వహణ విస్మరించి, ఇష్టానుసారంగా కాల్చేస్తున్నారు. ః పెరుగుతున్న వాహనాలు, కాలం చెల్లినవి అధికంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. వాహన ఉద్గారాల్లో నైట్రోజన్ ఆక్సైడ్లు, కార్బన్ మోనాక్సైడ్ వంటివి కాలుష్య కారకాలు.

**ర్యావరణాన్ని సంరక్షిస్తేనే..**

పర్యావరణ సమతుల్యం, జీవుల మనుగడలో పచ్చదనం ముఖ్యం. కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్ అందిస్తాయి. ఆరోగ్య పరిరక్షణకు, గాలిని శుద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. జిల్లాల్లో ఏటా భారీగా నాటుతున్నా పరిరక్షణ ఆశించిన మేర కొరవడుతోంది. సిద్దిపేటలో జరిమానా విధిస్తున్నా.. తిరిగి నాటించాల్సిన అంశాన్ని విస్మరిస్తున్నారు.

ఒక్క రోజయినా ఇలా చేద్దాం..

వారంలో ఒక్కరోజైనా వాహనాలు ఇంటికే పరిమితం చేద్దాం

సైకిల్, ఇతర ప్రత్యామ్నాయాలు వాడదాం.

పర్యావరణహిత ఈ-వాహనాల వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

## ఎన్నాళ్లీ అండర్‌పాస్ వెతలు..!

తూప్రాన్: దేశంలోనే అతిపెద్దదైన 44వ జాతీయ రహదారిలో నిత్యం లక్షలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఈ మార్గం జిల్లాలో 55 కి.మీ. మేర విస్తరించి ఉంది. మనోహరాబాద్ మండలం రామాయపల్లి వద్ద 44వ జాతీయ రహదారి అండర్‌పాస్‌లో ఏర్పడిన గుంతలతో వాహనదారులు అవస్థల మధ్య ప్రయాణం సాగిస్తుండటం గమనార్హం. ఐదేళ్ల కిందట..రామాయపల్లి మీదుగా మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే మార్గం వెళ్తుంది. రైలు వెళ్లినప్పుడల్లా ఇక్కడ వాహనాలు భారీగా నిలిచిపోతుండటంతో పై వంతెన నిర్మించాలని తలపెట్టారు. ఐదేళ్ల కిందట రూ.100 కోట్లకు పైగా నిధులతో దీని నిర్మాణ పనులను షురూ చేశారు. అంతకుముందే రెండు అండర్‌పాస్‌లు ఉన్నాయి.

ఒక వైపే పూర్తవగా..వంతెన నిర్మాణంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు పనులు పూర్తవడంతో వాహనదారులను ఆ మార్గంలో అనుమతించారు. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ మార్గంలో పూర్తికాలేదు. దీంతో అండర్‌పాస్‌లోనే వెళ్లాల్సిన పరిస్థితి. కి.మీ.కు పైగా ఉండే ఈ అండర్‌పాస్‌లో అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో చోదకులు నానాపాట్లు పడుతున్నారు. రాత్రివేళ గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.వర్షం పడితే అంతరాయం వర్షం కురిస్తే అండర్‌పాస్‌లో భారీగా నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వర్షాలతో గుంతలు ఏర్పడ్డాయి. పలుమార్లు వాటిల్లో వాహనాలు పడి పాడయ్యాయి. వర్షం పడితే నిలిచిన నీటిని తొలగించడానికి మోటార్లు ఉపయోగించాల్సిన పరిస్థితి ఉండేది. ఇటీవల కాలువలు నిర్మించడంతో ఆ బాధ తప్పింది.

# దుకాణ దందా.. ఆపేదుండా!!

విశాఖపట్నం : వైకాపా కార్పొరేటర్లకు ఆ నాయకుడు బంధువు. గత ప్రభుత్వంలో చెరువులో దర్జాగా అనధికారికంగా చేపలు పెంచి జేబులు నింపేసుకున్నాడు. మళ్లీ ఇప్పుడు 'కాసులిచ్చి దుకాణం పెట్టుకోండి. నేను చూసుకుంటా' అంటూ అక్రమార్జనకు పావులు కదిపాడు. జీవీఎంసీ ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ లంగ్స్' కార్యక్రమంలో భాగంగా తగరపువలసలోని ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారి సర్వీసు రహదారి పక్కన ఉన్న అనధికార దుకాణాలను తొలగించారు. అయితే వీటిలో కొన్ని సంగివలస కొండప్ప చెరువు గట్టు సమీపంలో ఎన్‌హెచ్ సర్వీసు రోడ్డు (676 లొకేషన్) పక్కనే రాత్రికి రాత్రే ఏర్పాటు చేశారు. ఎలాంటి సమస్య రాకుండా ఉండాలంటే ఒక్కో దుకాణానికి రూ. 30 వేలు వరకూ సదరు నాయకుడికి ఇస్తే చాలనే భరోసా ప్రచారంలో ఉంది. అంతే కాదు…ఆ నాయకుడు కూడా రెండు దుకాణాలు ఏర్పాటు చేశాడు.

**గుప్పిట్లో చెరువు:** సంగివలసలో కొండప్ప చెరువు 10 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఎలాంటి అనుమతుల్లేకుండా సదరు వైకాపా నాయకుడు గత ప్రభుత్వంలో చెరువులో చేపలు అక్రమంగా సాగు చేశాడు. ఏటా రూ.లక్షల్లో ఆదాయం జేబులో వేసుకున్నాడు. చేపల పెంపకం వల్ల నీరు దిగువకు వెళ్లే మార్గం మూసేశారు. వర్షాకాలం నీరు పోటెత్తి జాతీయ రహదారి సర్వీసు రోడ్డు నీట మునిగిపోయేది. మురుగు చెరువులో కలిసి ఆగిపోవడం, చేపలకు ఆహారంగా కోళ్ల



వ్యర్థాలు వేయడంతో దుర్వాసన వస్తుందనే ఫిర్యాదులు సైతం అందాయి. 'కూటమి' అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల తరువాతే చెరువులో చేపల సాగుకు అడ్డు కట్టపడింది.

**ఆ స్థలంపై కన్నేసి:** ఇక్కడి చెరువును దివీస్ ల్యాబ్స్ సీఎస్ఆర్ నిధులతో పార్కులా అభివృద్ధి చేశారు. గ్రీన్ బెల్ట్ కింద కొంత భాగం వదిలేశారు. ఈ స్థలంలోనే ప్రస్తుతం దుకాణాలు పుట్టగొడుగుల్లా ఏర్పాటవుతున్నాయి. వీటినిలా ఉంచేస్తే కాలువల్లో మురుగు ముందుకు వెళ్లక మళ్లీ సర్వీసు రోడ్డులో సమస్య తలెత్తుతుందని అధికారులకు కొందరు అర్జీలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్ అధికారులు స్పందించి క్రేన్, ఇతర యంత్రాలతో దుకాణాల తొలగింపునకు వెళ్లగా స్థానిక వైకాపా నాయకుడు అడ్డుకున్నారు. 'ఎన్‌హెచ్ స్థలం మూడు మీటర్లే ఉంది. రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో మేం మాట్లాడుకుంటాం' అంటూ వారిని వెనక్కి పంపినట్లు సమాచారం.

# జలజల.. గలగల

విజయనగరం: వ్యవసాయానికి ఊపిరిపోసే నీటి పారుదల రంగాన్ని గత వైకాపా ప్రభుత్వం నీరు గార్చింది. ఉమ్మడి జిల్లాలో అన్నదాతలకు కన్నీరు మిగిల్చింది. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాధాన్యతా క్రమంలో తక్షణం పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి రామానాయుడు, జలవనరుల శాఖ అధికారులతో ఇటీవల అమరావతిలో సమావేశమయ్యారు. నివేదికలు పరిశీలించి ఉమ్మడి జిల్లాలోని నాలుగు ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చారు. పనులు పరుగులు పెట్టించాలని అధికారులను ఆదేశించారు.

**తారకరామ**సాగు, తాగునీటికి ఉభయతారకంగా విజయనగరం జిల్లాలో తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 16,538 ఎకరాల నూతన ఆయకట్టుతో పాటు 8,172 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ఈ ప్రాజెక్టు లక్ష్యం. 44.40 శాతం పనులు పూర్తయ్యాయి. మూడు గ్రామాల్లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేస్తే ప్రధాన అడ్డంకి తొలగుతుంది. సుమారు రూ.800 కోట్లలో కొంతైనా వస్తే జూన్ 2027 నాటికి ప్రాజెక్ట్ పూర్తవుతుందని అధికారులు విన్నవించారు.

**తోటపల్లి** ఉమ్మడి జిల్లాలో తోటపల్లి ప్రాజెక్ట్ ప్రధానమైంది. మూడు



జిల్లాల్లో 1,31,221 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 64 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా పనులు ప్రారంభించి 85 శాతం పూర్తిచేశారు. మిగిలిన 15 శాతం పూర్తికి రూ.290 కోట్లు అవసరం. నిర్మాణాలకు రూ.120 కోట్లు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుకు రూ.170 కోట్లు ఇస్తే ఈ ప్రాజెక్ట్‌ను వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు నివేదించారు.

**జంఝావతి**

అంతర్రాష్ట్ర వివాదంలో చిక్కుకున్న జంఝావతి ప్రాజెక్టు పంట కాల్వల పనులు పూర్తికి రూ.59 కోట్లు ప్రభుత్వం విడుదల చేయాలి. తమ భూభాగానికి ముంపు వాటిల్లుతుందని ఒడిశా ప్రభుత్వం మోకాలడ్డింది. ప్రస్తుతం తొమ్మిది వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తున్నారు. మిగిలిన పనులకు రూ.59 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపారు. నిధులిస్తే జూన్ 2027 నాటికి పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు.

**నదుల అనుసంధానానికి..**

తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్ట్ కుడి ప్రధాన కాలువ ద్వారా నాగావళి నది నుంచి చంపావతి నదికి నీటిని మళ్లించే అనుసంధానం నిధులు రాక నిలిచిపోయింది. ఇది పూర్తయితే విజయనగర వాసుల తాగునీటి అవసరాలు తీరుతాయి. గడిగెడ్డ జలాశయం కింద 2,950 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందుతుంది. ప్రభుత్వం రూ.24.80 కోట్లకు ఆమోదించింది. ఇప్పటివరకు రూ.3.27 కోట్లతో 19.32 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన నిధులిస్తే వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు నివేదించారు.

**రూ.32 కోట్లు కోరాం**

ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. కనీస నిర్వహణ పనులకు రూ.32 కోట్లు అవసరమని కోరాం. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులిచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు. ఇందుకు ఒక కార్యాచరణ రూపొందించనున్నారు. త్వరలో దీనికి ఒక రూపు వస్తుందని ఆశిస్తున్నాం. స్వర్ణకుమార్, ఎస్ఈ, జలవనరుల శాఖ

# మున్సిపాలిటీ దిశ.. మారనున్న దశ



సత్యవేడు : ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా సత్యవేడు, వరదయ్యపాళెం పంచాయతీలకు మున్సిపాలిటీలుగా ఉన్నతీకరించేందుకు ప్రభుత్వం అడుగులు వేసింది. ఈ మేరకు ప్రజాభిప్రాయం, తీర్మానం చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంతో పట్టణ దశ, దిశ మారనుందని ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

గత సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాటి ప్రతిపక్షనేతగా సత్యవేడులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సత్యవేడు, వరదయ్యపాళెంలను మున్సిపాలిటీలుగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాదిన్నరలోనే ఇచ్చిన హామీని నెరవేర్చే క్రమంలో వాటికి మూడు కి.మీ. పరిధిలోని పంచాయతీలు సైతం విలీనం చేసి మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దడానికిగల సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

**విలీనం కానున్న పంచాయతీలివే**

సత్యవేడులో : వీఆర్‌కండ్రిగ, ఎన్ఆర్‌అగ్రహారం, కొత్తమారికుప్పం, కాళమనాయుడుపేట, మదనంబేడు పంచాయతీలు

వరదయ్యపాళెంలో: ఇందిరానగర్, సీఎల్‌ఎన్‌పల్లి, కడూరు, కాంబాక్కం, కురుంజలం, అరుదూరు, కంచరపాళెం పంచాయతీలు

**కార్యదర్శులకు నోటీసులు**

సత్యవేడు మండలంలోని ఆరు పంచాయతీలు, వరదయ్యపాళెం మండలంలోని ఎనిమిది పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఉన్నతీకరించేందుకు ప్రజాభిప్రాయం ద్వారా ఆయా పంచాయతీల నుంచి తీర్మానం చేసి నివేదించాల్సిందిగా నెలరోజుల కిందట కలెక్టరు నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గడువు ముగిసినా కార్యదర్శులు తీర్మానం పంపకపోవడంతో వివరణ కోరుతూ ఆయా పంచాయతీ కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి నుంచి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.

**మెజారిటీ ఆమోదం.. కొందరికి రాజకీయ ఖేదం**

తమ పంచాయతీలు మున్సిపాలిటీ పరిధిలోకి వస్తే మౌలిక వసతులు సమకూరి అభివృద్ధి చెందుతాయని పలువురు సర్పంచులు, నాయకులు ఆమోదం తెలుపుతుండగా పంచాయతీలో తమ రాజకీయ ప్రాబల్యం తగ్గిపోతుందనే కారణంగా మరికొందరు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. తాము మండల కేంద్రానికి మూడు కి.మీ. దూరంపైగా ఉన్నందున తమకు ఆమోదయోగ్యం కాదని వరదయ్యపాళెం మండలం కంచరపాళెం, కురుంజలం పంచాయతీలు అంగీకరించలేదు. వరదయ్యపాళెం పక్కనే ప్రభుత్వ కార్యాలయాలన్నీ కొలువైన ఇందిరానగర్ సైతం తమకు అంగీకారం కాదని ఓ విపక్ష రాజకీయ నాయకుడు, స్థానిక ప్రజాప్రతినిధి వ్యతిరేకించినట్లు సమాచారం.

# పురుగే.. వణికిస్తోంది



చిత్తూరు : ఉమ్మడి జిల్లాను కొత్త వ్యాధి హడలెత్తిస్తోంది. అది చిన్న కీటకమే అయినా జ్వరాలతో జనాలను ఆసుపత్రులకు పరుగులు పెట్టిస్తోంది. స్క్రబ్ టైఫస్ అనే జ్వరం చాపకింద నీరులా వ్యాపిస్తోంది. అప్రమత్తమై చికిత్స చేయించుకుంటే ప్రమాదం లేదని వైద్యులు చెబుతున్నారు.

**లక్షణాలు**

కీటకం కుట్టిన వెంటనే బ్యాక్టీరియా శరీరంలోకి వెళ్తుంది.

పది రోజుల్లో జ్వరం వస్తుంది. తలనొప్పి తీవ్రంగా ఉంటుంది.

నిర్లక్ష్యం చేస్తే శరీరమంతా నల్లమచ్చలు ఏర్పడతాయి.

మెదడు, ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది.

వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 145 కేసులు నమోదయ్యాయి. పొరుగు రాష్ట్రాల్లో ఉంటున్న 234 మంది జిల్లా వాసుల్లో ఇది వెలుగు చూసింది. మొత్తంగా 379 కేసులు నమోదైనట్లు చెబుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే కేసులను కలుపుకొంటే ఈ సంఖ్య రెట్టింపు ఉంటుందని అంచనా. తిరుపతి జిల్లాలో 17 కేసులు నమోదయ్యాయి.

**ఎలా వస్తుంది..?**

బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ ఉన్న చిగ్గర్‌మైట్ అనే నల్లిని పోలిన కీటకం కుడితే ఈ జ్వరం వస్తుంది.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..

పాత మంచాలు, పరుపులు, దిండ్లను వారానికి ఒకసారైనా శుభ్రం చేసుకోవాలి.

కాళ్లు, చేతులు కప్పి ఉండేలా దుస్తులు వేసుకోవాలి

తడి నేలలు, పొలాలు, గడ్డివాములు, పశువుల పాకల్లో, వ్యర్థాలుండే చోట ఈ పురుగు ఉండే ప్రమాదం ఉంది. జాగ్రత్తలు తీసుకోవాలి.

**పట్టించుకోని అధికారులు**

ఈ జ్వరాల కేసులు పెరుగుతున్నా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. పైగా ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదయ్యే కేసులు, అనుమానిత కేసులను పరిగణనలోకి తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**చికిత్సతో నయం చేయొచ్చు**– గౌరీప్రియ, ఫిజీషియన్, చిత్తూరు

జ్వరం తగ్గకుండా ఉంటే.. శరీరంపై మచ్చలేవైనా ఉంటే పరీక్షలు చేసుకోవాలి. వ్యాధి నిర్ధారణ అయితే వాటికి తగ్గ చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చు.

# పగలు తవ్వకాలు.. రాత్రుళ్లు పంపకాలు



అనకాపల్లి : జిల్లాలో ఇసుకాసురులు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రకృతి వనరులను దోచేస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఇటీవల మొంథా తుపాను ధాటికి జిల్లా పరిధిలోని శారదా నది ఉప్పొంగి ప్రవహించింది. చాలాప్రాంతాల్లో ఇసుక మేటలు చేరాయి. వీటిని కొల్లగొట్టేందుకు ఎక్కడికక్కడ పోటీపడుతున్నారు. జిల్లా కలెక్టరే స్వయంగా కన్నెర్ర చేసినా కానీ.. దందాకు అడ్డుకట్ట పడటం లేదు.

దేవరాపల్లి మండలం చింతలపూడి, సమ్మెద, తామరబ్బ, దేవరాపల్లి, వెంకటరాజపురం, మారేపల్లి, తిమిరాం, కలిగొట్ల, బోయిలకింతాడ నదీ పరివాహక గ్రామాలు. ఇక్కడ యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. దీంతో దేవరాపల్లి, తెనుగుపూడి, తారువ, కలిగొట్ల, గవరవరం వంతెనలకు ముప్పు వాటిల్లుతోంది.

మాడుగుల మండలం సత్యవరం, సాగరం, గొట్టివాడ అగ్రహారం, వీరవెల్లి అగ్రహారంలో ఇసుక తవ్వకాలు నిత్యకృత్యం. నది నుంచి ఒడ్డుకు ఎడ్లబళ్లతో.. అక్కడ నుంచి ట్రాక్టర్లు, లారీలతో తరలిస్తున్నారు. అధికంగా రావికమతం, పాడేరు ఏజెన్సీ ప్రాంతానికి తరలిస్తూ దూరాన్ని బట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

శారదా నదిలో ఇసుక తవ్వకాలకు దేవరాపల్లి మండలంలోని ఓ గ్రామంలో కొన్నాళ్ల క్రితం వేలంపాట నిర్వహించారు. భారీ స్థాయిలో ఈ బహిరంగ వేలంలో పాల్గొని.. రూ. 30 లక్షలకు పాటపాడారు. ఇక్కడ నుంచే శృంగవరపుకోట, వేపగుంట ప్రాంతాలకు రాత్రి వేళల్లో తరలించేస్తున్నారు.

**అధికారులంతా గప్‌చుప్..**

జిల్లాలోని నది పరివాహక ప్రాంతాలవైపు అధికార యంత్రాంగం కనీసం కన్నెత్తి చూడటంలేదు. అక్రమార్కులు కూడా కొత్త పంథాకు తెరలేపారు. అర్ధరాత్రి వేళ ఒకేసారి పెద్దసంఖ్యలో లారీలతో రవాణా చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం దేవరాపల్లిలో ఇసుక అక్రమ రవాణా అధికంగా జరుగుతోందని తెలిసి.. కలెక్టరే నేరుగా ప్రతి గ్రామంలో నలుగురితో ఓ కమిటీ ఏర్పాటు చేశారు. వీరు గ్రామాల్లో ఇసుక పక్కదారి పట్టకుండా చూడాలి. కానీ.. క్షేత్రస్థాయిలో అలా జరగడం లేదు. ఇప్పటికి ఒక్క ట్రాక్టర్‌ను కూడా అడ్డుకోలేదు.

**కేసులు నమోదు చేస్తాం**

మాడుగుల, దేవరాపల్లి మండలాల్లో ఇసుక పక్కదారి పడుతున్నట్టు తెలిసింది. వాటిని కట్టడి చేసేందుకు నది పరివాహక గ్రామాల్లో కమిటీలు వేశాం. పోలీసులు సాయంతో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. అక్రమ నిల్వలు స్వాధీనం చేసుకుంటున్నాం. దారిలో కందకాలు తవ్వి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నాం. అప్పటికీ నిబంధనలు పాటించకపోతే.. చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం.

శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, అనకాపల్లి

# మాస్టార్లు ఎప్పుడొస్తారు?

విజయనగరం : జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయాన్ని బోధకుల కొరత వేధిస్తోంది. ఇక్కడ నియమితులైన వారిలో 15 మంది విభజనకు ముందు జేఎన్‌టీయూ కాకినాడ, నరసారావుపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లి, తర్వాత ఐచ్ఛికం ఇచ్చి అక్కడే ఉండిపోయారు. వారంతా వెనక్కివస్తే కాని కొరత తీరే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ఒప్పంద, అవర్లీ బేస్డ్ వారితో బోధన సాగిస్తున్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమవుతోంది.

బోధకుల విషయమై జేఎన్‌టీయూ కాకినాడ, గురజాడ మధ్య నాలుగేళ్లుగా వివాదం నలుగుతోంది. ఎవరెక్కడ? అన్నదానిపై స్పష్టత కొరవడడమే దీనికి కారణంగా పేర్కొంటున్నారు. తాజాగా ఈ విషయమై గవర్నర్ దృష్టికి వెళ్లడంతో ఫ్యాకల్టీ అంతర్గత పదోన్నతులకు సంబంధించిన కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్(సీఏఎస్) తాత్కాలికంగా నిలిపివేయడంతో విషయం తెరపైకి వచ్చింది.

**శాసన మండలిలో ప్రస్తావన**

డిప్యుటేషన్‌పై వెళ్లిన వారిని వెనక్కి పంపించాలని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం అధికారులు గతంలో ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రజాప్రతినిధులకు వినతులు అందజేశారు. నాటి ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ సమస్యను అప్పట్లో మండలిలో ప్రస్తావించారు. ఎవరు ఎక్కడ వారన్న దానిపై స్పష్టత వస్తే కాని భవిష్యత్తులో నియామకాలు, పదోన్నతులు కష్టమని అధికారులు పేర్కొంటున్నారు. సమస్యపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జేఎన్‌టీయూ గురజాడ




విద్యాలయం ఉప కులపతి వి.వి.సుబ్బారావు తెలిపారు.

**ఇదీ ప్రస్తుత పరిస్థితి**

ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం యూజీ, పీజీ ప్రోగ్రాంలకు వందమంది అధ్యాపకులు ఉండాలి. ప్రస్తుతం యూజీలో 72 మందికి 27 మంది రెగ్యులర్ అధ్యాపకులున్నారు. మిగిలిన వారంతా ఒప్పంద విధానంలో ఉన్నవారే. పీజీలో 28 మందికి అందరూ ఒప్పంద విధానంలోనే పనిచేస్తున్నారు.

యూజీ సివిల్ బ్రాంచిలో అసలు రెగ్యులర్ ఫ్యాకల్టీయే లేరు. ఈసీఈ మినహా మిగిలిన విభాగాలకు ఇద్దరు ముగ్గురే రెగ్యులర్ వారున్నారు. అధ్యాపకుల కొరతతో న్యాక్, ఎన్‌బీఏ గుర్తింపునకు వర్సిటీ దూరమవుతోంది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో విశ్వవిద్యాలయానికి చోటు లభించని పరిస్థితి ఉంది.

గతంలో మెకానికల్, ఈసీఈ, సీఎస్సీ బ్రాంచిలకు ఎన్‌బీఏ(నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్) గుర్తింపు ఉండేది. ఇప్పుడది ఈసీఈ, సీఎస్సీ బ్రాంచిలకే పరిమితమైంది.

ప్రాంగణ నియామకాలు ఒకప్పటి కంటే తగ్గుముఖం పట్టాయి. 2021-22లో 265, 2022-23లో 174, 2023-24లో 120, 2024-25 64 మందికి అవకాశాలు లభించాయి.

# మెరుగైన వైద్యసేవలకు ముందడుగు

శృంగవరపుకోట: ఎస్.కోట పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువకానున్నాయి. ప్రాంతీయాసుపత్రికి నాబార్డు నిధులు రూ.12.60 కోట్లతో చేపట్టిన కొత్త భవనాల నిర్మాణం దాదాపు పూర్తి కావడంతో రోగులకు అదనపు సౌకర్యాలు కలగనున్నాయి. ఇన్నాళ్లూ భవనాలు చాలక పలు యూనిట్లు మంజూరైనా ఏర్పాటు కాలేదు. ఓపీ చూసేందుకూ వీల్లేక ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు సేవలు అందిస్తున్నారు. పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు నేలపైనే కూర్చోవాల్సిన పరిస్థితి. భవనాలు ఈ నెలలో ప్రారంభమైతే.. సమస్యలు తొలగడంతోపాటు కొత్తగా రక్తనిధి కేంద్రం, డయాలసిస్ సదుపాయం, ఆడియాలజీ, ఎక్స్‌రే విభాగం అందుబాటులోకి రానున్నాయని ఆసుపత్రివర్గాలు చెబుతున్నాయి.

**రోజుకు 15 మందికి డయాలసిస్**

ఆసుపత్రికి డయాలసిస్ కేంద్రం మంజూరైంది. పీఎం నేషనల్ డయాలసిస్ కార్యక్రమంలో భాగంగా మంజూరైన ఈ కేంద్రం ద్వారా రోజుకు మూడు సెషన్ల ద్వారా 15 మందికి రక్తశుద్ధి సదుపాయం కలుగుతుంది. ఇందుకోసం రూ.75 లక్షల విలువైన రక్త శుద్ధి యంత్రాలు, పరికరాలు సమకూర్చుతున్నారు. ప్రస్తుతం కిడ్నీ వ్యాధి బాధితులు డయాలసిస్ కోసం వ్యయప్రయాసలకు ఓర్చి విజయనగరం లేదా విశాఖ వెళ్తున్నారు.



**ఆడియాలజీ గది మంజూరు**

ఆసుపత్రికి ఆడియాలజీ గది మంజూరైంది. వినికిడి సంబంధిత రోగులు పరీక్షలు చేయించుకోవడానికి, సదరం ధ్రువపత్రాల జారీకి ఆడియాలజీ గది ఎంతో అవసరం. రూ.6.42 లక్షలతో ఈ గది నిర్మించారు.

**రక్తనిధి కేంద్రం ఏర్పాటు**

ఆసుపత్రిలో రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు 17 రకాల పరికరాల కోసం రూ.18.53 లక్షలు కేటాయించారు.

**ఎక్స్‌రే యూనిట్, ఫ్రీజర్ ఏర్పాటు**

ఆసుపత్రికి 300ఎంఏ ఎక్స్‌రే యూనిట్ మంజూరైనా స్థలం లేక ఏర్పాటు చేయలేదు. 100ఎంఏ ఎక్స్‌రే యూనిట్‌తో లాంబాస్ పెయిన్(నడుం నొప్పి) వంటివి తీయడానికి వీలుపడడం లేదు.

**ఈ నెలలోనే అందుబాటులోకి..: ఎన్.భారతి, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ**

ప్రాంతీయ ఆసుపత్రి భవనాల నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. ఈ నెలలో అందుబాటులోకి తీసుకొచ్చి, సేవలు అందిస్తాం.

# సొంతింటి కల సాకారం దిశగా!



అనంతపురం : సొంతిళ్లు నిర్మాణం కోసం పేదల నుంచి భారీగా డిమాండ్ కని స్తోంది. గత వైకాపా హయాంలో ఊర్లకు ఊళ్లు నిర్మించామంటూ ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొంతిల్లు, స్థలం కావాల్సిన వారు, సొంత స్థలం ఉండి ఇళ్లు కావాల్సిన వారి వివరాలను క్రోడీకరిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ ఇళ్లు కావాలంటూ పేదలు కోరుతున్నారు. నిజంగా వైకాపా హయాంలో పేదలు అందరికీ ఇళ్లు నిర్మించి ఉంటే ఇంత డిమాండ్ ఏర్పడేది కాదని స్పష్టం అవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటి నిర్మాణాలకు పలు వెసులుబాట్లు కల్పించడంతో ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నట్లు స్పష్టం అవుతోంది.

**సాగని ఇంటింటా సర్వే!**

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇళ్లు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ప్రత్యేకంగా ఆవాస్ యాప్‌ను తీసుకొచ్చి నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఎవరికి అవసరమో వారి వివరాలను ముఖ ఆధారిత, వేలి ముద్రలు ద్వారా వివరాలు యాప్‌లో అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పలు గ్రామాల్లోని ఇంజినీరింగ్ సహాయకులు సచివాలయాలకు వచ్చిన వారికి మాత్రమే ముఖ ఆధారిత వివరాలు నమోదు చేస్తున్నారు. సొంత స్థలం ఉంటే స్థలంతోపాటు లబ్ధిదారుల వివరాలను స్థలం ఉన్న ప్రదేశంలోనే చేయాల్సి ఉండటంతో వెళుతున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేస్తే ఇంకొంత మంది పేదలకు సొంతిళ్లు సాకారం అయ్యే అవకాశం ఉంటుంది. గత నెల 30 నాటికి గడువు ముగిసినా ఇంకొంత మందికి లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో ఈనెల 14 వరకు గడువు పొడిగించారు. **సద్వినియోగం చేసుకోవాలి**

సచివాలయం సిబ్బంది కచ్చితంగా ఇంటింటా సర్వే చేసి వివరాలు అనుసంధానం చేయాలి. ఈనెల 14 వరకు గడువు పొడిగించారు. ఆలోపు ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉంటే సంబంధిత సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

శైలజ, గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు అధికారిణి

నియోజకవర్గం- దరఖాస్తుదారులు

కళ్యాణదుర్గం 12,210
రాయదుర్గం 9,142
ఉరవకొండ 9,468
రాప్తాడు 9,319
శింగనమల 6,920
తాడిపత్రి 6,308
గుంతకల్లు 5,038

# ఖనిజ సంపద దోపిడీ



పెద్దవడుగూరు : ఆ ప్రాంతంలో ఏ భూముల్లో చూసినా విలువైన భూగర్భ ఖనిజాలు ఉంటాయి. దీంతో సదరు భూముల ధరకు రెక్కలొచ్చాయి. ఎకరం రూ.అరకోటి పైమాటే. ఉమ్మడి అనంత జిల్లాలో అత్యధికంగా పెద్దవడుగూరు మండలం కొండుపల్లి, క్రిష్టిపాడు గ్రామాల పరిధిలో సుమారు 36 భూగర్భగనులు ఉన్నాయి. కొందరికి మాత్రమే అనుమతులు ఉండగా మరికొందరు అడ్డగోలుగా భూగర్భగనుల్లో తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా భూములకు విలువ పెరుగుతూ వస్తోంది. మరోవైపు రాజస్థాన్‌లో భూగర్భగనులు బంద్ కావడంతో ప్రస్తుతం ఇక్కడి వాటికి డిమాండ్ పెరిగింది. అక్రమార్జనే ధ్యేయంగా తవ్వకాలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. రోజూ వేల టన్నుల ఖనిజం తరలిపోతున్నా అటవీ, రెవెన్యూ, గనుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. రెండు గ్రామాల పరిధిలోని భూగర్భంలో స్టియటైట్, డోలమైట్, సున్నపురాయి ఉన్నాయి. ఇందులో స్టియటైట్‌కు మంచి గిరాకీ ఉంది. దీంతో తవ్వకాలు జరిపి.. జేబులు నింపుకోవడానికి అక్రమార్కులు పోటీ పడుతున్నారు.

**రహదారుల కింద సైతం..**కొండుపల్లి సమీపంలో అటవీ భూములు వందలాది ఎకరాల్లో ఉన్నాయి. సర్వే నంబరు 302-ఎలో 267.69 ఎకరాలు.. 1007 సర్వేనంబరులో 715.30 ఎకరాలతోపాటు కొండలు విస్తరించి ఉన్నాయి. అనుమతి గనుల పక్కనే ఉన్న అటవీభూముల వైపు తవ్వకాలు జరిపి విలువైన ఖనిజ సంపదను దోచుకుంటున్నారు. ఇదిలా ఉండగా గ్రామాలకు వెళ్లే రహదారుల కింది భాగంలో తవ్వకాలు జరిపి అక్రమార్జనకు తెరలేపారు. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే ఎప్పుడు కుంగిపోతాయోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండుపల్లి, క్రిష్టిపాడు ప్రాంతాల్లో 16 గనులకే అనుమతులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇటీవల అధికారులు తూతూమంత్రంగా దాడులు చేసి వెళ్లారు. తిరిగి అక్రమార్కులు తవ్వకాలు సాగిస్తూ ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారు.

**పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం**

కొండుపల్లి ప్రాంతంలోని అటవీభూముల్లో కొందరు భూగర్భంలో తవ్వకాలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తవ్వకాలు జరిపిన వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.నారపరెడ్డి, అటవీశాఖ సెక్షన్ అధికారి, గుత్తి

# భావితరాల భాండాగారం



తిరుపతి : ముక్తిని ప్రసాదించే తిరుపతి పుణ్యక్షేత్రం అతి పురాతన తాళపత్ర గ్రంథాలను తనలో దాచుకుంది.. వేద, ఉపనిషత్తులను సంరక్షిస్తూ భావితరాలకు అందిస్తోంది. అందుకు వేదికగా నిలుస్తోంది శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్ఐ).

**పునర్ ముద్రణలు**

అముద్రిత గ్రంథాలను పరిష్కరించి వెలుగులోకి తేవడమే కాకుండా, ఎప్పుడో ముద్రించినా ఇప్పుడు అందుబాటులో లేని వాటిని తితిదే సహకారంతో పునర్ ముద్రిస్తోంది.

**బీజం ఇలా..**

నాటి మద్రాసు ముఖ్యమంత్రి పానగల్ రాజు ఆలోచనతో 1937లో తిరుపతిలో శ్రీవేంకటేశ్వర ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్‌కు బీజం పడింది. ఈ సంస్థ నాటి డైరెక్టర్ రంగస్వామి అయ్యంగార్ దేశం నలుమూలలకు పండితులను పంపి సంస్కృతం, తెలుగు, తమిళ భాషలకు చెందిన 10 వేలకు పైగా రాత ప్రతులు, 20 వేలకు పైగా ముద్రిత గ్రంథాలను సమీకరించారు. సంస్థను 1956లో ఎస్వీయూలో విలీనం చేసి ప్రాచ్య పరిశోధన సంస్థ (ఓఆర్ఐ)గా పేరు మార్చారు.

**పరిశోధన:** పీహెచ్‌డీ, ఎంఫిల్ డిగ్రీల కోసం అముద్రిత గ్రంథాలను వీలైనంత వరకు పరిశోధనాంశాలుగా ఇస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 94 పీహెచ్‌డీలు, అనేక ఎంఫిల్ డిగ్రీలు వచ్చాయి.

**గ్రంథాలయాల్లోనూ..**ఇక్కడి గ్రంథాలయాల్లో గజవైద్యము, గణితశాస్త్రము, గారడీ విద్య, వాస్తుసారము, శకునశాస్త్ర గ్రంథాలు, రామాయణ, మహాభారత, కావ్య, ప్రబంధ, శాస్త్రాలకు సంబంధించిన మొదటి ముద్రణ గ్రంథాలున్నాయి.

**గ్రంథ పరిష్కారం.. సంరక్షణ**

భారతీయ సంస్కృతిని తెలిపే తాళపత్రాలు, రాతప్రతులు, అమూల్య గ్రంథాలను పరిష్కరించి సంరక్షించడంతో పాటు భావితరాలకు అందించేందుకు డిజిటలైజ్ చేస్తున్నారు.

వీటిని వెబ్‌సైట్: %www. svuori.com%లో అందుబాటులో ఉంచుతోంది.

# సంక్షేమ 'అవస్థల' గృహాలు

చిత్తూరు : వైకాపా హయాంలో సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు తిష్ట వేశాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన పేద విద్యార్థులు చలికి వణుకుతున్నా కార్పెట్లు, దుప్పట్లు ఇవ్వలేదు. జడివానతో గదుల్లోకి వర్షపు నీరు వచ్చినా కిటికీలకు మరమ్మతులు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసారి కుప్పంలో పర్యటించినప్పుడే ఉమ్మడి జిల్లాలోని వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కొన్ని పనులు చేసినా మరికొన్ని సమస్యలు అలానే ఉన్నాయి. అద్దెభవనాల్లో ఇరుకు గదులు, నీటిశుద్ధి యంత్రాలు లేక విద్యార్థులు బయటి నుంచి తెచ్చుకుంటున్నారు. అక్కడక్కడా కిటికీలు దెబ్బతిన్నాయి. మెస్‌లు చిరిగిపోయాయి. ఏడాదిన్నర వ్యవధిలో సాంఘిక సంక్షేమ వసతిగృహాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. బీసీ హాస్టళ్లపైనా కొంత ఖర్చు పెట్టినా ఆ మొత్తం సరిపోలేదు. ఆర్వో ప్లాంట్లు లేక కొందరు వార్డెన్లు బయటి నుంచి నీరు తెప్పిస్తున్నారు. పలమనేరు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో బోరు నీళ్లే దిక్కవుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం నిధులిచ్చినా పది శాతం హాస్టళ్లలోనే ఇవి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**రెండు జిల్లాల్లో రూ.20.97 కోట్ల ఖర్చు**



జగన్ పాలనలో సంక్షేమ వసతిగృహాల్లోనూ నాడు- నేడు కింద వసతులు కల్పిస్తామని చెప్పినా ఆచరణలోకి రాలేదు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రెండు జిల్లాల్లో రూ.20.97 కోట్లు ఖర్చు చేశారు. నెల రోజుల క్రితమే కార్పెట్లు, దుప్పట్లు ఇచ్చారు. ఈ ఏడాది మరో రూ.14 కోట్ల వ్యయంతో పనులకు ప్రతిపాదనలు రూపొందించారు. వీటిని వేగవంతం చేస్తే మిగతా సమస్యలూ తీరతాయి.

**శిథిలావస్థలో భవనాలు**

శ్రీకాళహస్తి, పూతలపట్టు, నగరి, కుప్పం నియోజకవర్గాల్లోని సంక్షేమ వసతిగృహాలు శిథిలావస్థకు చేరాయి. నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. దీంతో విద్యార్థులు ఇరుకు గదుల్లో అవస్థలు పడుతున్నారు. కుప్పం బీసీ సంక్షేమ వసతిగృహంలో పెచ్చులూడుతుండటంతో ఇటీవల 23 మందిని సాంఘిక సంక్షేమ హాస్టల్‌కు మార్చారు. ఇప్పుడు 5 గదుల్లో 68 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇక్కడ కిటికీలు దెబ్బతిన్నాయి.

# మేఘాల నడుమ.. కొండల మధ్య

అరకులోయ : పర్యాటక సీజన్ ఆరంభంతో సందర్శనీయ ప్రదేశాలు కళకళలాడుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. పర్యాటకుల వసతి కోసం ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రత్యేక ప్యాకేజీలు నిర్వహిస్తోంది. విశాఖతో పాటు అరకు, అనంతగిరి, లంబసింగిలో విలాసవంత సౌకర్యాలతో అందుబాటు ధరల్లో పర్యాటకులకు గదులు సిద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా లోయలను ఆనుకొని కొండల మధ్య ప్రశాంత వాతావరణం అందరిని ఆకట్టుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

**ప్రత్యేక ప్యాకేజీలతో:** పర్యాటకుల కోసం ఏపీటీడీసీ వసతులను సిద్ధం



చేసింది. గదుల వద్ద క్యాంప్‌ఫైర్, థింసా నృత్యం ఉంటాయి. బృందాలుగా, కుటుంబ సభ్యులతో వచ్చే వారికి ప్రత్యేక ప్యాకేజీలున్నాయి. బొంగు చికెన్, నాటు కోడి రుచులు అందిస్తాం' అని ఏపీటీడీసీ డీవీఎం జగదీష్ పేర్కొన్నారు.

**అద్భుతం.. అనంతగిరి:** ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థకు అనంతగిరి హిల్ రిసార్ట్ ఎంతో ప్రత్యేకం. కొండ వాలుకు ఆనుకొని ప్రత్యేకంగా నిర్మించిన రిసార్టు ఎంతగానో అలరిస్తుంది. ఏసీ సూట్ గదుల నుంచి చూస్తే ప్రకృతి అందాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి.

**లంబ సింగిలో:** లంబసింగిలోని హరితా రిసార్టు పచ్చని కొండల నడుమ అలరిస్తుంది. తెల్లవారుజాము పొగమంచు, చల్లటి వాతావరణంతో సందర్శకులను మైమరపిస్తుంది. ఇక్కడి గదులు రూ.4 వేల నుంచి అందుబాటులో ఉన్నాయి.

# కదిలేనా.... కలగానే మిగిలేనా

అచ్యుతాపురం : పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ప్రజాభిప్రాయ సేకరణకే పరిమితమైంది. గత వైకాపా ప్రభుత్వం హార్బర్ ఏర్పాటుపై రెండేళ్లపాటు హడావుడి చేసి ఎన్నికల ముందు గాలికొదిలేసింది. ఫలితంగా మత్స్యకారులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

20 వేల జనాభాగల పూడిమడక రాష్ట్రంలోనే అతిపెద్ద మత్స్యకార గ్రామం. విశాఖపట్నం హార్బర్ తరవాత అతి ఎక్కువగా చేపలవేట సాగించేది ఇక్కడే. గ్రామంలోని 90 శాతం మందికి ఇదే జీవనాధారం. వైకాపా ప్రభుత్వం ఇక్కడ ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని ప్రకటించింది. దీనికి గ్రామంలోని సర్వే నం. 139లో ప్రాజెక్టుకు అవసరమైన భూమిని గుర్తించింది. 2020 డిసెంబర్ 31న ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. మత్స్యకారులంతా పార్టీలకు అతీతంగా ప్రాజెక్టును ఆహ్వానిస్తూ మాట్లాడారు. రోజూ చేపల వేటకు బోట్లను మోసుకుంటూ వెళ్తుండడం చాలా కష్టంగా ఉంటోందని, హార్బర్ నిర్మాణం పూర్తయితే ఈ కష్టాలు తీరిపోతాయని ఆశించారు. నిర్మాణానికి రూ.350కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతి ఇచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్మాణానికి టెండర్లు పిలవకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో మత్స్యకారుల ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు ఆదిలోనే అటకెక్కినట్లయింది.

మత్స్యకారుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ కూటమి ప్రభుత్వం పూడిమడక ఫిషింగ్ హార్బర్ నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టుపై సాంకేతిక నిపుణులతో ప్రత్యేకంగా అధ్యయనం చేయించింది. నూతన సాంకేతికత వినియోగించి తక్కువ వ్యయంతో తక్కువ సమయంలో ప్రాజెక్టు పూర్తయ్యేలా నివేదిక అందివ్వాలని కోరింది. దీంతో నిపుణులు వచ్చి ప్రాజెక్టుపై విచారణ చేసినా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. పూడిమడకలో తీరం తరచూ కోతకు గురవుతుండటం, కెరటాల తాకిడికి పడవలు, వలలు దెబ్బతినడం మత్స్యకారులు ఎన్నెన్నో ఇబ్బందులు పడుతున్నారు.

పూడిమడక జనాభా : సుమారు 20 వేలు
బోట్లు : 600 వరకు
హార్బర్‌కు ఎంపిక చేసిన భూమి : 37 ఎకరాలు
ప్రతిపాదిత వ్యయం : రూ. 350 కోట్లు

# కాపరు వైరు.. స్వాహా

చిత్తూరు : విద్యుత్తు సరఫరా సంస్థల్లో ఒకటైన ఏపీ ట్రాన్స్‌కో దోపిడీకి వేదికగా మారింది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో చిత్తూరు డివిజన్ ముందున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ డివిజన్ అధికారి చెప్పిందే వేదమని, ఆయన కనుసన్నల్లోనే అన్నీ జరుగుతున్నాయని, ఇప్పుడు ట్రెంచ్‌లైన్‌లోని కాపర్ వైరును దిగమింగినట్లు సిబ్బంది ఆరోపిస్తున్నారు. చిత్తూరు గిరింపేటలో 220 కేవీ ఉపకేంద్రం 50-60 ఏళ్ల కిందట నిర్మించారు. ఇక్కడి నుంచే ఐరాల, పాకాల, నూనెగుండ్లపల్లెల్లోని 132 కేవీ ఉప కేంద్రాలకు విద్యుత్తు సరఫరా అవుతోంది. సరఫరా ఆన్-ఆఫ్‌కు ఏపీసీబీ బ్రేకర్ వినియోగించేవారు. ఇందుకు ప్రత్యేకంగా ట్రెంచ్ కాపర్ లూప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఇలా ఏడు వరుసల్లో సుమారు మూడువేల మీటర్లు ఉంటుందని చెబుతున్నారు. తదనంతరం ఆటోమెటిక్ బ్రేకర్లు రావడంతో వాటి అవసరం లేకుండా పోయింది.



**దండుకుందిలా..**

ఉపకేంద్రం ప్రాంగణంలో ట్రెంచ్ కాపర్‌రాడ్ లూప్‌లైన్ కనబడకుండా పైభాగంలో పలకలు అమర్చారు. ఇటీవల ఉపకేంద్రం నుంచి కాపర్‌రాడ్డును రాత్రి వేళ పక్కదారి పట్టించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు ఒప్పంద ఉద్యోగులను పురమాయించినట్లు సమాచారం. ఇలా 3-4 టన్నుల కాపర్ స్వాహా చేసినట్లు తెలిసింది. గతేడాది డివిజన్ పరిధిలోని ఉపకేంద్రాల్లో 20 ఏళ్లుగా నిల్వఉన్న రూ.లక్షల విలువచేసే పాత పరికరాలు, అల్యూమినియం, కాపర్ తీగలు, స్టీల్ పరికరాలు ఇంటి దొంగలే పక్కదారి పట్టించిన ఘటన వెలుగుచూసింది. **అక్రమాలకు తావులేదు..: చిన్నబ్బ శేఖర్, ఈఈ, ట్రాన్స్‌కో**గిరింపేటలోని 220కేవీ ఉపకేంద్రంలో కాపర్ రాడ్ అక్రమంగా తరలించే ఆస్కారం లేదు. అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే సస్పెండ్ చేస్తాం.

# ఎంఎస్ఎంఈ పార్కు పనులకు గ్రహణం

బొబ్బిలి : రామభద్రపురం మండలం కొట్టక్కి సమీపంలో కాకర్లవలస- కారేడువలస మధ్య ఎంఎస్ఎంఈ పార్కు పనులకు గ్రహణం వీడడంలేదు. ఇక్కడ ఏపీఐఐసీకి 187 ఎకరాల స్థలం ఉంది. దీంట్లో 87 ఎకరాల్లో పార్కు ఏర్పాటుకు ఈ ఏడాది మే 10న మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే బేబినాయన భూమిపూజ చేశారు. రూ.7 కోట్లతో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ భూములపై వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. కొంతమంది రైతులు తమకు ఈ భూముల్లో పట్టాలు ఇచ్చారని అభ్యంతరం తెలుపుతున్నారు. ఆరు నెలలు గడిచినా ఒక్క అడుగూ ముందుకెళ్లలేదు.

**కొలిక్కిరాని చర్చలు**

అధికారులు ఆందోళనకారుల మధ్య ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో



చర్చలు జరిగాయి. కాకర్లవలస- కారేడువలసకు చెందిన 20 మంది రైతులకు 2017లో అటవీశాఖ పోడు పట్టాలు ఇచ్చినట్లు చూపుతున్నారు. ఏపీఐఐసీ కూడా పార్కు కోసం ఆయా భూములను కొనుగోలు చేసినట్లు దస్త్రాల్లో ఉంది. రైతుల పట్టాలు ఒక చోట ఉన్నాయని, కానీ ఏపీఐఐసీ భూముల్లో సాగుచేశారని అధికారులు నిర్ధారించారు. పట్టాల్లోని భూమిని చదునుచేసి రైతులకు ఇస్తామని భరోసా ఇచ్చారు. అయినప్పటికీ గిరిజనులు వినిపించుకోలేదు. దీంతో వివాదం తేలలేదు. అధికారులు కొనుగోలు చేసిన నాటి నుంచి భూములకు సరైన రక్షణ చర్యలు చేపట్టలేదు. కంచె ఏర్పాటు చేసి బోర్డులు ఏర్పాటు చేస్తే ఈ సమస్య వచ్చేది కాదు. ఇప్పుడు పార్కు పనులు ప్రారంభమయ్యాక అసలు సమస్య మొదలైంది.

**మాట్లాడుతున్నాం..: రఫీ జాన్ ఆజూ, తహసీల్దారు, రామభద్రపురం**

ఏపీఐఐసీ భూముల్లోనే పార్కు నిర్మాణం జరుగుతోంది. గిరిజనులకు ఇచ్చిన పట్టాలకు సంబంధించిన భూములను అప్పగిస్తామని చెప్పాం. అప్పటికీ వినకపోతే కేసులు పెడతాం. సంబంధిత లబ్ధిదారులకు న్యాయం చేస్తాం. ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రభుత్వ పరంగా చేపట్టే పనులు అడ్డుకోవడం చట్టరీత్యా నేరం.

# అన్నవరంలో మరిన్ని వసతి గదులు

అన్నవరం : అన్నవరం ఆలయంలో భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా, సమయం ఆదా అయ్యేలా ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా ఆలయంలో ఉన్న గదుల్లో 70 శాతం గదులను ఆన్‌లైన్‌లో సోమవారం నుంచి అందుబాటులో ఉంచారు. రత్న, సత్యగిరులపై వివిధ వసతిసముదాయాల్లో సుమారు 480 గదులున్నాయి. ఇందులో 70 శాతం (336 గదులు) ఆన్‌లైన్లో ఉండగా భక్తులు %aptemples.org% ద్వారా, మన మిత్ర వాట్సాప్ నంబరు 95523 00009 ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు. అమలు సాధ్యమేనా..అన్నవరంలో వసతిగదులకు డిమాండ్ ఉంటుంది. వ్రతాలు, వివాహాలు జరుగుతాయి. వివాహాలకు ముందుస్తుగా విష్ణుసదన్‌లో హాల్స్ బుకింగ్ చేసుకునేవారికి 2 గదులను కేటాయిస్తారు. ఇక్కడ 32 హాల్స్ ఉన్నాయి. అన్ని హాల్స్ బుకింగ్ అయితే 64 గదులు కేటాయించాలి. ఇతర ప్రదేశాల్లో వివాహాలు చేసుకునేవారికి గదులివ్వాలి. ఇలా సుమారు 30 శాతానికి పైగా వివాహలకు కేటాయించగా, 70 శాతం ఆన్‌లైన్లో ఉంచితే నేరుగా అన్నవరం వచ్చే వారికి గదులు దొరికే పరిస్థితి ఉంటుంది. సాధారణ రోజుల్లో బాగున్నా.. రద్దీ రోజుల్లో ఇబ్బంది ఎదురవుతుంది. దీనికి తోడు సిఫార్స్ లేఖల తాకిడీ ఉంటుంది.

## పెరిగిన ధరలు.. వ్యాధుల బెంబేలు

పలమనేరు : పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్‌లో ప్రస్తుతం ధరలు అనూహ్యంగా పెరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గూళ్ల ధర ప్రస్తుతం కిలో రూ.720 పలుకుతోంది. వారం రోజుల నుంచి ఈ ధరలో ఏమాత్రం తగ్గుదల లేదు. ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇటీవల వాతావరణ మార్పులతో పట్టుపురుగులకు తెగుళ్లు సోకడంతో చనిపోతున్నాయని.. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**9కి 3 మాత్రమే..**ధర అశాజనకంగా ఉన్నా.. పట్టు పురుగులకు మాత్రం వ్యాధుల బాధ తప్పటం లేదు. ప్రస్తుతం మస్కాడిన్ అనే(సున్నపు కట్టు) వ్యాధి పురుగులకు సోకుతోంది. చాలా చోట్ల ఈ వ్యాధి



కారణంగా పట్టు పురుగులు చనిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాలు చూస్తున్నారు. పలమనేరు మార్కెట్‌కు నిత్యం 9 టన్నులు రావాల్సి ఉండగా.. ప్రస్తుతం మూడు టన్నులకే పరిమితమైంది.

**జాగ్రత్త పాటించాలి..**

షెడ్లలో తగిన ఉష్ణోగ్రత ఉండేలా చూసుకోవాలని.. పట్టు పురుగులున్న బెడ్లలో తేమ లేకుండా చూడాలని ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు.

## నిండి.. అడుగంటి

బంగారుపాళ్యం : తుంబ ప్రాజెక్టు నిండినా.. రైతన్నలకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు.. ఆ ప్రాజెక్టు మరమ్మతులకు అటవీశాఖ దశాబ్ద కాలంగా మోకాలడ్డుతోంది.. బంగారుపాళ్యంలోని తుంబపాళ్యం అటవీ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టు రెండువేల ఎకరాల విస్తీర్ణంలోని ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. తుంబపాళ్యం అటవీ ప్రాంతంలో పదేళ్ల క్రితం తుంబ ప్రాజెక్టు(కొత్తచెరువు) నిర్మించారు. దీనికి రెండు వైపులా సుమారు రెండు కిలోమీటర్ల పైగా కాలువలు నిర్మించారు. అప్పట్లో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టు తూము(గేట్) కొట్టుకుపోయింది. అప్పటి నుంచి వర్షాలకు వచ్చిన నీరు ఈ ప్రాజెక్టులో నిల్వ ఉండక వృథాగా పోతోంది. తెదేపా హయాంలో ప్రాజెక్టు మరమ్మతులకు జపాన్ నిధులు రూ.2.50 కోట్లు



మంజూరయ్యాయి. తర్వాత అధికారంలోని వచ్చిన వైకాపా ప్రభుత్వం హయాంలో కడపకు చెందిన గుత్తేదారు.. మరమ్మతులు చేపట్టగా ఇది తమ పరిధిలో ఉందని అటవీ శాఖ అభ్యంతరం తెలిపింది. అప్పటి అటవీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ సమస్యను అసలు పట్టించుకో లేదు. నిధులు మంజూరైనా ప్రయోజనం లేకపోయింది.

**మరమ్మతులు చేపడితేనే..**

తుంబపాళ్యం, ఈచనేరపల్లె, పెరుమాళ్లపల్లె, తుంబకుప్పం, నల్లంగాడు కోటూరు సదకుప్పం గ్రామ పంచాయతీల పరిధిలోని ఆయకట్టు భూములతో పాటు చెరువుల్లో నీటిమట్టం పెరుగుతోంది. ఎమ్మెల్యే మురళీమోహన్ చొరవ చూపి అటవీశాఖ అటవీశాఖ సమన్వయంతో తుంబ ప్రాజెక్టు మరమర్మతులు చేపట్టాలని, తద్వారా తమ కష్టాలు తీర్చాలని అన్నదాతలు కోరుతున్నారు.

## కూలి అందుకుని.. గుట్టుగా జారుకుని

నంద్యాల : ఉపాధి పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో నమోదైన పలువురు దీనికి దూరంగా ఉంటున్నారు. గుట్టు బయటపడుతుందన్న ఉద్దేశంతో రావడం లేదు.

**క్షేత్రస్థాయిలో కానరాక..**

ఉమ్మడి జిల్లాలో సుమారు 4 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఇచ్చారు. కర్నూలు జిల్లాలో 66, నంద్యాల జిల్లాలో 72 శాతం ఈకేవైసీ పూర్తైనట్లు చెబుతున్నా వాస్తవంగా అంతకన్నా తక్కువగానే ఉంది. శ్రామికులుగా దస్త్రాల్లో చూపినవారి జాడ క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. వీరు పనులకు రాకున్నప్పటికీ వేతనాలు మాత్రం అందుకోవడం గమనార్హం.

**రూ.కోట్లు పక్కదారి**

కర్నూలు జిల్లాలో పత్తికొండ, కోసిగి, మద్దికెర, నందవరం, కోడుమూరు, హాలహర్వి, దేవనకొండ, కృష్ణగిరి తదితర మండలాల్లో, నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, కోవెలకుంట్ల, గోస్పాడు, వెలుగోడు, ఆత్మకూరు, గడివేముల తదితర మండలాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి.

**విషయం బయటపడుతుందని..**

ఉపాధి హామీ పథకంలో భాగంగా చేయని పనులు చేసినట్లు కొన్నిచోట్ల నమోదు చేశారు. పనికి రాకున్నప్పటికీ వచ్చినట్లు చాలా ప్రాంతాల్లో దొంగ మస్టర్లు వేశారు. పని ప్రదేశంలో అందరినీ గ్రూపుగా నిలబెట్టి ఫొటో తీసి హాజరు వేసే విధానం అమలులోకి తెచ్చినప్పటికీ దొంగ మస్టర్లకు మాత్రం అడ్డుకట్ట పడలేదు. ఐదేళ్ల కిందట కేవలం హాజరు పట్టిక మాత్రమే ఉండగా.. అక్రమాలు భారీగా జరిగాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చేస్తున్నవారి పేర్లతోనూ రెండు జిల్లాల్లోని పలు గ్రామాల్లో నమోదు చేసి వేతనాలు స్వాహా చేశారు. సోషల్ ఆడిట్‌లో పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

**ఈకేవైసీ పూర్తైతేనే..**

ఈకేవైసీ పూర్తైన తర్వాత వీరికి పనులు కల్పిస్తారు. పని జరిగే ప్రాంతంలో ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది.

జాబ్‌కార్డు ఉండి పనులకు రాని కొందరు ఈకేవైసీ చేయించుకునేందుకు ముందుకు రావడం లేదు. ఈకేవైసీ చేయించుకుంటే గతంలో చేసిన తప్పులు బయటకు వస్తాయన్న ఉద్దేశంతో గుట్టుగా జారుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈకేవైసీ పూర్తి కానివారు 2 లక్షల మందికిపైగా ఉన్నారు. వీరి వివరాలు సేకరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

జాబ్‌కార్డులు తీసుకున్న కుటుంబాలు

హాజరవుతున్న కుటుంబాలు పనులు చేస్తున్నవారు

# స్వర్ణ పంచాయతీకి మకిలీ!



కంభం: గ్రామపంచాయతీల్లో సాధారణ నిధులు దుర్వినియోగమవుతున్న నేపథ్యంలో ఇంటి పన్ను వసూళ్ల ప్రక్రియలో పారదర్శకతకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. పంచాయతీల వారీగా ప్రతి ఆస్తికి కేటాయించిన ఇంటి పన్ను అసెస్‌మెంట్ నంబరుతోపాటు యజమాని చరవాణి సంఖ్యను అనుసంధానం చేయాలి. తద్వారా ఇంటి పన్ను బకాయిల నుంచి చెల్లించాల్సిన వివరాలు నేరుగా ఇంటి యజమాని చరవాణికి వాట్సాఫ్‌కు సమాచారం పంపిస్తారు. అనంతరం పన్ను బకాయిలు చెల్లించాక కూడా రసీదు వాట్సాప్‌కు వెళ్లనుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా జమ చేసిన నగదు కూడా పంచాయతీ ఖాతాకు జమవుతోంది. ఈ విధానం పూర్తిగా అమల్లోకి వస్తే ఇంటి, నీటి పన్ను చెల్లింపుల విధానంలో పారదర్శకత రానుంది. పోర్టల్‌లో నమోదు ప్రక్రియంతా గతేడాదిగా కార్యదర్శులతోపాటు, సచివాలయ సిబ్బందికి అప్పగించారు. క్షేత్రస్థాయిలో కొన్ని గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించకుండానే అందుబాటులో ఉన్న చరవాణి సంఖ్యలను అనుసంధానం చేసేశారు.

**వెలుగులోకి తప్పులు...**

పంచాయతీరాజ్‌శాఖ 'స్వర్ణ పంచాయతీ' పోర్టల్‌లో పన్నుల చెల్లింపు వివరాలు పరిశీలిస్తోంది. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన తప్పులు వెలుగులోకి వచ్చాయి. కార్యదర్శుల నిర్లక్ష్యంతో జిల్లాల వారీగా చోటుచేసుకున్న తప్పులను జిల్లా పంచాయతీ కార్యాలయానికి పంపించారు. జిల్లావ్యాప్తంగా వందలాది అసెస్‌మెంట్లకు ఒకే చరవాణి సంఖ్య లింక్ చేసినట్లు గుర్తించారు. ప్రతి జిల్లాలోనూ అత్యధికంగా తప్పులు చేసిన ఒక కార్యదర్శిని ఇప్పటికే సస్పెన్షన్ చేయగా, మరికొందరికి తాఖీదులు జారీ చేశారు. అసెస్‌మెంట్ల వారీగా అనుసంధానమైన చరవాణి సంఖ్యను పరిశీలించి దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు. **4,75,474 అసెస్‌మెంట్లు...**జిల్లాలోని 38 మండలాల పరిధిలో 729 గ్రామ పంచాయతీలు న్నాయి.మొత్తం 4,75,474 అసెస్‌మెంట్లు ఉండగాబీ వీటికి సదరు యాజమాని చరవాణి సంఖ్య అనుసంధానం చేశారు. తాళ్లూరు మండలం తురకపాలెం పంచాయతీలో మొత్తం 608 అసెస్‌మెంట్లు ఉండగా, 583 ఆస్తులకు ఒకే చరవాణి సంఖ్యను అనుసంధానం చేసినట్లు అధికారులు గుర్తించారు. వైపాలెం మండలం వి.గంగపాలెంలో 891 అసెస్‌మెం ట్లకు 505, తాళ్లూరు మండలం శివరాంపురంలో 954 అసెస్‌మెంట్లకు 476 అసెస్‌మెంట్లదీ ఇదే పరిస్థితి. పొదిలి మండలం మల్లవరంలో 340 అసెస్‌మెంట్లు ఉండగా, పోర్టల్‌లో మొత్తం వివరాలే తొలగించారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లును ఇప్పటికే సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# పంట నష్టం.. లెక్కింపు ముఖ్యం



కంభం: మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు సోమవారం కేంద్ర బృందం జిల్లాలోని ఎన్‌కేపాడు, కొత్తపట్నంలలో పర్యటించబోతోంది. ఈ సందర్భంగా పశ్చిమ ప్రకాశంలో దెబ్బతిన్న ఉద్యాన పంటలను కూడా బృందం పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

**27 మండలాల్లో 516.98 హెక్టార్లలో నష్టం**

నాగులుప్పలపాడు, కొత్తపట్నం మండలాల్లో నష్టపోయిన పంటలను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించి నష్టం అంచనా వేయనున్నారు. జిల్లాలోని 27 మండలాల్లో ఉద్యాన పంటలైన మిరప, టమాట, అరటి, పసుపు, కూరగాయలు, పూలు, ఉల్లి, జామ, బొప్పాయి, తదితర పంటలు 516.98 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 959 మంది ఉద్యాన రైతులు తీవ్రంగా నష్టపోయారు. అత్యధికంగా త్రిపురాంతకం మండలంలో 152.58, దోర్నాల 93.03, వై.పాలెం 43.59, పెద్దారవీడు 40 హెక్టార్లలో ఎక్కువగా పంటలకు నష్టం వాటిల్లింది.

**4,5 తేదీల్లో కురిసిన వర్షానికి పొలాల్లోనే నీరు**

అర్ధవీడు మండలంలోని వెలగలపాయ, గన్నేపల్లి, మాగుటూరు, కాకర్ల తదితర గ్రామాల్లో మొంథా తుపాను తర్వాత ఈ నెల 4, 5న కురిసిన వర్షానికి మిరప, టమాట పైర్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లోనే నీరు నిలిచి ఉంది. ఆయా గ్రామాల్లో మళ్లీ కురిసిన వానలకు సుమారు 150 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. గుండ్లకమ్మ ప్రవాహం కొనసాగుతుండడంతో పశ్చిమ ప్రాంతంలో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కంభం చెరువు అలుగు 13 రోజుల నుంచి పారుతుండడంతో పలు పంటల పైనుంచే ప్రవాహం వెళ్తోంది.దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**ఉన్నతాధికారులకు నివేదించాం**

ఈ నెల 4, 5 తేదీల్లో కురిసిన వర్షానికి సాగులో ఉన్న మిరప, టమాట పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. ఉన్నతాధికారులకు ఇప్పటికే ఈ విషయం తెలియజేశాం.శ్వేత, ఉద్యానశాఖ అధికారిణి, కంభం, గిద్దలూరు

# ఖాళీగా ఉంచారు.. రూ.కోట్లు మింగారు



కర్నూలు : కర్నూలు నగరంలోని బళ్లారి రోడ్డులో రేడియో స్టేషన్ వద్ద రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (ఏపీ ఎస్‌డబ్ల్యూసీ) గోదాములు గత ఐదేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. సుమారు 6 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ గోదాములను గత ప్రభుత్వ హయాంలో అద్దెకు కూడా ఇవ్వకుండా నిరుపయోగంగా మార్చారు. రేషన్ బియ్యం నిల్వకు అవకాశం ఉన్నా.. వీటిలోకి తరలించకుండా నాయకులు పావులు కదిపారు. ఈ గోదాము సమీపంలోనే పదేళ్లుగా ఓ ప్రైవేటు గోదామును పౌర సరఫరాల సంస్థ అద్దెకు తీసుకొని రేషన్ బియ్యం బఫర్ స్టాక్ నిల్వ చేస్తోంది. పదివేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన దీనికి నెలకు రూ.10 లక్షల మేర అద్దె చెల్లిస్తున్నట్లు సమాచారం. ఐదేళ్ల పాటు గోదాములను ఖాళీగా ఉంచడంతో ఎస్‌డబ్ల్యూసీకి రూ.3.60 కోట్ల నష్టం జరిగింది.

**ప్రైవేటులో నిల్వ చేసి..**ప్రైవేటు గోదాముల్లో రేషన్ బియ్యం నిల్వ చేయడంతో గతంలో అనేక అక్రమాలు జరిగాయి. బియ్యాన్ని పెద్దఎత్తున బయటకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఆదోనిలోని ఓ ప్రైవేటు గోదాములో బఫర్ స్టాక్ నిల్వలు ఉంచారు. ఎఫ్‌సీఐ గోదాములున్నా.. వైకాపా ప్రభుత్వంలో నేతల అండదండలతో ప్రైవేటు గోదాముల్లోనే బియ్యం నిల్వలు ఉంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థ గోదాముల్లోనే రేషన్ బియ్యం నిల్వ ఉంచాలని ఆదేశించింది. ఇకపై ఎస్‌డబ్ల్యూసీ గోదాములను వినియోగించనున్నా రు. ఫలితంగా రేషన్ పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్టపడే అవకాశం ఉంది.

**ఎట్టకేలకు వినియోగించుకునేలా..**జిల్లాకు ప్రతినెలా నాలుగు వ్యాగన్ల రేషన్ బియ్యం వస్తోంది. వీటిలో రెండు వ్యాగన్లను ప్రైవేటు గోదాములో, మరో రెండు వ్యాగన్ల బియ్యాన్ని ఎస్‌డబ్ల్యూసీ గోదాములో నిల్వ చేసేందుకు రంగం సిద్ధమైంది. రేడియోస్టేషన్ సమీపంలోని ఎస్‌డబ్ల్యూసీ గోదాము ఆవరణను ఆదివారం శుభ్రం చేయించారు. ఇటీవల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. వారం రోజుల్లో ఈ గోదాముల్లో 5 నుంచి 6 వేల టన్నుల నిల్వలు ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఆదుకునేనా.. ఆదరవయ్యేనా!

పెదపాడు : తుపానులు, ప్రకృతి విపత్తుల కారణంగా ఆరుగాలం కష్టించి పండించిన పంటలు అన్నదాతల చేతికందడం లేదు. ఏటా నష్టాలు ఎదురైనా, పెట్టుబడులు దక్కకున్నా.. ప్రత్యామ్నాయ ఆలోచన లేకుండా సాగు వైపే మొగ్గుచూపుతున్నారు. ఈ ఏడాది అక్టోబరు చివరి వారంలో విరుచుకుపడిన మొంథా తుపానుతో స్వర్ణ రకం వరి పండించిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు చేశారు.



**అత్యధికంగా ఉంగుటూరులో..**తుపాను కారణంగా ఉంగుటూరు మండలంలో అత్యధికంగా సుమారు వెయ్యి ఎకరాల్లో వరి దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. దెందులూరు 629, పెదపాడు 336, పెదవేగి 255 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు తేల్చారు. క్షేత్ర స్థాయిలో నష్ట తీవ్రత మరింత ఎక్కువే ఉందని రైతులు చెబుతున్నారు. 33 శాతం కంటే ఎక్కువ నష్టం వాటిల్లితేనే నష్టపరిహారం దక్కుతుందని అధికారులు చెబుతుండటంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.**ఆశలన్నీ వారిపైనే..**జిల్లాలో కేంద్ర బృందం పర్యటిస్తున్న నేపథ్యంలో.. రైతులు ఆశలన్నీ వారిపైనే పెట్టుకున్నారు. షెడ్యూల్ ప్రకారం కేవలం అర గంట మాత్రమే పంట నష్టాన్ని పరిశీలించనున్నారు. కేంద్ర బృందం రైతులను ఆదుకొని ఆదరవుగా నిలవాలని అన్నదాతలు కోరుతున్నారు.

## రాకపోకలకు ఆయ'కట్ట'మే

నంద్యాల: ఉమ్మడి జిల్లాలో పంట పొలాలకు వెళ్లే ఆయకట్టు రోడ్లు ఛిద్రమయ్యాయి. దశాబ్దాల తరబడి వీటిని పట్టించుకోకపోవడం.. నిర్వహణ కరవవడంతో అధ్వానంగా మారింది. కనీసం రైతులు నడిచేందుకు వీలులేని విధంగా మారింది. ఇటీవల మొంథా తుపానుతో కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి.

తెలుగుగంగ ఆయకట్టు పరిధిలోని వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది, రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లోని వివిధ ప్రాంతాల్లో పొలాలకు వెళ్లే రహదారులు రూపు కోల్పోయాయి. ప్రత్యేకించి నల్లరేగడి భూముల్లో సమస్య తీవ్రంగా ఉంది. లక్షకుపైగా ఎకరాలు సాగులో ఉండగా.. భారీ వర్షాల కారణంగా లింకు రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. కేసీ కాలువ ఆయకట్టు పరిధిలోని బండిఆత్మకూరు, నంద్యాల, గోస్పాడు, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, చాగలమర్రి మండలాల్లో పెద్దఎత్తున వరి సాగవుతోంది. ఆయా ప్రాంతాలకు చెందిన రైతులు తమ పొలాలకు ఎరువులు తరలించలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఎస్సార్బీసీ ఆయకట్టు పరిధిలోని పాణ్యం, బనగానపల్లి, కోవెలకుంట్ల, సంజామల, అవుకు మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. తెలుగుగంగ, కేసీ పరిధిలో వరి కోతకు సిద్ధమైంది. కొన్ని ప్రాంతాల్లో చివరి విడతగా ఎరువులు వేస్తున్నారు. పొలాలకు వెళ్లేందుకు ఉన్న ఏకైక మార్గం ఆయకట్టు రోడ్లే. ఇవి బురదతో నిండిపోయాయి.

**అదనపు ఖర్చులతో...**

తెలుగుగంగ ఆయకట్టు పరిధిలో గాజులపల్లె-బసవాపురం, మహానంది-శ్రీనగరం, తిమ్మాపురం-కృష్ణనంది మార్గంలో 9 వేల ఆయకట్టు ఉంది. పొలాలకు వెళ్లే లింకు రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ పొలాల్లో పనులకు రావాలంటే కూలీలు ఎక్కువ అడుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగు వ్యయం పెరిగిందని.. ఈ క్రమంలో ఆయకట్టు రహదారులు అధ్వానంగా ఉండటంతో ఖర్చు మరింత ఎక్కువైందని పేర్కొంటున్నారు.

**నిధుల్లేక.. నిర్వహణ కానరాక**

మార్కెట్ యార్డులకు వసూలయ్యే సెస్సులో 10 శాతం నిధులను ఆయకట్టు రోడ్లకు కేటాయించాలన్న నిబంధన ఉంది. రెండు దశాబ్దాలుగా జరగడం లేదు. గ్రావెల్ తోలడంతోపాటు మెటల్ చిప్స్ లాంటివి వేస్తే గుంతలు పడడం.. వర్షాలకు రహదారులు కోతకు గురవడం లాంటివి ఉండవు. మరోవైపు ఇటీవల కేసీ కాలువ, తెలుగుగంగ, ఎస్సార్బీసీ, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సాగునీటి సంఘాలు ఏర్పడ్డాయి. ఈ కమిటీలకు నిధులు కేటాయించి పనులు చేయించొచ్చు.. ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## ఆ'దారం' తెగుతోంది

ఎమ్మిగనూరు : నేత కార్మికులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. పట్టు మగ్గాలపై ఆధారపడిన కార్మికులు, మాస్టరు వీవర్లకు ఇప్పుడు కొత్త సమస్య ఎదురైంది. పట్టు చీరల తయారీకి ఉపయోగించే వార్పు, సప్పూరి ధరలు మూడు నెలల వ్యవధిలో కిలోకు రూ.1,200కుపైగా పెరిగింది. పట్టు ఉత్పత్తి తగ్గడంతో ముడి పట్టుకు డిమాండు ఏర్పడింది. జిల్లాలో చేనేత మగ్గాలకు అవసరమైన ముడిసరకు రాక తగ్గిపోయింది. వాస్తవంగా ధర్మవరం, హిందూపురం, బెంగళూరు నుంచి ఎమ్మిగనూరు, కోడుమూరుకు చెందిన వ్యాపారులు పట్టు దారాలను అధికంగా దిగుమతి చేసుకునేవారు. పెరిగిన ధరల నేపథ్యంలో ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో ఉత్పత్తయ్యే చోటు నుంచి మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్రంలో ధర్మవరం తర్వాత ఎమ్మిగనూరులో ఎక్కువమంది నేతన్నలు ఉన్నారు.

జీవనంపై ప్రభావం జిల్లాలో అత్యధికంగా ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని, నందవరం, నాగలదిన్నె, కోసిగి గుడేకల్లు, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో పట్టుతో నేసే మగ్గాలు ఉన్నాయి. వీరంతా మాస్టరు వీవర్స్ కింద నేస్తున్నారు. తెలంగాణలోని గద్వాల, ఎమ్మిగనూరు, కోడుమూరు పరిధిలో 400 మంది వ్యాపారులు ఉన్నట్లు అంచనా. వీరంతా ముడి సరకును బెంగళూరు, చీరాల, ధర్మవరం తదితర ప్రాంతాల నుంచి తీసుకొస్తుంటారు. జిల్లాలో 17 వేలకుపైగా పట్టు మగ్గాలు ఉన్నట్లు అంచనా. ధరలు పెరగడంతో మగ్గాల సంఖ్య తగ్గుతోంది. కార్మికులకు ఒక చీర నేసేందుకు వారం నుంచి 16 రోజులు పడుతుంది. కూలీ రూ.1,200 నుంచి రూ.8 వేల వరకు అందుతుంది. జిల్లాలో 300కుపైగా మగ్గాలు తగ్గినట్లు అంచనా. ఈ నేపథ్యంలో కార్మికుల జీవనం దయనీయంగా మారుతోంది.

జిల్లాలో మొత్తం మగ్గాలు 17 వేలు ఒక చీరకు అవసరమైన పట్టు 700 గ్రాములునెలకు అవసరమైన ముడి పట్టు 68 వేల కిలోలు

నెలకు ఒక మగ్గంపై పట్టుచీరల ఉత్పత్తి సరాసరిన 6

నెలకు అవసరమైన పట్టుదారం 38,250 కిలోలు

ప్రస్తుతం కిలో ముడిపట్టు ధర రూ.6,400

మూడు నెలల కిందటి ధర రూ.5,200

# రూ.5 వేల కోట్లతో రెండు వరుసల రైల్వేలైన్

గుంతకల్లు: కేంద్ర ప్రభుత్వం అత్యవసర పనుల జాబితాలో చేర్చి మరో రెండు వరుసల రైల్వేలైన్ల నిర్మాణానికి సంబంధించి సర్వేను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి పంపాలని ఆదేశించింది. దీంతో గుంతకల్లు డివిజన్ అధికారులు ఆయా సర్వే నివేదికను పూర్తి చేసి నాలుగు రోజుల కిందట రైల్వే బోర్డుకు పంపారు. లైన్ల నిర్మాణానికి రూ.5 వేల కోట్లు అవసరమవుతాయని అధికారులు సర్వే నివేదికలో పొందుపర్చారు. రైల్వే లైన్ల పనులకు సంబంధించి గుంతకల్లులోని గేజ్‌కన్వర్షన్ (నిర్మాణాలు) డిప్యూటీ చీఫ్ ఇంజినీరు కార్యాలయానికి చెందిన ఇంజినీర్లు సర్వే చేశారు. గుంతకల్లు డివిజన్ పరిధిలోని గుంతకల్లు- వాడి, గుంతకల్లు – రేణిగుంట, గుంతకల్లు – బళ్లారి సెక్షన్లలో ప్రస్తుతం రెండు వసుల లైన్లు ఉన్నాయి. వీటికి సమాంతరంగా మరో రెండు నిర్మించాలన్న యోచనలో ఉన్నారు. తద్వారా ప్రయాణికుల రైళ్లు, సరకులు, ఖనిజాలను రవాణా చేసే గూడ్సుల రాకపోకల కోసం వేర్వేరుగా ఏర్పాట్లు సమకూరుతాయి.

**ప్రయాణికుల రైళ్లకు వెసులుబాటు**

డివిజన్‌లో గుంతకల్లు- వాడి మధ్య (228.32 కి.మీ.లు), గుంతకల్లు



– రేణిగుంట (305.24 కి.మీ.లు), గుంతకల్లు-బళ్లారి మధ్య (48.66 కి.మీ.లు) పొడవునా ప్రస్తుతం రెండు వరుసల లైన్లు ఉన్నాయి. ఈ మార్గాల్లోనే మరో రెండు లైన్లను ఏర్పాటు చేయబోతున్నారు. ప్రస్తుతం రెండు లైన్లు మాత్రమే ఉండడంతో ప్రయాణికుల రైళ్లు, గూడ్సులు సకాలంలో వెళ్లడానికి అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీన్ని అధిగమించడానికే రైల్వే బోర్డు సమాయత్తమవుతోంది. ప్రభుత్వం ఆయా పనులను త్వరగా ప్రారంభించాలన్న ఉద్దేశంతో సర్వే పూర్తి చేయాలని సూచించడంతో అధికారులు నివేదిక పంపారు. అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియను ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

# హడ్కో సాయం.. టిడ్కోలో కదలికలు

హిందూపురం : ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లకు వచ్చే నెల నుంచి కదలికలు రానున్నాయి. ప్రస్తుతం జిల్లాలో మొదటి విడత కింద కదిరి, ధర్మవరం, పుట్టపర్తిలో పూర్తయిన ఇళ్లను ప్రభుత్వం త్వరలో లబ్ధిదారులకు అప్పగించనుంది. వీటికి అవసరమైన నిధులు అందించడానికి హడ్కో ముందుకు వచ్చింది. మొదటి విడత ఇళ్ల పంపిణీ పూర్తి కాగానే రెండో విడతలో హిందూపురంతోపాటు జిల్లాలో వివిధ దశల్లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టి మార్చిలోపు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించనున్నారు. ఏడేళ్లుగా టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. గత వైకాపా పాలనలో వీటిపై ఆశలు సన్నగిల్లినా.. కూటమి ప్రభుత్వం చొరవతో మళ్లీ లబ్ధిదారుల్లో చిగురించనున్నాయి.

మున్సిపాలిటీ : హిందూపురం

డబ్బు చెల్లించిన లబ్ధిదారులు : 2,736



ఇళ్ల కేటాయింపు : 2,516

బ్యాంకుల్లో రుణం పొందినవారు : 380హిందూపురం సమీపంలోని కొటిపి వద్ద జీప్లస్-3 విధానంలో టిడ్కో ఇళ్లు ప్రారంభం కాగా దాదాపు నాలుగు బ్లాకుల్లో 85 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికి కిటికీలు, తలుపులు, టైల్స్ ఏర్పాటు చేసి విద్యుత్తు, నీటి సౌకర్యం అందిస్తే వంద శాతం పనులు పూర్తవుతాయి. ఈమేరకు పురపాలక సంఘం అధికారులు మొదటి విడత ఇళ్ల పంపిణీ జరిగిన వెంటనే రెండో విడత కింద పనులు ప్రారంభించేందుకు సిద్ధమవు తున్నారు.

**వచ్చే నెల నుంచి పనులు: మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, హిందూపురం** ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూరైన చోట వచ్చే నెలలో వాటిని ప్రభుత్వం లబ్ధిదారులకు అందించనుంది. ఈ కార్యక్రమం పూర్తికాగానే రెండో విడత కింద అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. ఈ పనులు 2026, మార్చికి పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందిచనుంది.

# నట్టేట ముంచిన నాసిరకం విత్తనం

ఉరవకొండ : పత్తి రైతులను నాసిరకం విత్తనం కుదేలు చేసింది. వజ్రకరూరు మండలం ధర్మపురి గ్రామానికి చెందిన కేశవరెడ్డి 14 ఎకరాల్లో, రామిరెడ్డి, ఆయన సోదరుడు హనుమంతురెడ్డి నీటి కుంటల ఆధారంగా 25 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట కాయ దశలో ఉంది. ఇప్పటి వరకు ఎకరాకు రూ.60 వేలు చొప్పున 39 ఎకరాలకుగాను రూ.24 లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెప్పారు. పంట బాగా పెరిగి, ఒక్కో



మొక్కకు 60-70 కాయలు రావడంతో సంతోషించారు. అయితే కాయ పగలకుండా నల్లగా మారి, ఎండిపోతోంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం కానరాలేదు. ఏమి చేయాలో అర్థం కాక, పెట్టుబడి పెట్టలేక రైతులు 39 ఎకరాల్లో పత్తి పంటను ట్రాక్టర్లతో దున్ని తొలగించారు. చేతికి వచ్చిన పంట నోటికి అందకుండపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉరవకొండ వ్యవసాయ శాఖ ఏడీ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా రైతులు పూర్తి వివరాలు తెలిపితే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. పంట నష్టానికి ప్రధాన కారణాన్ని అన్వేషించే ప్రయత్నం చేస్తాం. నాసిరకం విత్తనం అని తేలితే చర్యలకు ప్రతిపాదిస్తామన్నారు.

# మాతృవందన.. అమ్మలకందేనా!



అనంతపురం : ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) పేద గర్భిణులకు ఒక వరం. కేంద్రం రూ.5 వేలు, రాష్ట్ర ప్రభుత్వం జననీ సురక్ష యోజన (జేఎస్‌వై) కింద మరో రూ.వెయ్యి కలిపి మొత్తం రూ.6 వేలు ప్రోత్సాహకం కింద చెల్లిస్తారు. తల్లీబిడ్డకు మెరుగైన ఆరోగ్యాన్ని కల్పించడం.. పోషణ లోపాన్ని నివారించడమే ఏకైక లక్ష్యంగా అమలు చేస్తున్నారు. ఈ పథకంపై ఐసీడీఎస్ యంత్రాంగం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అర్హత కలిగిన ప్రతి గర్భిణికి రూ.6 వేలు ప్రోత్సాహకం అందని ద్రాక్షలా మారింది. లబ్ధిదారుల పేర్ల నమోదులోనే నిర్లిప్తత ఆవహించింది. ఈ ఏడాది మేలో జిల్లా వైద్యారోగ్య శాఖ నుంచి ఐసీడీఎస్ శాఖకు బదలాయించిన తర్వాత పథకం అమలు బాలారిష్టాలను దాటడం లేదు. ఈ ఏడాది జులై నుంచి గర్భిణి, నిర్దేశిత తల్లుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గందరగోళంగా మారింది. అన్ని స్థాయిల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చినా నమోదులోనే తప్పటడుగులు వేస్తున్నారు. నిజమైన లబ్ధిదారుల పేర్లు ఈ పథకంలో నమోదు కావడం లేదు.

**ఎంపికలో అస్తవ్యస్తం**

తొలి ప్రసవానికి ఆడ, మగ ఎవరైనా సరే నిర్దేశిత ప్రోత్సాహకం సొమ్ము లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. రెండో కాన్పులో ఆడపిల్ల పుడితేనే పీఎంఎంవైవీ వర్తించనుంది. మగబిడ్డ అయితే ఆ ప్రోత్సాహక మొత్తాన్ని ఇవ్వరు. ఈ ఏడాది జులై నుంచి గర్భిణి లేదా అప్పటికే ప్రసవం పొందినా సరే ఈ పథకంలో నమోదు చేస్తున్నారు. ఎంపిక ప్రక్రియ అస్తవ్యస్తం నడుస్తోంది.

**పోషణ్ ట్రాకర్ ప్రకారం లబ్ధిదారుల వివరాలు**

మొత్తం లబ్ధిదారులు : 32,924

ఎంపికైన వారు : 2,102

తిరస్కరణ : 17,700

మిగులు : 13,122

**శింగనమల ప్రాజెక్టు భేష్!**

జిల్లా ఐసీడీఎస్ శాఖలో 11 ప్రాజెక్టుల్లో.. పీఎంఎంవీవై పురోగతిలో శింగనమల ప్రాజెక్టు 78.7 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచింది. కళ్యాణదుర్గం 76.9, నార్పల 75 శాతంతో ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. లబ్ధిదారుల ఎంపిక/నమోదులో వెనుకపడిన ప్రాజెక్టుల్లో కంబదూరు, కణేకల్లు, తాడిపత్రి, ఉరవకొండ ఉండటం గమనార్హం. కంబదూరు ప్రాజెక్టులో ఇప్పటి దాకా కేవలం 77 మంది మాత్రమే లబ్ధిదారులను తేల్చారు. పురోగతి సాధనలో చూస్తే.. అనంత అర్బన్ 44.3 శాతం, అనంత గ్రామీణం 46.6, తాడిపత్రి 50.9, కంబదూరు 52.6 శాతం నమోదుతో చాలా వెనుకపడ్డాయి. ఈ ఏడాది మే నుంచి ఈ పథకం కింద ఏ ఒక్క గర్భిణికి ప్రోత్సాహకం అందలేదంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అవగతం అవుతోంది.

**ప్రత్యేక దృష్టి సారించాం: అరుణకుమారి, పీడీ, ఐసీడీఎస్** పథకంలో లబ్ధిదారుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాం. వారం రోజుల్లో పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. అంగన్‌వాడీ కార్యకర్త వద్ద నమోదు చేసుకుంటే.. సూపర్‌వైజర్లు, సీడీపీఓలు ఆమోదం పొందిన తర్వాత పీడీ లాగిన్‌కు వస్తాయి. ఇక్కడి నుంచి రాష్ట్ర కార్యాలయానికి సిఫార్సు చేస్తున్నాం. ఈ ప్రక్రియపై వేగం పెంచాం. తరచూ సమీక్షలు చేస్తున్నాం. వెనుకపడిన వారితోనూ ప్రత్యేకంగా మాట్లాడుతున్నాం.

# వైకాపా నాయకుడి దుశ్చర్య



కళ్యాణదుర్గం : పురాతన ఆలయాల స్థలాలు కబ్జాకు గురవుతున్నా ఎవరికీ పట్టడం లేదు. కుందుర్పి గ్రామ శివారులోని పురాతన శ్రీకణేబసప్ప ఆలయం చుట్టూ ఉన్న ఖాళీ సల్థంలో అదే గ్రామానికి చెందిన ఓ వైకాపా నాయకుడు రెండు రోజులుగా తవ్వకాలు చేపడుతున్నారు. గ్రామస్థులకు అనుమానం వచ్చి ఎందుకని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదు. ఆలయాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఇలా చేసినట్లు పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుందుర్పి - కళ్యాణదుర్గం మార్గంలోని ప్రధాన రహదారి నుంచి దయ్యాలదిబ్బ వరకు ఆలయానికి సంబంధించిన 35 సెంట్ల కొండ పొరంబోకు భూమి ఉంది. ఈ స్థలాన్ని ఆలయానికి అప్పగించారు. ఆలయానికి పడమర వైపు గత మూడు నెలలుగా అక్రమ కట్టడాలు వెలిశాయి. గతంలో కొందరు చిల్లర దుకాణాలు ఏర్పాటు చేసుకోగా పంచాయతీ అధికారులు తొలగించారు. ఇదే అదునుగా భావించి సదరు వైకాపా నాయకుడు ఆ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు కుయుక్తులు పన్నుతున్నాడు.

కుందుర్పి మండల కేంద్రంలోని పలు పురాతన ఆలయాలకు సంబంధించి స్థలాలు, పొలాలు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా స్థలాల్లో నాలుగేళ్లుగా వైకాపా నాయకుల అండదండలతో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. దీనిపై తహసీల్దారు ఓబులేసును వివరణ కోరగా ఆలయ భూముల ఆక్రమణల విషయంలో గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికీ ఎలాంటి అనుమతులు లేవని, ఎలాంటి కట్టడాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను ఆయాశాఖల ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

# మొక్కజొన్న ధర నేలచూపు



కళ్యాణదుర్గం : జిల్లాలో మొక్కజొన్నకు గిట్టుబాటు ధర దక్కక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బహిరంగ విపణిలో ధరలు లేక, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కాక అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో ఖరీఫ్ కింద రాయదుర్గం, కళ్యాణదుర్గం, శింగనమల, తాడిపత్రి, ఉరవకొండ, రాప్తాడు, గుంతకల్లు ప్రాంతాల్లో 75 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైనట్లు అధికారులు నివేదిస్తున్నారు. 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానున్నట్లు అంచనా. గత 45 రోజులుగా దిగుబడి చేతికందుతున్నా.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.కోతల ఆరంభంలో 2,100 పలికిన క్వింటాలు మొక్కజొన్నలు, ప్రస్తుతం రూ.1,700కు పడిపోయాయి. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.2,400 ప్రకటిస్తే.. మార్కెట్‌లో క్వింటా రూ.700 తగ్గించారని పంటను ఎలా విక్రయించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎకరాకు రూ.35 వేలు ఖర్చు చేసినా, 20 క్వింటాళ్ల దిగుబడి అమ్మితే పెట్టుబడి రాక, కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ఈలెక్కన ప్రతి రైతు ఎకరాకు రూ.15 వేలు చొప్పున నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు జిల్లా రైతులకు 105 కోట్ల మేర నష్టం వాటిల్లనుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**రైతుకు భరోసా ఏదీ?**

గోవిందప్ప, కురాకులతోట, కళ్యాణదుర్గం మండలం

నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగుకు రూ.1.5లక్షలు పెట్టుబడి వ్యయం చేశా. దళారులు రూ.1,500కు అడుగుతున్నారు. అన్ని ధరలు పెరుగుతున్నా మొక్కజొన్న ధరలు తగ్గుతున్నాయి. ఇలాగైతే పంటలు ఎలా సాగు చేయాలి.

**ప్రభుత్వానికి నివేదించాం**పెన్నేశ్వరి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఇది వరకే ప్రభుత్వానికి నివేదించాం. అనుమతులు మంజూరుకాగానే క్షేత్రస్థాయిలో కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

# ప్రజారోగ్య శాఖలో అవినీతి అధికారిదే పెత్తనం

పుట్టపర్తి: ప్రజారోగ్య శాఖలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ అధికారికి శ్రీసత్యసాయి శతజయంతి వేడుకల పనులు అప్పగించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. సదరు అధికారి గతంలో పని చేసిన ప్రతిచోటా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను ఎప్పటికప్పుడు ప్రసన్నం చేసుకుని తనపై చర్యలు లేకుండా జాగ్రత్త పడుతూ వస్తున్నారు. గతంలో ఆయన అక్రమాలకు పాల్పడినట్లు రుజువైనా రాజకీయ అండతో తప్పించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాంటి వ్యక్తికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో పెద్దపీట వేస్తూ రూ.కోట్లు విలువైన అభివృద్ధి పనులను అప్పగించడం గమనార్హం. ఉన్నతాధికారుల ఉదాసీనత వల్లే సదరు అవినీతి అధికారి ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది.

**అవినీతి ప్రస్థానం ఇలా**

పుట్టపర్తి మున్సిపాలిటీలో స్వచ్ఛభారత్ కింద 2014-15 వరకు మరుగుదొడ్లు నిర్మించారు. ఇందులో స్వచ్ఛంద సంస్థలు నిర్మించిన మరుగుదొడ్లతో పాటు సొంతంగా ఇళ్లలో నిర్మించుకున్న మరుగుదొడ్లకు సైతం బిల్లులు మంజూరు చేశారు. ఈ అవినీతి బాగోతంపై అప్పట్లోనే కథనాలు ప్రచురితమయ్యాయి. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక కమిటీని నియమించారు. కమిటీలో అప్పటి డీఈ దుశ్యంత్‌తోపాటు సభ్యులు వివరాలు చేపట్టి రూ.1.36 కోట్లు అవినీతి జరిగినట్లు తేల్చి.. నివేదికను ప్రభుత్వానికి పంపారు. అప్పటి మంత్రి అండతో ఎలాంటి చర్యలు లేకుండా సదరు ఉద్యోగి జాగ్రత్త పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.సదరు అధికారి పుట్టపర్తి మున్సిపాలిటీ నుంచి మడకశిరకు బదిలీ అయ్యారు. అక్కడ ఆరు నెలలు పాటు విధులు నిర్వర్తించారు. 2017-19 మధ్యలో పనులు చేయకుండానే దాదాపు రూ.21.50 లక్షల వరకు గుత్తేదారుల పేరుతో కాజేసినట్లు విశ్వసనీయ సమాచారం. రెండేళ్ల కిందట ఆయన పదోన్నతి పొందారు. ప్రస్తుతం సత్యసాయి శత జయంతి వేడుకల అభివృద్ధి పనులు అప్పగించారు. ఈ పనుల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు అతనిపై దృష్టి సారించకుంటే ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందని ఆ విభాగంలోని ఉద్యోగులే చెబుతున్నారు. **పనులపై ప్రత్యేక దృష్టి: రామ్మోహన్‌రెడ్డి, ప్రజారోగ్యశాఖ ఎస్ఈ** జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో నాణ్యత లోపం, అవినీతికి తావులేకుండా పర్యవేక్షణ చేస్తున్నాం. గతంలో జరిగిన అవినీతిపై ఇచ్చిన నివేదికను పరిశీలిస్తాం. రూ.40 లక్షల వరకు డీఈ స్థాయిలో బిల్లులు మంజూరు చేసే అవకాశం ఉంది. వాటిపైనా ప్రత్యేక దృష్టి పెడతాం.

# ఉపాధి ఉసూరు

పలమనేరు : జిల్లా వ్యాప్తంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మందకొడిగా సాగుతోంది. ప్రభుత్వం కూలీలకు పనులు కల్పించాలనే ఉద్దేశంలో వివిధ రకాల పథకాలను మంజూరు చేసింది. వీటిలో ఫారం పాండ్లు, సప్లై ఛానల్స్, మామిడి మొక్కలు నాటడం, క్యాటిల్ షెడ్లు నిర్మించుకోవడం వంటివి ఉన్నాయి. ఇందులో సగం కూడా పనులు సాగలేదు. వర్షాల కారణంగా ఉపాధి పనులు బాగా మందగించాయి. కూలీలకు పనులు కల్పించాలని పెట్టుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. గత మూడు నెలలుగా వర్షాలు కురవడంతో కూలీలకు పనులు చేసుకునే అవకాశం కలగలేదు. కూలీలు ఉపాధి లేక ఆర్థికంగా నష్టపోతున్నారు. బిల్లులు సక్రమంగా అందలేదు. ఆగస్టు వరకు కొన్ని బిల్లులు మంజూరైనా తర్వాత



బకాయిలు రాలేదు. మరో వారం గడిస్తే వరి కోతలు, వేరుసెనగ నూర్పిడి పనులు మొదలవుతాయి. ఇది ఉపాధి పనులకు అడ్డంకిగా మారనుంది.

వివిధ రకాల మొక్కలు నాటడానికి

పంచాయతీలు: 700

పనులు: 1624

విస్తీర్ణం: 2434 ఎకరాలు

నాటిన విస్తీర్ణం: 2063 ఎకరాలు

ఈ ఏడాదిలో వివరాలిలా. (రూ.కోట్లలో..)

పనుల విలువ: 183.95

వేతనాలు: 99.50

బకాయిలు: 14.60

జాబ్‌కార్డులు: 2.39 లక్షలు


పనులు చేసిన వారు: 1.95 లక్షలు

# సమగ్ర నీటి సమాచారం

నంద్యాల : ప్రతి జీవికి నీరు ప్రాణాధారమే. ఏటా ఒకవైపు వరదలు.. మరోవైపు కరవు పరిస్థితులు ఎదురవుతుంటాయి. ఈ నేపథ్యంలో సాగు, తాగునీటిపై కచ్చితమైన సమాచారం అందించేందుకుగాను రాష్ట్రంలోనే తొలిసారిగా నంద్యాల జిల్లాలో వాటర్ బులెటిన్ ఇవ్వడం ప్రారంభించారు. కలెక్టర్ రాజకుమారి సూచనలతో జలవనరుల శాఖ ప్రతి నెలా వాటర్ బులెటిన్లు ఇచ్చే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. భవిష్యత్తులో నీటి వనరుల నిర్వహణకు మార్గదర్శకంగా నిలిచేలా దీనికి రూపకల్పన చేసింది.కేవలం నీటి సంఖ్యలు, గణాంకాల సమాచారమేకాక రైతులు, ప్రజలు, అధికారులకు ఒక మార్గ సూచికగా బులెటిన్‌ను తీర్చిదిద్దారు. వరద హెచ్చరికలతోపాటు ముందస్తు సమాచారం, ప్రజల భద్రతకు సంబంధించిన సూచనలు ఉంటాయి. ప్రాజెక్టుల వారీగా నీటిమట్టాలు, జలాశయాలు, నదులు, చెరువుల్లో నీటి స్థితి, భూగర్భ జలాల వివరాలు పొందుపరిచారు. నెలవారీగా నీటి లభ్యత, సాగు, తాగునీరు, ఇతర అవసరాలకు అందుబాటులో ఉండే నీటి వివరాలు పొందుపరిచారు. కరవు పర్యవేక్షణ, నీటి కొరతను అంచనా వేయడం.. సంరక్షణపై అవసరమైన సూచనలు ఉంటాయి. ఉదాహరణకు శ్రీశైలం రిజర్వాయరులో ఎంత నీటి మట్టం ఉంది? నిల్వ సామర్థ్యం, ఎంత మేరకు డ్యాం నిండింది.. తాగు, సాగునీటి పరిస్థితి తదితర అంశాలు పొందుపరుస్తారు. ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు గత నెలలో ఎంత నీరు అందించారన్న వివరాలు ఉంటాయి. వర్షపాతం, భూగర్భజల మట్టం వివరాలు తెలుసుకోవచ్చు. **ఉపయోగాలెన్నో..**ప్రతి నెలా విడుదల చేసే నీటి బులెటిన్ల ద్వారా రైతులు నీటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చు.

## లక్కీ ఛాన్స్ కొట్టేసిన సైయారా బ్యూటీ.. ఆ సినిమాటిక్ యూనివర్స్ లో భాగం

ఒక్కొక్కసారి అదృష్టం ఎలా ఉంటుంది అంటే అనూహ్యంగా ఓవర్ నైట్ లోనే స్టార్ సెలబ్రిటీలు అయిపోతూ ఉంటారు. ఆ తర్వాత వారికి వరుసగా అవకాశాలు కూడా తలుపుతడతాయి. అలా ఇప్పటికే ఇండస్ట్రీలోకి వచ్చిన మొదటి సినిమాతోనే భారీ విజయాలను సొంతం చేసుకుని.. వరుస సినిమాలలో అవకాశాలు అందుకున్న హీరోయిన్స్ జాబితాలోకి 'సైయారా' బ్యూటీ కూడా వచ్చి చేరింది. బాలీవుడ్ లో ఈ ఏడాది చిన్న సినిమాగా వచ్చి సంచలనం సృష్టించింది ఈ సినిమా. ఇందులో నటించింది కొత్త నటీనటులు.. అయినా సరే ఏకంగా రూ.600 కోట్ల క్లబ్లో చేరిపోయి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా ఈ సినిమా ఇంత పెద్ద హిట్ అవ్వడానికి కథ కథనంతో పాటు లీడ్ రోల్స్ చేసిన అద్భుతమైన పర్ఫామెన్స్ ముఖ్య కారణం అని చెప్పవచ్చు. ప్రముఖ హీరోయిన్ అనన్య పాండే సోదరుడు అహాన్ పాండే, అనీత్ పడ్డా.. ఇద్దరికీ ఈ సినిమా తొలి సినిమానే అయినా ఏదో నటనలో పూర్తి అనుభవం ఉన్న నటీనటుల్లా నటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. యువత ఈ చిత్రానికి ఎంతలా కనెక్ట్ అయ్యింది అంటే సినిమా పూర్తి అయిన తర్వాత థియేటర్లలోనే ఏడ్చేసిన ఘటనలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. అంతేకాదు సినీ ఇండస్ట్రీలో ఒక యూత్ ఫుల్ రొమాంటిక్ చిత్రానికి యువత కనెక్ట్ అయ్యి ఏడ్చిన ఏకైక చిత్రం ఈ



సైయారా అని చెప్పవచ్చు. ఈ సినిమాతో ఇద్దరికీ అభిమానులు తమ గుండెల్లో గుడి కట్టేశారు అనడంలో సందేహం లేదు. అటు అహాన్ పాండే కూడా ఒక భారీ ప్రాజెక్టులో అవకాశం దక్కించుకోగా.. ఇప్పుడు అనీత్ పడ్డా కూడా ఆ సినిమాటిక్ యూనివర్స్ లో భాగం కాబోతోందని మేకర్స్ స్వయంగా ప్రకటించడంతో అనీత్ పడ్డా అభిమానుల ఆనందానికి అవధులు లేవని చెప్పవచ్చు. అసలు విషయంలోకి వెళ్తే.. అందం , అభినయంతో అందరినీ ఆకట్టుకున్న అనీత్ పడ్డాతో సైయారా విడుదలకు ముందే యశ్ రాజ్ ఫిలిమ్స్ వాళ్ళు ఇంకో మూడు చిత్రాలకు ఆమెతో అగ్రిమెంట్ చేయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా వేరే ప్రొడక్షన్ హౌస్ ల నుంచి కూడా ఈమెకు అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇటు మరోవైపు ప్రస్తుతం బాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బ్యానర్లలో ఒకటైన మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ కూడా ఈమెతో ఒక క్రేజీ మూవీ చేయడానికి ప్లాన్ చేసింది. ఇక అందులో భాగంగానే తాజాగా మ్యాడ్ డాక్ హారర్ కామెడీ యూనివర్స్ లో భాగంగా ఈరోజు భారీ ఎత్తున విడుదలైన చిత్రం థామా. ఈ సినిమా చివర్లో ఈ ఫ్రాంచైజీలో కొత్త సినిమా విశేషాలను పంచుకుంది మ్యాడ్ డాక్ ఫిలిం సంస్థ. 'శక్తి షాలిని' పేరుతో తెరకెక్కుతున్న ఆ చిత్రంలో అనీత్ పడ్డా లీడ్ రోల్ చేయనుంది అంటూ తెలిపింది. అయితే థామా హిందీ వెర్షన్ లో ఈ సినిమా గురించి అనౌన్స్మెంట్ ఇవ్వడంతో అభిమానులు చాలా క్రేజీగా ఫీల్ అవుతున్నారు. రొమాంటిక్ చిత్రం సైయారాతో అందరి దృష్టిని ఆకట్టుకున్న అనీత్ పడ్డా ఇప్పుడు ఈ సినిమాలో హారర్ పాత్రలో కనిపించబోతుందని తెలిసి ఎక్సైట్మెంట్ కనబరుస్తున్నారు.

## శెట్టిబ్యూటీకి సక్సెస్ కలిసొచ్చిన వేళ!

కేజీఎఫ్ తో పాన్ ఇండియా సక్సెస్ అందుకున్నా కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టికి పెద్దగా అవకాశాలు రాని మాట వాస్తవం. కేజీఎఫ్ మొదటి భాగం రిలీజ్ అనంతరం మళ్లీ నాలుగేళ్ల గ్యాప్ అనంతరం కేజీఎఫ్ 2, కోబ్రాలో నటించింది. ఆ తర్వాత మళ్లీ మరో అవకాశం రావడానికి ఏకంగా మూడేళ్లు సమయం పట్టింది. అదీ కన్నడలో కాదు. ఆ అవకాశం కూడా తెలుగులో వచ్చింది. అదే రీసెంట్ రిలీజ్ హిట్ 3. నాని హీరోగా నటించిన సినిమాలో శ్రీనిధి శెట్టి సరైన పాత్ర పోషించి బాగానే ఫేమస్ అయింది. సినిమా విజయం అమ్మడికి కలిసొచ్చింది. గ్లామర్ కు తావు లేకుండా డీసెంట్ రోల్ పోషించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తాను అందాలు ఎరగా వేసి నటించే దాన్ని కాదు..పెర్ఫార్మర్ మాత్రమేనని ప్రూవ్ చేసింది.

**టాలీవుడ్ లో మంచి భవిష్యత్:** తనలో ఆ ట్యాలెంట్ నేడు కొత్త అవకాశాలకు దారి తీసింది. ఇటీవలే రిలీజ్ అయిన తెలుసు కదాలో కూడా నటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా రిలీజ్ కు ముందే వెంకటేష్-త్రివిక్రమ్ సినిమాలో ఛాన్సు అందుకుందనే ప్రచారం జరిగింది. మొన్నటి వరకూ అది ప్రచారమే అయినా నేడు అదే నిజమైంది. సినిమాలో వెంకీకి జోడీగా శ్రీనిధి ఫైనల్ అయింది. ఈ



నేపథ్యంలో శ్రీనిధి శెట్టికి ఇంకా మంచి భవిష్యత్ ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిభతో పాటు గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండటం వంటి కొన్ని లక్షణాలు మిగతా బ్యూటీల నుంచి వేరు చేస్తున్నాయి. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు మాత్రం ఎంచుకుంటూ ముందుకు సాగుతుంది.

**గ్లామర్ పాత్రలకు దూరంగా:** గ్లామర్ గేట్లు ఎత్తేస్తానంటే? అవకాశాలివ్వడానికి చాలా మంది సిద్ధంగా ఉంటారు. కానీ ఆ ఛాన్స్ ఇవ్వకుండా శ్రీనిధి వచ్చిన అవకాశాలతో సంతృప్తి చెందుతుంది. అందులో ది బెస్ట్ సెలక్ట్ చేసుకుంటుంది. అమ్మడు డిజైనర్ దుస్తులకు కూడా దూరంగా ఉంటుంది. సింపుల్ డిజైన్స్ లో ముస్తాబవుతుంది. అందాల ఆరబోతకు ఎంత మాత్రం ఛాన్స్ ఇవ్వదు. సినిమా ప్రచార కార్యక్రమాల్లోనూ పద్దతైన దుస్తులు ధరించి కనిపిస్తుంది. అవన్నీ శ్రీనిధికి తెలుగులో ఓ రకంగా కలిసొచ్చేవే అయినా? మరో రకంగా కొన్ని రకాల ఛాన్సులు కోల్పోయే అవకాశం లేకపోలేదు. ఈ బ్యూటీ తీరు చూస్తుంటే?

**ఆ బ్యూటీ జర్నీలా శ్రీనిధి:** సాయి పల్లవి విధానంలో కనిపిస్తోంది. సాయి పల్లవి ప్రయాణం ఎలా సాగిందన్నది చెప్పాల్సిన పనిలేదు. కెరీర్ ఆరంభం నుంచి గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ కేవలం నటనకు ఆస్కారం ఉన్న సినిమాలు మాత్రమే చేసు కుంటూ వచ్చింది. మధ్యలో పారితోషికం ఆఫర్లు ఎన్ని వచ్చినా? నో ఛాన్స్ అంటూ గీసుకున్న గీత దాటి లేదు. తక్కువ పారితోషికం అయినా? నచ్చిన పాత్రలే చేస్తానంటూ ముందుకు సాగుతుంది. తనలో ఆ క్వాలిటీనే బాలీవుడ్ లో రామాయణం వరకూ దారి తీసింది. రామాయణంలో అమ్మడు సీత పాత్ర పోషిస్తోన్న సంగతి తెలిసిందే. శ్రీనిధి శెట్టి ప్రయాణం కూడా అలాగే సాగుతుందా? అన్నది చూడాలి.




## ది బ్లాక్ గోల్డ్: 'విరూపాక్ష' బ్యూటీ హై వోల్టేజ్ యాక్షన్ మోడ్




హీరోయిన్ అంటే కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం అనే రోజులు పోయాయి. కంటెంట్‌కు ప్రాధాన్యత ఉన్న పాత్రలతో, తమ నటనతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లే నటీమణులకు ఇప్పుడు మంచి డిమాండ్ ఉంది. అయితే, పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో, కథను మొత్తం తమ భుజాలపై మోసే లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు మాత్రం మన దగ్గర చాలా అరుదుగా వస్తాయి. ఈ లోటును తీర్చడానికే అన్నట్లు, ఒక టాలెంటెడ్ బ్యూటీ ఇప్పుడు యాక్షన్ అవతారం ఎత్తింది. 'విరూపాక్ష', 'డెవిల్' వంటి చిత్రాలతో నటిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న సంయుక్త, ఇప్పుడు తన కంఫర్ట్ జోన్‌ను దాటి, ఒక డేరింగ్ స్టెప్ వేసింది. ఆమె నెక్స్ట్ సినిమా ఫస్ట్ లుక్ చూస్తే ఎవరికైనా గూస్‌బంప్స్ రావడం ఖాయం. ఆమె నెక్స్ట్ లెవెల్ పర్ఫార్మెన్స్‌కు సిద్ధమవుతున్న చిత్రం 'ది బ్లాక్ గోల్డ్'. దీపావళి కానుకగా మేకర్స్ విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో హైలెట్ అవుతోంది. చేతిలో గన్, ముఖంపై గాయాలు, ఒంటిపై రక్తపు మరకలతో, చుట్టూ శవాల మధ్య ఎంతో పవర్‌ఫుల్‌గా, ఇంటెన్స్‌గా నిలబడి ఉన్న సంయుక్త లుక్ అదిరిపోయింది. ఆమె కళ్లలో కనిపిస్తున్న కసి, సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతోందో చెప్పకనే చెబుతోంది. ఈ పోస్టర్‌ను దర్శకుడు యోగేష్ KMC చాలా స్టైలిష్‌గా ఫ్రేమ్ చేశారు. వెనుక రైల్వే స్టేషన్ బ్యాక్‌డ్రాప్, వస్తున్న ట్రైన్.. ఇవన్నీ చూస్తుంటే ఒక కొత్త యాక్షన్ స్టార్ ఇండియన్ స్క్రీన్‌పైకి అడుగుపెట్టబోతున్నారనే ఫీలింగ్‌ను కలిగిస్తోంది. 'ది బ్లాక్ గోల్డ్' అనే టైటిల్ కూడా చాలా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది ఎలాంటి గురించిన కథ, సంయుక్త ఎవరిపై ఈ యుద్ధం చేస్తోంది? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ఈ చిత్రాన్ని నిర్మాత రాజేష్ దండ, సింధు మాగంటి భారీ బడ్జెట్‌తో, పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్లకు తన బీజీఎంతో ప్రాణం పోసే సామ్ సి.ఎస్. ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటం మరో పెద్ద ప్లస్ పాయింట్. ఇది ఒక అడ్వెంచరస్, యాక్షన్ ప్యాక్డ్ చిత్రంగా, ప్రేక్షకులకు ఒక డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుందని చిత్రయూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. మొత్తం మీద, ఈ ఫస్ట్ లుక్ అయితే సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. గ్లామర్ రోల్స్‌తో పాటు, ఇలాంటి పవర్‌ఫుల్ పాత్రలను కూడా చేయగలనని సంయుక్త నిరూపించుకోవడానికి సిద్ధమైంది. మరి ఆమెకు ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి.

## పెద్ది వర్సెస్ ప్యారడైజ్.. ఎవరు తగ్గట్లేదంతే..!





సంక్రాంతి, దసరా మాత్రమే కాదు సమ్మర్ కి ముందు అంటే మార్చి ఎండింగ్ కూడా సినిమాలకు కలిసి వచ్చే సీజన్ లా భావిస్తున్నారు మేకర్స్. ఎందుకంటే మార్చిలో కొంతమంది స్టూడెంట్స్ కి ఎలాగు ఎగ్జామ్స్ పూర్తవుతాయి. ఆ తర్వాత ఏప్రిల్ లో ఎలాగు సమ్మర్ హాలీడేస్ ఇస్తారు. అందుకే ఆ సీజన్ లో సినిమాలు రిలీజ్ అయితే మంచి సక్సెస్ అయ్యే ఛాన్స్ లు ఉంటాయని దర్శక నిర్మాతలు అలా ఫిక్స్ అయ్యారు. ఐతే ఈసారి అదే నెక్స్ట్ ఇయర్ 2026 మార్చి ఎండింగ్ కి రెండు సినిమాలు ఫైట్ జరగబోతున్నాయి. అందులో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పెద్ది ఒకటి రేసులో వస్తుండగా న్యాచురల్ స్టార్ నాని ది ప్యారడైజ్ కూడా వస్తుంది.

**రెండు సినిమాలు రెండు డిఫరెంట్ జోనర్..** మార్చి 26న నాని ది ప్యారడైజ్ వస్తుంటే.. ఒకరోజు తర్వాత మార్చి 27న పెద్ది రిలీజ్ డేట్ ఫిక్స్ చేశారు. ఐతే ఆరోజు చరణ్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ అనుకున్నారు. ఐతే మళ్లీ రిలీజ్ డేట్ ఒకరోజు ముందు అంటే మార్చి 26నే ఫిక్స్ చేస్తున్నారని టాక్. ఐతే ఈ రెండు సినిమాలు రెండు డిఫరెంట్ జోనర్ సినిమాలుగా వస్తున్నాయి. నాని శ్రీకాంత్ ఓదెల కంప్లీట్ గా వాళ్ల సేఫ్ జోన్ వదిలి భారీ ప్రయోగాన్నే చేస్తున్నారు. ది ప్యారడైజ్ లో జడల్ రోల్ లో నాని కనిపించబోతున్నాడు. ఈ రోల్ తో నాని మరోసారి తన సత్తా చాటుతాడని అంటున్నారు. ఐతే ఈ సినిమా కాన్సెప్ట్ ఇంకా స్క్రీన్ ప్లే అంతా కూడా నాని సత్తానికి చాటుతాయని అంటున్నారు. పెద్ది విషయంలో బుచ్చి బాబు చరణ్ కూడా అంతే కాన్ ఫిడెంట్ గా ఉన్నారు. సినిమాలో చరణ్ లుక్ ఇంకా స్టోరీ అంతా కూడా వేరే లెవెల్ లో ఉంటాయట. తప్పకుండా మెగా ఫ్యాన్స్ కి ఒక రేంజ్ లో మాస్ ఫీస్ట్ ఇచ్చేలా పెద్ది వస్తుంది.

**పెద్ది సినిమాలో శివ రాజ్ కుమార్.. ప్యారడైజ్ లో మోహన్ బాబు..** పెద్ది సినిమాలో శివ రాజ్ కుమార్ స్పెషల్ ఎట్రాక్షన్ కానున్నారు. అలానే నాని ది ప్యారడైజ్ లో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ గా నటిస్తున్నారు. పెద్ది, ది ప్యారడైజ్ ప్రస్తుతం రేసులో రెండు సినిమాలు ఉన్నాయి. ఈ సినిమాల ఫైట్ మాత్రం ఇంట్రెస్టింగ్ గా ఉండబోతుంది. రెండు సినిమాలు ఎక్కడ ఏమాత్రం తగ్గకుండా తెరకెక్కిస్తున్నారు. చరణ్ తో నాని పోటీ అనేదాని కన్నా రెండు సినిమాలు తెలుగు ఆడియన్స్ కు మరో సరికొత్త సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించే ఛాన్స్ ఉంటుందని చెప్పొచ్చు.

ఇక్కడ మరో విశేషం ఏంటంటే ది ప్యారడైజ్ డైరెక్టర్ శ్రీకాంత్ కూడా తొలి సినిమా దసరాతో బ్లాక్ బస్టర్ కొట్టాడు.. బుచ్చి బాబు కూడా ఉప్పెనతో సెన్సేషనల్ హిట్ కొట్టి రెండో సినిమా పెద్ది చేస్తున్నాడు. డైరెక్టర్స్ కూడా తమ రెండో సినిమా ది బెస్ట్ అనిపించుకునేలా చేయాలని ఎఫర్ట్స్ పెడుతున్నారు.

## సీతమ్మ ఇలా స్లో అయితే ఎలా?

బాలీవుడ్ నటి అలియాభట్ సినిమాలు చేయడంలో స్పీడ్ తగ్గించిందా? పెళ్లికి ముందులా పెళ్లి తర్వాత పని చేయడం లేదా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. 2012 లో అమ్మడు స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ తో కెరీర్ మొదలు పెట్టింది. అప్పటి నుంచి 2022 వరకూ ఒకే వేగంతో సినిమాలు చేసింది. ఆ వేగానికి తగ్గట్టే సక్సస్లు పడ్డాయి. 20-25 సినిమాల వరకూ ఒకే జోరుతో పని చేసింది. కానీ వివాహం అనంతరం అమ్మడు వేగం పూర్తిగా తగ్గించేసింది. 2022-25 మధ్య చూసుకుంటే కేవలం మూడు నాలుగు సినిమాలు మాత్రమే కనిపిస్తున్నాయి. 2022 లో ఒకే ఏడాది నాలుగు సినిమాలతో ప్రేక్షకుల మధ్యలో ఉంది. అదే ఏడాది అమ్మడికి రణబీర్ కపూర్ తో వివాహమైంది. అప్పటి నుంచి ఏడాదికి ఒక సినిమా మాత్రమే రిలీజ్ లో ఉండేలా ప్లాన్ చేసుకుని ముందుకు సాగుతుంది. 2023 లో రాకీ ఔర్ రానీకి ప్రేమ్ కహానీ, హాలీవుడ్ చిత్రం హార్ట్ ఆఫ్ స్టోన్ తో ప్రేక్షకుల్లో ఉంది. అటుపై 2024 లో జిగ్రా తో అలరించింది. 2025



లో మాత్రం ఆల్ఫాతో అలరించడానికి రెడీ అవుతుంది. మరి అలియాలో వేగం తగ్గడానికి అసలు కారణం ఏంటి? అంటే సినిమాలు- ఫ్యామిలీ లైఫ్ ని బ్యాలెన్స్ చేసే క్రమంలోనే కొత్త ప్రాజెక్ట్ లు కమిట్ అవ్వడంలో ఆచితూచి వ్యవహరిస్తుంది. అవకాశాలు క్యూలో ఉన్నా అలియా మాత్రం సెలక్టివ్ గా వెళ్తుంది.పెళ్లికి ముందులా కాకుండా డిఫరెంట్ కాన్సెప్ట్ లు ..పక్కాగా హిట్ అవుతాయి? అన్న కథలవైపే అడుగులు వేస్తోంది. ఏడాదికి ఒక సినిమా రిలీజ్ కు ఉండేలా చూసుకుంటుంది. ఆల్ఫా డిసెంబర్ లో రిలీజ్ కు రెడీ అవుతుంది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతున్న చిత్రమిది. అలియా ప్రధాన పాత్రలో తెరకెక్కిన స్పై థ్రిల్లర్ ఇది. యశ్ రాజ్ ఫిలింస్ తొలిసారి ఓ లేడీతో స్పై సినిమా చేయడం విశేషం. ఈ సినిమా అనంతరం 2026లో అమ్మడు లవ్ అండ్ వార్ తో ప్రేక్షకుల ముందుకు రానుంది. అటు పై ఏ సినిమాలు చేస్తుంది? అన్నది లవ్ అండ్ వార్ చిత్రీకరణ ముగింపు దశకు వచ్చే వరకూ గానీ క్లారిటీ రాదు. అయితే అలియా భట్ ఇలా నెమ్మదిగా సినిమాలు చేయడంపై ఆమె అభిమానులు సోషల్ మీడియా వేదికగా అంసతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. మునుపటిలా సినిమాలు చేయాలంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు. మరి ఈ అభ్య ర్ధనలను అలియాభట్ ఎలా తీసుకుంటుందో చూడాలి.

## రకుల్ మళ్లీ టాలీవుడ్ ప్రయత్నాలా?

రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్ కి దూరమై నాలుగేళ్లు అవుతుంది. కొండపొలం తర్వాత అమ్మడు పూర్తిగా బాలీవుడ్ కే పరిమితమైంది. అక్కడ అవకాశాలతోనే నటిగా బిజీ అయింది. కానీ సక్సస్ లు మాత్రం చెంత చేరలేదు. అవకాశా లైతే ఓడిసి పట్టుకుంటుంది గానీ? విజయాలు మాత్రం ఎక్కడా కనిపించలేదు. నాలుగేళ్లలో ఎనిమిది ..తొమ్మిది హిందీ సినిమాలు చేసింది. వాటిలో సక్సస్ భూతద్దం పెట్టి వెతికినా ఎక్కడా కనిపించదు. అయినా అవకాశాలు మాత్రం ఎక్కడా తగ్గలేదు. ప్రస్తుతం లైనప్ లో రెండు..మూడు సినిమాలున్నాయి. వాటిపై ఎలాంటి బజ్ కూడా లేదు.

**అప్పుడలా నిరాశతో నోరు జారి:** మరి ఇలాంటి ఫేజ్ లో ఉన్న రకుల్ మళ్లీ టాలీవుడ్ ప్రయత్నాలు మొదలు పెట్టిందా? అంటే అవుననే తెలుస్తోంది. అమ్మడు గత పరిచయస్తులకు మళ్లీ టచ్ లో కి వెళుందిట. పాత మేనేజర్ ని మళ్లీ రంగంలోకి దించి దర్శక, నిర్మాతలకు టచ్ లో ఉండే ప్రయత్నం చేస్తుందిట. అలాగే రామ్ చరణ్-ఉపాసన



దంపతులకు రకుల్ మంచి స్నేహితురాలు అన్న సంగతి తెలిసిందే. అటువైపు నుంచి కూడా అమ్మడు చేయాల్సిన ప్రయత్నాలు చేస్తోందిట. మరి కంబ్యాక్ ఛాన్స్ ఎవరైనా ఇస్తారా? లేదా? అన్నది చూడాలి. వాస్తవానికి రకుల్ టాలీవుడ్ లో అవకాశాలు వస్తోన్న సమయంలోనే వదిలి బాలీవుడ్ కి వెళ్లింది. పాన్ ఇండియా సినిమాల్లో ఛాన్సులు రాలేదు? అన్న నిరాశ కూడా రకుల్ లో ఉంది.

**పూజాహెగ్డే కంటే పవర్ ఫుల్ గా విసిరిందే:** ఓ సందర్భంలో టాలీవుడ్ పై అసహనాన్ని కూడా వ్యక్తం చేసింది. కొందరికే పాన్ ఇండియా చిత్రాల్లో అవకాశాలు ఇస్తున్నారని..ఎంతో కాలంగా పరిశ్రమలో తన లాంటి సీనియర్లను పట్టించుకోలేదనే ఆవేదన వ్యక్తం చేసింది. ఆ విమర్శల్ని టాలీవుడ్ సీరియస్ గా తీసుకుంటే మాత్రం కంబ్యాక్ కష్టమే. పూజాహెగ్డే కూడా టాలీవుడ్ అవకాశాల్ని కాదని బాలీవుడ్ కి వెళ్లింది. అటుపై అంతే వేగంగా సౌత్ లో మళ్లీ అవకాశాలు కోసం ప్రయత్నించింది. లక్కీగా కోలీవుడ్ ఆదుకోవడంతో? కంబ్యాక్ అవ్వగలిగింది. కానీ టాలీవుడ్ మాత్రం పూజకు అవకాశాలివ్వడం లేదు.

**ప్రయత్నాలు ఫలించక:** ప్రయత్నాలు చేస్తున్నా? అవి అక్కడికే పరిమితమవుతున్నాయి తప్ప కన్సిడర్ చేసే పరిస్థితి కనిపించలేదు. మరి పూజాహెగ్డే కంటే రెండు ఆకులు ఎక్కువే విసిరిన రకుల్ కి టాలీవుడ్ అవకాశాలు ఇస్తుందా? లేదా? అన్నది చూడాలి.

ప్రస్తుతం రకుల్ హిందీలో దే దే ప్యార్ దే 2 లో నటిస్తోంది. దీంతో పాటు పతీ పత్నీ ఔర్ హూ దూ చిత్రంలోనూ నటిస్తోంది. ఇందులో దే దే ప్యార్ దే 2 వచ్చే నెలలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536